

ఒంగోలులో ఓటు వేసిన అనంతరం భార్యాపిల్లలతో జనార్దన్





ఓటు వేసి బయటకు వచ్చిన అనంతరం టీడీపీ వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్, మార్కాపురం అభ్యర్థి నారాయణరెడ్డి










ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం కుటుంబ సభ్యులతో టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట, కొండపి అభ్యర్థి స్వామి, కనిగిరి అభ్యర్థి ఉగ్ర , కుటుంబ సభ్యులతో గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి

ప్రజాస్వామ్య స్ఫూర్తిని, ఓటు ప్రాధాన్యతను జిల్లాలోని ఓటర్లు చాటి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనేందుకు పోటెత్తారు. పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా అన్ని చోట్లా సోమవారం పోలింగ్‌కు ముందే కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో ఓటింగ్ ప్రారంభ సమయమైన ఉదయం 7 గంటలకే అనేక చోట్ల కేంద్రాలు కిటకిటలాడాయి. అయితే ఓటర్ల ఉత్సాహానికి అనుగుణంగా కాకుండా నెమ్మదిగా పోలింగ్ కొనసాగడంతో గంటల తరబడి క్యూలైన్‌లలో నిల్చోవలసి వచ్చి అవస్థపడ్డారు. తొలుత కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ప్రారంభంలో కొంత జాప్యం జరిగింది. అదేసమయంలో యంత్రాలు స్పీడ్‌గా పనిచేయకపోవడంతో ఓటింగ్ నెమ్మదిగా సాగింది. అనేక చోట్ల వైసీపీ నేతలు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడ్డారు. ఒంగోలులో కవ్వింపు చర్యలకు దిగారు. అయినప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం, కొన్ని చోట్ల వైసీపీ నేతలకు వత్తాసుగా వ్యవహరించడం విమర్శలకు తావిచ్చింది.







ఓటర్లు పోటెత్తారు..



- వెల్లువెత్తిన చైతన్యం
- పోలింగ్ సమయానికి ముందే కేంద్రాల వద్ద బారులు
- రోజంతా కొనసాగిన క్యూలైన్‌లు
- వేగంగా పనిచేయని మిషన్లు
- తొలుత నెమ్మదిగా పోలింగ్
- గంటల కొద్దీ నిరీక్షణతో అసహనం
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలతో ఆలస్యంగా ప్రారంభం
- 83.51 శాతం పోలింగ్
- అరకొర సౌకర్యాలు.. మండుటెండతో అవస్థలు
- కమాండ్ కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ముగిసింది. ఉదయం ఆరు నుంచి ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు ఏజెంట్ల నమోదు, మాక్ పోలింగ్ నిర్వహణ, ఇతర చర్యలు చేపట్టారు. అయితే ఆ సమయానికే చాలా కేంద్రాలకు ఓటర్లు రావడం ప్రారంభమైంది. పోలింగ్ మొదలయ్యే సమయానికి పలు కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అత్యధిక శాతం పోలింగ్ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ఏ సమయంలో చూసినా వందల సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో కనిపించారు. సాధారణంగా ఉదయం పేద వర్గాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లు ఉండటం కనిపిస్తుంది. అయితే ఈసారి మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలు అధికంగా ఉండే చోట్ల ప్రత్యేకించి అర్బన్ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో బారులు తీరి కనిపించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటం, సోమవారం తెల్లవారుజామున కొద్దిపాటి జల్లులు పడటంతో వీలైనంత త్వరగా ఓటు వేయాలన్న ఆతృత ఆవర్గాల్లో కనిపించింది.

మొరాయించిన ఈవీఎంలు

ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలిరాగా, ఆ జోరు ప్రక్రియ కొనసాగడంలో కనిపించ లేదు. చాలాచోట్ల ఓటు వేసేందుకు గంటల కొద్దీ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. కొన్ని చోట్ల తొలుత ఈవీఎంలు పని చేయకుండా మొరాయించడంతో అర్ధగంట నుంచి గంటపాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అధిక కేంద్రాలలో ఈవీఎం మిషన్లు పనిచేయాల్సినంత వేగంగా పనిచేయక చాలా నిదానంగా ఓటింగ్ సాగింది. గంటకు 50 ఓట్లు మించి పోల్ కాని పరిస్థితి నెలకొంది. దీంతో ఓటు వేసేందుకు క్యూలో ఉన్నవారు దాదాపు రెండేసి గంటలపాటు అలాగే నిల్చోనాల్సి వచ్చింది.

పొద్దుపోయే వరకూ కొనసాగిన ఓటింగ్

పోలింగ్ ప్రారంభమైన తొలి రెండు గంటల్లో ఉదయం 9గంటలకు చూస్తే జిల్లాలో సగటున 9.83శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి 11 గంటలకు 24.56శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 40శాతం, మూడు గంటలకు 52.03శాతం ఓటింగ్ జరిగింది. అధికారుల సమాచారం మేరకు అర్ధరాత్రి ఒంటి గంటకు జిల్లావ్యాప్తంగా సుమారు 83.51శాతం మేర ఓట్లు పోల్ అయినట్లు సమాచారం. పోలింగ్ ముగిసే సాయంత్రం ఆరు గంటల సమయానికి మూడొంతుల కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉండటంతో అప్పటి వరకు ప్రాంగణంలోకి వచ్చిన వారిని అనుమతించి రాత్రి పొద్దుపోయే వరకు వారు ఓట్లు వేసుకొనేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొత్తం పోలింగ్ ప్రక్రియను ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోలు రూం నుంచి, ఎస్పీ తన కార్యాలయం నుంచి పర్యవేక్షించారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. భారీగా పోలీసు సిబ్బంది, ఇతర పార్టీలను ఏర్పాటు చేశామని అధికారులు ప్రకటించినా ఆ పరిస్థితి, ప్రభావం ఎక్కడా కనిపించ లేదు. వైసీపీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు తెగబడ్డారు.

కేంద్రాల వద్ద ఓటర్ల అవస్థలు

ఎండ తీవ్రత ఉదయం 11 గంటల నుంచే అధికంగా ఉండగా ఉపశమనం కలిగించే ఏర్పాట్లు ఆయా కేంద్రాల వద్ద కరువయ్యాయి. దీంతో ఓటర్లు అవస్థపడ్డారు. చాలాచోట్ల ఒకే ప్రాంగణంలో ఐదారు కేంద్రాలు ఉండటంతో ఓటు వేసేందుకు తరలివచ్చిన వందలాది మంది ఓటర్లు అక్కడ సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురయ్యారు. పక్కపక్క కేంద్రాల్లో ఎవరిది ఏ కేంద్రమో అర్థంకాక గందరగోళానికి గురయ్యారు. అలాంటి పరిస్థితిని గుర్తించి చక్కదిద్దే సిబ్బంది ఎక్కడా కనిపించ లేదు. దీని వల్ల ఉత్సాహంగా, భారీగా ఓటర్లు తరలివచ్చినా అధిక ప్రాంతాల్లో ఓటింగ్ నిదానంగా సాగింది.





చివర్లో.. బరితెగింపు!



బొట్లపాలెంలో వైసీపీ దాడిలో గాయపడిన నరేంద్ర

- ఓటమి భయంతో అలజడులు సృష్టించిన వైసీపీ
- దర్శి, చీరాల టీడీపీ అభ్యర్థులపై దాడికి యత్నం
- పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి హల్‌చల్
- కూటమికి ఆధిక్యత వచ్చే గ్రామాల్లో దౌర్జన్యాలు
- దొంగ ఓట్లకు ప్రయత్నాలు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పోలీసులు
- తిప్పికొట్టిన తెలుగుదేశం శ్రేణులు

ఓటమి భయం ఆవరించిన వైసీపీ శ్రేణులు పలుచోట్ల పోలింగ్ చివర్లో బరితెగించారు. పోలీసుల ప్రత్యక్ష, పరోక్ష సహకారంతో టీడీపీ శ్రేణులను బెదరగొట్టి దొంగోట్లు వేసుకునేందుకు విఫలయత్నం చేశారు. పూర్తిస్థాయి పోలీసు సహకారంతో దర్శి, చీరాలలో కూటమి అభ్యర్థులపై దాడికి యత్నించారు. వైపాలెం వైసీపీ అభ్యర్థి పోలింగ్ బూత్‌లో హల్‌చల్ చేశారు. ఒంగోలులో పోలింగ్ కేంద్రాల వద్ద అదేస్థాయిలో వైసీపీ అభ్యర్థి దౌర్జన్యం చేయగా... మార్కాపురంలో కూటమి అభ్యర్థి కుమారుడిపై దాడికి యత్నించి వాహనాన్ని ధ్వంసం చేశారు. దాదాపు అన్నిచోట్లా పోలీసుల తోడ్పాటు వైసీపీకి లభించగా.. స్థానిక ప్రజల సహకారంతో కూటమి అభ్యర్థులు వైసీపీ అరాచకాలను అడ్డుకోగలిగారు. మిగిలినచోట్ల చెదురుమదురు ఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలలో పోలింగ్ ప్రారంభ సమయం కన్నా ముందే ఓటర్లు కేంద్రాలకు పోటెత్తారు. జిల్లాలో పోలింగ్ 80శాతం జరిగిందంటే ఓటర్లు ఏ స్థాయిలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పరుగులెత్తారో అర్థమవుతోంది. యువత, కొత్తగా ఓటుపొందిన వారు, సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం, ఉద్యోగుల కుటుంబీకులు, వ్యాపారులు, వృద్ధులు ముందుగా ఓటు కోసం పరుగెత్తడం, వారిలో టీడీపీ కూటమి అనుకూల వాతావరణం కనపడటం బహిరంగంగానే దీంతో మధ్యాహ్నం నుంచి వైసీపీ నాయకుల్లో భయాందోళన ఆరంభమైంది. ఆ పార్టీ అభ్యర్థులు పోలీసుల సహకారంతోపాటు అల్లరిమూకలను రంగంలోకి దించారు. దీంతో దర్శి, వైపాలెం, మార్కాపురం, చీరాల ఒంగోలు, అద్దంకిలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి.

దర్శిలో చోద్యం చూసిన పోలీసులు

దర్శి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోతే పోలీసులు చోద్యం చూశారు. తొలుత టీడీపీకి ఆధిక్యత లభించే బొట్లపాలెంలో ఆపార్టీ కార్యకర్తలపై దాడిచేశారు. బత్తిన నరేంద్రతోపాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తేలేదు. టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి, ఆమె సోదరుడు భరత్ తదితరులు ఆ గ్రామానికి వెళ్లి పార్టీశ్రేణులకు అండగా ధర్నాకు దిగాల్సి వచ్చింది. వైసీపీకి పూర్తి ఆధిక్యత ఉన్న ఎర్రఓబినేనిపల్లిలో టీడీపీ గట్టి పోటీనిచ్చింది. దీంతో ఒక టీడీపీ ఏజెంటును వైసీపీ శ్రేణులు బహిరంగంగానే బయటకు లాగి చితక్కొట్టారు. ఎంతకూ అక్కడకు పోలీసులు వెళ్లకపోవడంతో ఆ గ్రామస్థులు దర్శి వచ్చి ఆర్వో కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తే కానీ పోలీసులు కదలలేదు. దర్శి నగరపంచాయతీలోనూ వైసీపీ మూకలు బరితెగించాయి. ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ వైసీరెడ్డిపై పోలింగ్ కేంద్రంలోనే దాడిచేశాయి. అయినా పోలీసులు ఆయన మీదే కేసుపెట్టారు. రాత్రి 7 గంటల తర్వాత మరో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణుల హడావుడిని నివారించేందుకు లక్ష్మి అక్కడకు వెళ్లగా ఆమెపై దాడికి యత్నించారు. డ్యూటీలో ఉన్న మాలకొండయ్య అనే సీఐ దాడిచేసిన వారిని వదిలేసి టీడీపీ కార్యకర్తలపై లాఠీ ఎత్తారు. క్షణాల్లో భారీగా టీడీపీ శ్రేణులు చేరితేకానీ పోలీసు అధికారులు రంగంలోకి రాలేదు.

పుల్లలచెరువు మండలంలో కాల్పులు

వైపాలెంలో టీడీపీకి పూర్తి ఆధిక్యత ఉన్న ముటుకుల లోని పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ వెళ్లి హల్‌చల్ చేశారు. పోలింగ్ అధికారి అతనికి సెల్యూట్ కొట్టారు. పోలీసులు చూసీచూడనట్లు జారుకున్నారు. టీడీపీ కార్యకర్తలు అక్కడే ఉండి ఓటర్లను బెదిరిస్తున్న వైసీపీ అభ్యర్థిని బయటకు పంపాలని ధర్నాకు దిగారు. దీంతో ఓ పోలీసు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరపడంతో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. అదే మండలంలో గతంలో వైసీపీకి ఆధిక్యత ఉన్న పీఆర్‌సీతండాలో గిరిజనులు టీడీపీలోకి వెళ్లిపోవడంతో వైసీపీ అభ్యర్థి అక్కడికి వెళ్లి హల్‌చల్ చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన సుబ్బారెడ్డి స్వగ్రామంలోనూ వైసీపీ శ్రేణులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. అక్కడా పోలీసులు ప్రేక్షకపాత్రే పోషించగా ప్రజలే అల్లరిమూకలను తరిమికొట్టారు. పొదిలి మండలం నందిపాలెంలో వైసీపీకి మంచి ఆధిక్యత ఉంది. అక్కడ ఈ పర్యాయం టీడీపీ పక్షాన ఏజెంట్లు కూర్చున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు అలజడి సృష్టించాయి. టీడీపీ కూటమి అభ్యర్థి నారాయణరెడ్డి కుమారుడు ఆ గ్రామానికి వెళ్లగా అతనిపై దాడికి యత్నించి కొందరు కార్యకర్తలను గాయపరిచారు. ఆయన వాహనాన్ని ధ్వంసం చేశారు. డ్యూటీలో ఉన్న సీఐ ఉమేష్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించటమే దాడికి కారణమైంది. సాయంత్రం మార్కాపురంలో ఓ కేంద్రంలో పూర్తిగా టీడీపీ కూటమికి అనుకూలంగా పోలింగ్ జరుగుతుందని తెలిసి అక్కడికెళ్లి వైసీపీ శ్రేణులు అల్లరి సృష్టించాయి. టీడీపీ శ్రేణులు అల్లరి మూకలను ధైర్యంగా ఎదుర్కోగా రంగంలోకి వచ్చిన పోలీసులు టీడీపీ శ్రేణులపైనే లాఠీచార్జ్ చేశారు. చీరాల టీడీపీ అభ్యర్థి కొండయ్య యాదవ్‌పై వైసీపీ నేతలు దాడిచేసేందుకు ప్రయత్నించగా స్థానికులు కాపాడారు.

ఒంగోలులోనూ దౌర్జన్యం

ఒంగోలులోనూ టీడీపీ కూటమికి అనూహ్యమైన ఆధిక్యత లభిస్తుందని భావించిన వైసీపీ శ్రేణులు అలజడికి భారీప్రయత్నం చేశారు. గతంలో ఆపార్టీకి ఆధిక్యత వచ్చి ఈపర్యాయం తిరగబడుతున్న త్రోవగుంటలో స్థానిక శ్రేణుల మధ్య చిన్న వివాదం నెలకొనగా వైసీపీ అభ్యర్థి బాలినేని రావడంతో వివాదం పెద్దదైంది. పోలీసులు సరైన రీతిలో వ్యవహరించకపోవడమే ఉద్రిక్తతకు దారి తీసింది. అదే గ్రామంలోని వడ్డెపాలెం బూత్‌లో రాత్రి 9 గంటలకు కూడా పోలింగ్ జరుగుతుండగా అప్పటికీ ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఉమామహేశ్వర కాలేజీ బూత్‌ల వద్ద తొలుత టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడిచేశాయి. తర్వాత టీడీపీ శ్రేణులు వారిని వెతికిపట్టుకుని ప్రతిదాడి చేశాయి. సాయంత్రం 5 గంటల తర్వాత కూడా పోలింగ్ జరుగుతున్న కేంద్రాలలో వైసీపీ అనుకూల ఓటర్లకు అనుమతి ఇవ్వాలని మిగిలిన వారిని పక్కకుపంపాలని వైసీపీ నాయకులు, అధికారులు పోలీసులపై ఒత్తిడి చేస్తున్న ఘటనలు ప్రత్యక్షంగా కనిపించాయి. ఎస్ఎన్‌పాడులో ఒక సచివాలయాన్ని వైసీపీ శ్రేణులు ప్రచార కేంద్రంగా మార్చుకోగా కిందిస్థాయి అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేస్తే కానీ పోలీసు, రెవెన్యూ సిబ్బంది రంగంలోకి వచ్చి వారిని ఖాళీ చేయించలేదంటే పోలీసుల సహకారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.






చీమకుర్తిలో క్యూలైన్‌లో ఉన్న ఓటర్లు


ఒంగోలులోని ఎఫ్‌సీఐ గోదాము సమీపంలో..


త్రోవగుంటలో కిక్కిరిసిన పోలింగ్ బూత్

భవిష్యత్తు కోసం బారులు!

సమయం ముగిసేవరకు ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు
అధికశాతం ఓటు వేసిన వృద్ధులు, మహిళలు, యువత
త్రోవగుంట, ఒంగోలులో వైసీపీ నేతల దౌర్జన్యాలు


వీల్‌ఛైర్‌లో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధుడు


చీమకుర్తిలో...


ఒంగోలులో ఓటర్లకు నమస్కరిస్తున్న మాగుంట



ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చిన మహిళలు


త్రోవగుంటలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఒంగోలు(కార్పొరేషన్), మే 13: ఒంగోలులో ఓటు వేసేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. పోలింగ్ ప్రారంభ సమయం 7గంటలకు ముందే పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. మండుతున్న ఎండను సైతం లెక్క చేయకుండా ప్రజాతీర్పు ఇచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపారు. దీంతో నగరంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో సాయంత్రం పోలింగ్ సమయం 6గంటలు దాటినా ఇంకా వందల సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. ఇదిలా ఉంచితే గతం కన్నా, ఈ ఎన్నికల్లో వృద్ధులు అధికశాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కనీసం కాలు కింద పెట్టలేని స్థితిలో ఉన్న వృద్ధులు సైతం ఎండను లెక్కచేయకుండా రాష్ట్ర భవిష్యత్ కోసం, తమ తీర్పును ఇచ్చేందుకు విచ్చేడంతో పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిటకిటలాడాయి. ఇక తొలిసారిగా ఓటుహక్కు కలిగిన యువత అత్యధికంగా హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకుని తమ భవిష్యత్తుకు, ఉద్యోగ, ఉపాధి, అవకాశాల కోసం తమ తీర్పు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. ప్రత్యేకించి పోలింగ్ ప్రారంభ సమయం నుంచే వృద్ధులు, మహిళలు యువత క్యూలో నిలబడగా తమ ఓటును వేసేందుకు సుమారు మూడు, నాలుగు గంటల సమయం పట్టింది. అయితే ఒకవైపు మండుతున్న ఎండలు, ఉక్కపోతలు ఇబ్బంది పెట్టినా ఓటర్లు మాత్రం వెనుకడుగు వేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఒంగోలు మండల పరిధి గ్రామాలలో, ఒంగోలు కార్పొరేషన్ విలీనమైన గ్రామాలలోనూ ఓటింగ్ శాతం పెరిగింది. అయితే అధికార పార్టీ ప్రలోభాలకు గురి చేసినా, తాయిలాలు భారీగానే అందజేసినా ప్రజలు తమ భవిష్యత్, రాష్ట్ర సంక్షేమం కోసం అవసరమైన నాయకుడును ఎన్నుకునేందుకు బారులు తీరారు.

టీడీపీ నేతలపై వైసీపీ దౌర్జన్యాలు

సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సజావుగా సాగుతుండగా, భారీగా ఓటర్లు హాజరు కావడంతో వైసీపీ నేతల్లో ఒకింత ఆందోళన కనిపించింది. దీంతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి, ఓటింగ్ విధానాన్ని గందరగోళానికి గురిచేసే ప్రయత్నాలు చేపట్టారు. త్రోవగుంట వద్ద ఓ పోలింగ్ స్టేషన్‌కు వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి విచ్చేయగా, అక్కడ వైసీపీ తరుపున బాధ్యతలు చేపడుతున్న సాంబయ్య అనే వ్యక్తి నానా హడావుడి చేశాడు. తమ నాయకుడు వద్ద మెప్పు కోసం ఓటర్లను ప్రలోభపెట్టి తమకు అనుకూలంగా ఓట్లు వేయాలని ఆదేశించారు. దీనిని టీడీపీ నాయకులు రాఘవరావు అభ్యంతరం తెలియజేయడంతో భౌతికదాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. వైసీపీ నేతల తీరుతో విస్తుపోయిన ఓటర్లు, వారి దౌర్జన్యాలపై బహిరంగంగానే విమర్శలు చేయడంతో పాటు, ఓటుతో గుణపాఠం చెప్పాలని చర్చించుకోవడం కనిపించింది.

ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ వద్ద..

నగరంలోని లాయరుపేటలోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అయితే బాలినేని రాకతో ఆయన వెంట ఎక్కువ మంది నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యకర్తలు రావడంతో పోలింగ్ సిబ్బంది, పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో వైసీపీ కార్యకర్తలు గందరగోళం సృష్టించారు. ఓటర్లు భయభ్రాంతులకు గురి చేశారు. అరగంటపాటు అక్కడ పోలింగ్ స్టేషన్ వద్ద వైసీపీ చేసిన హడావుడి, ప్రశ్నించినవారిపై దౌర్జన్యాలపై ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మీడియాతో మాట్లాడుతూ పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఎన్‌డీఏ కూటమికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

స్థానిక మంగమూరురోడ్‌లోని ఉమామహేశ్వర కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డారు. మధ్యాహ్నం 2-30 గంటల సమయంలో వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి అక్కడకు రాగా, ఆయన వెంట ఉన్న కార్యకర్తలు హడావుడి చేశారు. దీంతో పార్టీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఆ తర్వాత బాలినేని అక్కడ నుంచి వెళ్ళిపోయిన తర్వాత అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తపై నలుగురు యువకులు, ఓ మహిళ కలిసి మోర్ ఎదుట నడిరోడ్డుపై దాడి చేశారు. చొక్కా చినిగిపోయే వరకు కొట్టారు.

పలు చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు

ఒంగోలు(కలెక్టరేట్): ఒంగోలు నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం స్వల్ప ఉద్రిక్తతలు జరిగాయి. స్థానిక మంగమూరు రోడ్డులోని ఒంగోలు పబ్లిక్ స్కూలులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య మూడుసార్లు స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలింగ్ రోజున ఎన్నికల ప్రచారం చేయకూడదని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేసినా ఆయా పోలింగ్‌కేంద్రాల వద్ద అవేమి కనిపించలేదు. దీంతో ఒంగోలు పబ్లిక్ స్కూలు వద్ద నాలుగు పర్యాయాలు రెండు పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కాగా మధ్యాహ్నం మూడు గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లు ఉండటంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకొకవైపు వృద్ధుల కోసం మూడు చక్రాల సైకిళ్ళు ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారులు ప్రకటించినా ఉపయోగం లేకుండా పోయింది. కొన్ని కేంద్రాల వద్ద కేవలం ఒక్క సైకిల్‌ను మాత్రమే ఏర్పాటు చేయడంతో తమ కుటుంబ సభ్యులు వృద్ధులు, దివ్యాంగులను ఎత్తుకొని పోలింగ్ కేంద్రాల్లోకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అదే విధంగా మామిడిపాలెంలోని పోలింగ్ కేంద్రంతో పాటు ఎస్ఎస్ఎన్ జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ కేంద్రాలు, పీవీఆర్ బాలుర పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి.

అవీ..ఇవీ..

ఓటుహక్కును వినియోగించుకున్న కలెక్టర్



నూతన ఓటరుతో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 13: జిల్లా ఎన్నికల అధికారైన కలెక్టర్ దినేష్‌కుమార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం స్థానిక సంతపేటలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర దివ్యాంగుల వసతి గృహంలో ఏర్పాటు చేసిన 157వ పోలింగ్ కేంద్రంలో దినేష్‌కుమార్ ఓటు వేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా జిల్లాలో 2,183 పోలింగ్ కేంద్రాలలో 14వేల మందికి పైగా పోలింగ్ సిబ్బందిని విధులకు కేటాయించినట్లు చెప్పారు. రాజ్యాంగం ప్రసాదించిన ఓటుహక్కును అర్హులందరూ వినియోగించుకునేలా జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలతో పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇదే పోలింగ్ కేంద్రంలో తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న ఒక యువతితో కలిసి కలెక్టర్ సెల్ఫీపాయింట్‌లో ఫొటో దిగారు.

నాగులుప్పలపాడు మండలంలో స్వల్ప ఘటనలు

● రాత్రి వరకు కొనసాగిన పోలింగ్


బి.నిడమానూరులో బారులు తీరిన ఓటర్లు

నాగులుప్పలపాడు మే 13: నాగులుప్పలపాడు మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ స్వల్ప ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని 74 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. పోలింగ్ అధికారుల నిర్లక్ష్యంతో ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 20 నిమిషాలు ఆలస్యంగా మొదలయింది. కాగా బినిడమానూరు, రాపర్ల, మాచవరం లోని 187,239,237,238 పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీకి చెందిన ఓ వ్యక్తి పలువురు వృద్ధ ఓటర్ల ఓట్లను నమోదు చేస్తుండటంతో తెలుగుదేశం నాయకులు అడ్డు చెప్పడంతో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. తోపులాటలతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోతవరం, అమ్మనబ్రోలులోని 193, 248 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎం మిషన్లు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. రాపర్లలో ఈవీఎంలు నెమ్మదిగా పనిచే యడంతో సాయంత్రం నాలుగు గంటలైనా 50 శాతం కూడా పోలింగ్ నమోదు కాక క్యూలైన్‌లో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం ఏడు గంటలకు 80.3 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. వైసీపీ అభ్యర్థి మేరుగ నాగార్జున తన అనుచరులతో గుంపుగా రాపర్లలోని పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని తనకు ఓటు వేయాలని ఓటర్లను కోరడంతో టీడీపీ, జనసేన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాత్రి 7 గంటలు దాటినా పలుచోట్ల పోలింగ్ కొనసాగింది.

బీటెక్ విద్యార్థినికి పోస్టల్ బ్యాలెట్..!

● మొదటిసారి ఓటు వేయలేక నిరాశ చెందిన యువతి


ఓటు కార్డుతో శ్రావణి

ఒంగోలు(కార్పొరేషన్), మే 13 : అధికారుల నిర్వాకంతో తనకు మొదటిసారిగా వచ్చిన ఓటు హక్కును వినియోగించుకోలేక ఓ విద్యార్థిని నిరాశ చెందింది. స్థానిక సీతారాంపురానికి చెందిన లక్ష్మీ శ్రావణి ఇంద్రగంటి లక్ష్మి క్విస్‌కాలేజీలో ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతోంది. ఆమెకు మొదటిసారిగా ఓటు హక్కు లభించింది. ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లగా మీ ఓటు ఇక్కడ లేదు. పోస్టల్ బ్యాలెట్ లిస్ట్‌లో ఉందని తెలపడంతో అవాక్కయింది. దీంతో ఆమె అక్కడే ఉన్న ఎన్నికల అధికారులను అడగ్గా, తామేమీ చేయలేమని తేల్చి చెప్పారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన లక్ష్మీ శ్రావణి అధికారుల నిర్లక్ష్యం వలన తాను ఓటు హక్కు కోల్పోయానని, ఉద్వేగంగా చూపారని వాపోయింది. ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), మే 13: ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి కుటుంబ సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక రామనగర్ రెండో లైన్‌లోని మునిసిపల్ స్కూలులో మాగుంటతో పాటు ఆయన సతీమణి గీతాలత, కుమారుడు నిఖిల్‌రెడ్డిలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అంతకుముందు రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో దివంగత మాగుంట సుబ్బరామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.


ఓటుకార్డు చూపుతున్న ఓటర్లు





ఒంగోలులో ఓటుహక్కు వినియోగించుకునేందుకు వస్తున్న దివ్యాంగులు, వృద్ధులు

గడువు ముగిసినా ఓట్లేస్తాం..!

పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని వైసీపీ నేతల దౌర్జన్యం
వైసీపీకి అనుకూలంగా నిబంధనలు ఉల్లంఘించిన ఆర్డీవో


ఆర్డీవో చెప్పారని సమయం ముగిసినా పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లను తీసుకెళ్తున్న వైసీపీ నేత

ఒంగోలు (కార్పొరేషన్), మే 13 : ప్రజాతీర్పు ముగిసింది. ఓటరు నిర్ణయం ఈవీఎం బాక్సుల్లో భద్రమైంది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఉదయం 7గంటల నుంచి 6గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, అప్పటికే పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఉంటే వారి ఓటు వినియోగించుకునే అవకాశం ఉంది. వైసీపీ శ్రేణులు తమకు అనుకూలంగా ఓట్లు వేయించుకునేందుకు కొందరు ఉద్దేశ్యపూర్వకంగా పోలింగ్ సమయం ముగిసిన తర్వాత పలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల్లోకి చొరబడ్డారు. నిబంధనల ప్రకారం కాకుండా 6గంటల తర్వాత, 6-30 తర్వాత కూడా వారు పోలింగ్ కేంద్రాల్లోకి వచ్చి ఓటు వేసే ప్రయత్నాలు చేశారు. అక్కడే ఉన్న టీడీపీ ఏజెంట్లు ప్రశ్నించడంతో వారిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలకు దిగారు. స్థానిక వెంగముక్కలపాలెంలో 6-30 గంటల సమయంలో బాలినేని కోడలు కావ్యశ్రీ తన అనుచరులతో ఓ పోలింగ్ కేంద్రానికి రావడంతోపాటు, తన వెంట ఉన్న ఓటర్లను లోపలికి అనుమతించాలని కోరింది. దీనిపై అధికారులు సైతం మౌనం వహించగా, సమయం ముగిసిన తర్వాత ఎలా అనుమతిస్తారని టీడీపీ ఏజెంట్లు ప్రశ్నించారు. దీంతో ఆగ్రహించిన కావ్యశ్రీ టీడీపీ ఏజెంట్‌పై చేయిచేసుకోవడంతో అక్కడ వైసీపీ కార్యకర్తలు మరింత రెచ్చిపోయి దాడులకు తెగబడ్డారు.


టీడీపీ ఏజెంట్లపై దాడి చేస్తున్న బాలినేని కోడలు కావ్యశ్రీ

వెంగముక్కలపాలెం వెళ్లకుండా టీడీపీ శ్రేణుల అడ్డగింత

వెంగముక్కలపాలెంలో టీడీపీ ఏజెంట్‌లపై వైసీపీ నాయకురాలు, బాలినేని కోడలు కావ్యశ్రీ చేయి చేసుకోవడంతో విషయం తెలుసుకున్న టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్, జనసేన అధ్యక్షులు షేక్ రియాజ్‌తోపాటు మరి కొందరు టీడీపీ ఏజెంట్లను పరామర్శించేందుకు వెంగముక్కలపాలెం బయలుదేరి వెళ్లగా, గ్రామంలోకి వెళ్ళకుండా పోలీసులు అడ్డుకున్నారు. కారు అడ్డుపెట్టి మరీ టీడీపీ వారిని అడ్డుకోవడంతో వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు.

ఆర్డీవో అత్యుత్సాహం. వైసీపీకి సహకారం

కాగా ఒంగోలులోని స్థానిక గోరంట్ల మల్టీప్లెక్స్ సమీపంలోని ఆగ్జిలియం స్కూలు పోలింగ్ కేంద్రంలో ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుబ్బారెడ్డి వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తోంది. పోలింగ్ సమయం ముగిసిన అరగంట తర్వాత కొందరు వైసీపీ శ్రేణులు ఓటు వేయాలంటూ అక్కడకు విచ్చేయగా గేటు వద్ద ఉన్న పోలీసులు అభ్యంతరం తెలిపారు సమయమం ముగిసిన తర్వాత అనుమతించేది లేదని తేల్చి చెప్పగా, అక్కడే ఉన్న ఆర్డీవో సుబ్బారెడ్డి వారిని లోపలకు అనుమతించాలని ఆదేశించారు. అధికారిగా కాకుండా వైసీపీ కార్యకర్తగా వ్యవహించారు. దీంతో వైసీపీ సానుభూతిపరులు తమ ఓటు వేసేందుకు బారులుదీరారు. అయితే దీనిని టీడీపీ ఏజెంట్‌లు తప్పుబట్టినా, ఆర్డీవో పెడచెవిన పెట్టడం చూసిన అక్కడి వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆర్డీవో ఇలా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంచితే రాత్రి ఏడుగంటల సమయంలోనూ అదే స్కూలులో వైసీపీ ఏజెంట్‌లు పోలింగ్ బూత్‌లోనే ఉండగా, టీడీపీ ఏజెంట్‌లను బయటకు పంపివేసి, వైసీపీ ఏజెంట్‌లకు పలావులు పంచిపెట్టడం, వారికి సపర మర్యాదలు చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ కూటమి విజయం ఖాయం

మద్దిపాడు, మే 13: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ కూటమి విజయం ఖాయమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మండవ రంగారావు, మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షులు రెబ్బవరపు ప్రభాకర్ దీమా వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన పోలింగ్ సరళి టీడీపీ కూటమికి అనుకూలంగా ఉందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

మద్దిపాడులో ప్రశాంతంగా ఎన్నికలు

మద్దిపాడు, మే 13: మద్దిపాడు మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా 9 వరకు మందకొడిగా సాగిన పోలింగ్ తర్వాత ఊపందుకుంది. మండలంలో పెద్దకొత్తపల్లి, నరసాయపాలెం, మారెళ్లగుంటపాలెం గ్రామాల్లో బీఎస్ఎఫ్ జవాన్లు బందోబస్తు నిర్వహించారు. మండలంలో 56 పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఐ మహేష్ చర్యలు తీసుకున్నారు. ఇక ఇనమనమెళ్లూరు, బసవన్నపాలెం, లింగంగుంట గ్రామాల్లో మొబైల్ పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేశారు.

ఎస్ఎన్‌పాడులో ఓటర్ల ఉత్సాహం


సంతనూతలపాడులో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఒంగోలు(క్రైం), మే12: సంతనూతలపాడు మండలంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాత్రి పొద్దు పోయే వరకు ఓటర్లు ఓపికగా క్యూలో నిల్చుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. మండలంలో సాయంత్రం ఆరు గంటల వరకు 79.5 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 2,14,638 ఓటర్లకు 1,70,637 మంది ఓటు వేశారు. ఇంకా పేర్నమిట్ట, సంతనూతలపాడు, మంగమూరు, వేములపాడు గ్రామాల్లో రాత్రి పొద్దు పోయే వరకు పోలింగ్ జరిగింది. వేములపాడులో ఈవీఎం పనిచేయక అరగంట పాటు పోలింగ్ నిలిచింది. అనంతరం అధికారులు వెంటనే ఈవీఎంను తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. కాగా సంతనూతలపాడులో మధ్యాహ్నం తెలుగుదేశం, వైసీపీ కార్యకర్తలు స్వల్ప ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. ఇంకా ఎక్కడా ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా పోలింగ్ ప్రశాతంగా జరగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా యువకులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పోలింగ్‌లో పాల్గొన్నారు. తొలిసారిగా ఓటుహక్కు వినియోగించుకున్నవారు ఎక్కువ మంది అభివృద్ధిని కాంక్షిస్తూ ఓటు వేసినట్లు చెప్పారు. అదే విధంగా వృద్ధులు సైతం కేంద్రాలకు వీల్‌ఛైర్‌లో వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఉద్రిక్తతల నడుమ పోలింగ్

కొత్తపట్నం రెడ్డిపాలెంలో వైసీపీ, టీడీపీ శ్రేణుల బాహాబాహి
గమళ్లపాలెంలో బాలినేని తనయుడు ప్రణీత్‌రెడ్డిని పోలింగ్ బూత్ నుంచి బయటకు పంపిన టీడీపీ నాయకులు


పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ప్రణీత్‌రెడ్డిని వెళ్లిపోవాలంటూ అడ్డుకుంటున్న టీడీపీ వర్గీయులు

కొత్తపట్నం(ఒంగోలునగరం) మే 13: స్వల్ప ఉద్రిక్తతల నడుమ కొత్తపట్నం మండలంలో పోలింగ్ కొనసాగింది. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ ముమ్మరంగా జరగ్గా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉదయం ఏడు గంటలకే కేంద్రాల వద్ద బారులు తీరారు. మండలంలోని రెండు, మూడు కేంద్రాల వద్ద ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. ఉదయం 10గంటల సమయంలో కొత్తపట్నం రెడ్డిపాలెం పోలింగ్ కేంద్రం సమీపంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు బాహాబాహికి దిగాయి. కొత్తపట్నం-ఈతముక్కల రోడ్డులో ఇరు వర్గాలు ఎక్కువ సంఖ్యలో చేరి తలపడ్డారు. దీంతో ఈ మార్గంలో కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సాంబశివరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

అలాగే గమళ్ళపాలెం పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత తీవ్ర స్థాయికి చేరింది. వైసీపీ అభ్యర్థి బాలినేని శ్రీనివాసరెడ్డి తనయుడు ప్రణీత్‌రెడ్డి పోలింగ్ కేంద్రంలోనికి వెళ్ళటంతో అక్కడే ఉన్న తెలుగుదేశం నాయకులు బలగాని నారాయణ, అతని వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రం నుంచి అతనని బయటకు పంపించాలంటూ పట్టుపట్టారు. టీడీపీ వర్గీయులు కూడా పోలింగ్ కేంద్రంలోనికి చొరబడి ప్రణీత్‌రెడ్డి బయటకు పంపించేందుకు ప్రయత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సైతం టీడీపీ వర్గీయులను నిలువరించలేకపోయారు. వారి ఆందోళనతో పోలింగ్ కేంద్రంలో గందరగోళం నెలకొంది. బాలినేని ప్రణీత్ రెడ్డి ఈ కేంద్రం వద్దకు రాకముందు తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత కేంద్రం బయట నుంచే పరిశీలించి వెళ్లిపోయారు. అయితే ప్రణీత్‌రెడ్డి కేంద్రంలోని వెళ్లటాన్ని అభ్యతరం వ్యక్తం చేస్తూ టీడీపీ వర్గీయులు ఎక్కువ సంఖ్యలో చేరి ప్రణీత్‌రెడ్డిని బలవంతంగా బయటకు పంపించి వేశారు. ఈ సందర్భంలో ప్రణీత్‌రెడ్డిపై అరుపులు, కేకలు వేస్తూ ఆయనను బయటకు పంపించే వరకు శాంతించలేదు.

రాత్రి వరకు జరిగిన పోలింగ్

కాగా మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది. ఈవీఎంలు సక్రమంగా పనిచేయకపోవటం, పోలింగ్‌లో పలుమార్లు అంతరాయం ఏర్పడటంతో రాత్రి 8 గంటల వరకు కూడా పాదర్తి, గమళ్ళపాలెం వంటి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటూనే ఉన్నారు. ఇక గుండమాల, అల్లూరు తదితర గ్రామాల్లో కూడా రాత్రి వరకు పోలింగ్ జరుగుతూనే ఉంది. కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద కూడా వైసీపీ, టీడీపీ వర్గీయులు పలుమార్లు వాదోపవాదనలకు దిగారు.

స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం


● ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 13: జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూములో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పర్యవేక్షిస్తూ సంబంధిత అధికారులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చినట్లు చెప్పారు. పోలింగ్‌ప్రక్రియ ప్రారంభమైన మొదటి, మూడు గంటల్లో ఓటర్లు పెద్దసంఖ్యలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని తెలిపారు. పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు చాలా బాగా పనిచేశారన్నారు. సాయంత్రం ఆరు గంటలలోపు పోలింగ్ కేంద్రాల క్యూలైన్లలో చేరుకున్న ప్రతి ఓటరు తమ ఓటు వేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో యువ ఓటర్లు ఎక్కువ సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. కాగా జిల్లాలో సోమవారం రాత్రి కూడా కొనసాగుతున్న పోలింగ్ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్లతో కలిసి వెబ్‌కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మయూర్ కె మెహత, పోలీస్ అబ్జర్వర్ హసీబ్ ఉర్ రెహమాన్‌లు ఉన్నారు. జిల్లాలోని పలు కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్‌ను పరిశీలించి సూచనలు చేశారు.

దర్శి నియోజకవర్గంలో ఈవీఎంను కొట్టిన యువకుడిపై క్రిమినల్ కేసుకు ఆదేశం

సాధారణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పోలింగ్ తీరును జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ దినేష్‌కుమార్ పర్యవేక్షించారు. కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోలు రూములో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్‌ను పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలిస్తూ ఎక్కడైనా ఏదైనా ఘటన జరిగితే వెంటనే దినేష్‌కుమార్ సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. దర్శి నియోజకవర్గంలోని 132వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను కొట్టిన యువకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఈవీఎంను కొట్టినా ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలింగ్ జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. వైపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు మండలం శతకోడులో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. వెంటనే పరిస్థితిని అదుపులోకి తెచ్చి పోలింగ్ కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇలా నిరంతరం వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ ఎక్కడైనా ఏదైనా చిన్న ఘటన జరిగిన వెంటనే సంబంధిత అధికారులతో పాటు జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కూడా చర్చించారు. ఇంకొక వైపు వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించే ఉద్యోగులు కూడా నిరంతరం వెబ్‌కాస్టింగ్‌ను తిలకిస్తూ ఎక్కడైనా ఏదైనా చిన్న ఘటన జరుగుతున్నా వెంటనే కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధంగా టు తీసుకున్నారు.


ఓటు వేసినట్లు చూపుతున్న సత్య


వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

ఓటు వేసిన ఎమ్మెల్యే స్వామి, సత్య

టంగుటూరు, మే 13 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా స్వగ్రా మం మండలంలోని తూర్పునాయుడుపాలెంలో సోమవారం తమ ఓటు హక్కును టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య విని యోగించుకున్నారు. వీరు ఓటు వేసి బయటకు వచ్చాక వేలికి వేసిన ఇంకు గుర్తును జనాలకు చూపించారు. వెంటనే వారు వేరువేరుగా నియోజకవర్గంలో ఎన్నికల పర్యవేక్షణకు వెళ్లారు.

ఓటు హక్కు వినియోగించుకున్న లక్ష్మణరెడ్డి


కారుమంచి(టంగుటూరు) : మండలంలోని కారుమంచికి చెందిన సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తన ఓటు హక్కును ఆయన స్వగ్రామం కారుమంచిలో వినియోగించుకు న్నారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా లక్ష్మణ రెడ్డి కారుమంచి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చెదురుమదురు సంఘటనలు మినహా ఎన్నికలు ప్రశాం తంగా ముగిశాయన్నారు. నేటి ఆసార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన రాజకీయపార్టీలు రూ.20వేల కోట్ల రూపాయలు వ్యయం చేసి ప్రజా స్వామ్యాన్ని ధన స్వామ్యంగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధురాలిని చేతులపై మోసుకొని...

కారుమంచి(టంగుటూరు) మే 13 : ఆమె 90 ఏళ్ల వృద్ధురాలు. పేరు చొప్పర సుబ్బులు. మండలంలోని కారుమంచి గ్రామం. వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి ఉండేది ఎవరో, పోయేది ఎవరో, అందుకే తానూ ఓటు వేయాలని ఆవృద్ధురాలు ఆశించింది. కానీ బూత్ వరకు ఎవరు తీసుకెళ్తారని ఆమె చూస్తోంది. ఇంతలో కారుమంచికే చెందిన బత్తుల వర్ధన్ నేనున్నానంటూ ముందుకు వచ్చాడు. వృద్ధురాలిని చేతులపై మోసుకొని నేరుగా పోలింగ్ బూత్‌కు చేర్చాడు. ఆమెతో ఓటు వేయించి తిరిగి క్షేమంగా ఇంటికి చేర్చాడు. వర్ధన్ గ్రామంలో తెలుగుదేశం కూటమి ప్రతినిధి కావడం విశేషం.

వృద్ధురాలి దాహం తీర్చిన జయంత్‌బాబు

టంగుటూరు, మే 13 : ఆమె ఏడు పదుల వయస్సు దాటిన వృద్ధురాలు. ఎండనపడి ఓటు వేసేందుకని టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌కు వచ్చింది. ఇంటి వద్ద నుంచి ఎండనపడి వచ్చిన ఆవృద్ధురాలు ఎండ వేడిమికి తహతహలాడుతూ అక్కడే ఉన్న బలపై కూలబడింది. ఎన్నికల సందర్భంగా హైస్కూల వద్దనే ఓటర్ల సేవలో ఉన్న టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు ఆమె పరిస్థితిని గమనించి వాటర్ బాటిల్ అందుకొని ఆమెకు అందించారు. వెంటనే బాటిల్ అందుకొని నీళ్లు తాగి సేదతీరింది. తన దాహం తీర్చిన జయంత్‌బాబుకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.


వృద్ధురాలి దాహం తీరుస్తున్న జయంత్‌బాబు

పోటెత్తిన ఓటర్లు

నియోజకవర్గంలోని 30 కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకు కొనసాగిన పోలింగ్
సాయంత్రం 5 గంటలకు 67శాతం పోలింగ్
ఓటర్లకు నీడ సౌకర్యం మృగ్యం
స్వల్ప ఉద్రిక్తతలు
భారీగా వచ్చిన వలస ఓటర్లు

కొండపి, మే13: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొండపి నియోజకవర్గంలో ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం 6గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకున్నారు. క్రమంగా పోలింగ్ కోసం అధికారులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, టెంట్‌లు దాటి వెలుపలకు ఓటర్లు క్యూలైన్లు పెరిగిపోయాయి. స్కూళ్ల పరిధి దాటి వెలుపలకు ఓటర్లు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లలో ఓటర్లు తగ్గలేదు. మధ్యాహ్నం 2నుంచి 3 గంటల మధ్యన తగ్గినా, తర్వాత క్రమంగా మళ్లీ ఓటర్లు క్యూలైన్లు నిండిపోయారు. కాగా పోలింగ్ చాలా కేంద్రాల్లో 7.30 నిమిషాలు దాటిన తర్వాత మొదలైంది. పీవోలు చాలా జాగ్రత్తగా ఈవీఎం మెషిన్లను సమాయత్తం చేశారు. పోలింగ్ ప్రక్రియను కూడా అధికారులు నెమ్మదిగా నిర్వహించారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి, ఇతర జిల్లాల నుంచి ఓటర్లు స్వగ్రామాలకు శని, ఆదివారాల్లో చేరుకున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బేల్దారీ పనులు చేసే కూలీలు అధికంగా స్వగ్రామాలకు చేరారు. ప్రధానంగా కొత్తగా ఓటు వచ్చిన యువకులు ఈసారి ఉత్సాహంగా ఓటేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా అధికంగానే గ్రామాల్లో కనిపించారు. తాము ఓటు వేసేందుకు వచ్చామని ఉత్సాహంగా చెప్పారు. మహిళలు, వృద్ధులు కూడా ఓటేసే విషయంలో ఎక్కడా అలసత్వం ప్రదర్శించలేదు. సాయంత్రం 5 గంటలకు నియోజకవర్గంలో 68 శాతం పోలింగ్ అయ్యిందని రిటర్నింగ్ అధికారులు తెలిపారు. కొన్ని గ్రామాల్లో సాయంత్రానికి 90 శాతంపైగా పోలింగ్ జరిగిందని కొండపి మండలంలోని ముప్పవరం, మిట్టపాలెం, చోడవరం, పెరిదేపి గ్రామాల ఓటర్లు తెలిపారు.


కొండపిలోని హైస్కూల్‌లో 135వ నెంబరు బూత్‌లో ఉదయం 8గంటలకే బారులు తీరిన ఓటర్లు


పొన్నలూరులోని హైస్కూల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు బారులు తీరిన ఓటర్లు

పలు చోట్ల ఘర్షణలు

ఎన్నికల సందర్భంగా పోలీసు బందోబస్తు పోలింగ్ కేంద్రాల వద్ద తక్కువగా ఉంది. మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్న చోట కూడా ఒక్కరూ పోలీసు విధులు నిర్వహించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో అదనపు బలగాలు ఉంచారు. పోలీసులు లేని చోట్ల ఓటర్లు తాము ముందు వేయాలంటే తాము ముందు ఓటేయాలని పోటీ పడ్డారు. దీంతో వారిమధ్య వాదనలు, వివాదాలు ఏర్పడ్డాయి. కొండపి మండలంలోని కోయవారిపాలెం గ్రామానికి చెందిన బొల్లినేని కృష్ణ అనే వైసీపీ నాయకుడు నెలరోజుల కిందట టీడీపీలో చేరారు. సోమవారం గ్రామంలో పోలింగ్ ఏజెంట్‌గా ఉన్నాడు. ఓటుకు వచ్చిన తనభార్యతో మాట్లాడుతుండగా వైసీపీకి చెందిన ముగ్గురు రామకృష్ణపై, అతనిభార్యపై దాడిచేశారు. దీంతో ఉద్రిక్తత ఏర్పడింది. గాయపడిన రామకృష్ణ భార్యను కొండపి వైద్యశాలకు తరలించారు. రామకృష్ణ కొండపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో వైసీపీ ఏజెంట్ పీవోను దుర్భాలాడుతూ, కుర్చీని పైకి విసరబోయాడు. పీవో ఫిర్యాదు మేరకు ఏజెంట్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలింగ్ కేంద్రం వెలుపలకు తీసుకెళ్లారు. అదేవిధంగా పచ్చవలో సీతారామయ్య అనే టీడీపీ ఏజెంట్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. నర్సింగోలులో ఇరువర్గాలవారు మోహరించి వాదులాడుకున్నారు. చేతులు కలుపుకోబోగా సమాచారం అందుకున్న సింగరాయకొండ సీఐ రంగనాథ్, జరుగుమల్లి ఎస్సై వై. వెంకటేశ్వరరావు ఇరువర్గాల వారిని వారించారు. ఆయాపార్టీల నాయకులిచ్చిన సమాచారంతో వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గ్రామానికి చేరుకున్నారు. సీఐ ఇరువురిని గ్రామం నుంచి పంపించి పోలింగ్ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా పొన్నలూరు మండలంలోని వేంపాడు, ముప్పాళ్ల, వెంకుపాలెం, ఎడ్లూరుపాడు గ్రామాల్లో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణలు తలెత్తాయి. పోలీసుల రాకతో సర్దుమణిగాయి.

రాత్రి 9గంటల వరకు పోలింగ్

కాగా నియోజవకర్గంలోని 30కిపైగా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ రాత్రి 9 గంటల వరకు జరిగింది. కొండపి మండలంలోని కొండపి, అనకర్లపూడి, కె.ఉప్పలపాడు గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాల్లో, మర్రిపూడి మండల కేంద్రంలో మరికొన్ని గ్రామాల్లో, జరుగుమల్లి మండంలోని పచ్చవ, కొత్తపాలెం, కామేపల్లి మరికొన్ని గ్రామాలు, పొన్నలూరు మండలంలోని పొన్నలూరు, నాగిరెడ్డిపాలెం, మరికొన్ని గ్రామాల్లో పోలింగ్ రాత్రి కూడా జరిగింది.

బారులు తీరిన ఓటర్లు

- క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఓటు వినియోగం
- మంత్రి సురేష్‌ను అడ్డుకున్న అయ్యప్ప నగర్ టీడీపీ నాయకులు

సింగరాయకొండ. మే 13 : మండలంలో ఓటర్లు పోలింగ్ బూత్‌లకు పోటెత్తారు. గంటల తరబడి నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువత భారీ సంఖ్యలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడం స్పష్టంగా కనిపించింది. ఓటర్లు బారులు తీరడంలో అక్కడ అధికారులు వేసిన టెంట్లు సరిపడక ఎండలోనే నిలబడ్డారు. సరిపడా పోలీస్ సిబ్బంది లేకపోవడంతో ఉన్న పోలీసులు నానా ఇక్కట్లు పడ్డారు. అటూ ఇటూ పరుగెత్తలేక తలలు పట్టుకున్నారు. పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్ కొండపి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూత్‌లోకి వెళ్లి బయటకు వస్తూ క్యూలైన్‌లోని ఓటర్లకు వరుసగా అభివాదం చేస్తుండగా అక్కడ టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. క్యూలైన్ల వెంట తిరగడం ఎంటని ప్రశ్నించారు. దీంతో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య కాసేపు వాదులాట జరిగింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపార్టీల వారిని అక్కడ నుంచి పంపించారు. శానంపూడి పంచాయతీ పరిధిలోని బూత్ నెం. 235 దగ్గర 100 మీటర్ల లోపు వైసీపీ నాయకులు గుర్తులు చూపిస్తుండగా టీడీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయ్యప్పనగర్, పెదకనుమళ్ల, చిన కనుమళ్ల, పాకల, ఊళ్లపాలెం, బింగినపల్లి, శానంపూడి గ్రామాల్లో కొన్ని బూత్‌లలో 8 వరకూ కూడా పోలింగ్ జరిగింది.


క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు


మర్రిపూడిలో బారులుతీరిన ఓటర్లు

మర్రిపూడిలో పోలింగ్ ప్రశాంతం

మర్రిపూడి, మే 13 : మండలంలో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండవేడిమిని సైతం లెక్కచేయకుండా ఓటు వేసేందకు ఓటర్లు ఉత్సాహం చూపించారు. మండలంలోని 41పోలింగ్ కేంద్రాల్లో 24,447 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం ఆరుగంటల సమయానికి 18,080 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 8గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది. పోలింగ్ శాతం కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. కెల్లంపల్లి, వల్లాయపాలెం, చిలంకూరు, జువ్విగుంట గ్రామాల్లో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఆయా కేంద్రాలకు చేరుకొని ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పెనుగాలులతో కూడిన వర్షం కురిసినప్పటికి మర్రిపూడి 21, 22 కేంద్రాల్లో వందల సంఖ్యలో ఓటర్లు కదలకుండా క్యూలైన్‌లలో ఉండిపోయారు. చీకటిపడిన తరువాత కూడా పోలింగ్ జరిగే అవకాశం ఉన్న కేంద్రాలలో లైటింగ్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తహసీల్దార్ సుందరమ్మ వీఆర్వోలను ఆదేశించారు. కొండపి శాసనసభ్యులు స్వామి మండలంలోని కూచిపూడి, గంగపాలెం, మర్రిపూడి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ సరళిని నాయకులను అడిగి తెలుసుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దఎత్తున తరలిరావడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పోలింగ్ శాతం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తున్నది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సీహెచ్ శివబసవరాజు ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

ఎన్నికల పర్యవేక్షణలో మాగుంట, పోతుల

టంగుటూరు, మే 13 : సార్వత్రిక ఎన్నికల వేళ టంగుటూరులోని కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్‌ను ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సోమవారం పరిశీలించారు. మాగుంట నేరుగా ప్రభుత్వ కళాశాలలోని పోలింగ్ బూతుల వద్దకు చేరుకున్నారు. అక్కడ ఒకట్రెండు కేంద్రాల్లోకి వెళ్లి ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. క్యూలో ఉన్న ఓటర్లకు నమస్కరిస్తూ కలియతిరిగారు. అక్కడ నుంచి నేరుగా ఆయన మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్‌ను వెంటబెట్టుకొని సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోని పోలింగ్ బూతుల వద్దకు చేరుకున్నారు. అక్కడా ఒకట్రెండు పోలింగ్ బూతుల్లోకి వెళ్లి ఎన్నికల సిబ్బందిని పలుకరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని వారిని కోరారు. క్యూలో నిలిచిన ఓటర్లను పలుకరిస్తూ వారికి నమస్కరించారు. హైస్కూల్ వద్ద మాగుంట ఎన్నికల బిజీలో ఉన్న మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్‌తో కరచాలనం చేశారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన పోతుల

టంగుటూరులోని పురం సెంటర్‌లోని ప్రాథమిక పాఠశాల, ఇంటర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టంగుటూరు శివారు వెంకటాయపాలెంలో పోతుల రామారావు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా విస్తృతంగా పర్యటించారు. ఈప్రాంతాల్లోని పోలింగ్ బూతులను పరిశీలించారు. తన అనుచరులకు టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని ప్రచారం చేస్తూనే ఆయన పోలింగ్ బూతుల్లో పరిస్థితి సమీక్షించారు. ఉదయం ఇంటి వద్ద నుంచి బయలు దేరిన పోతుల మధ్యాహ్నం వరకు వరుసగా పోలింగ్ బూతుల పర్యవేక్షణలోనే గడిపారు. ఆయన వెంట చిడిపోతు వెంకటేశ్వర్లు, పోలినేని వెంకటేశన్, కుందేటి వెంకట్రావు, తులసీరావు, చిడిపోతు కోటేశ్వరరావు ఉన్నారు.


టంగుటూరు కాలేజీలోని పోలింగ్ బూతుల వద్ద ఓటర్లకు నమస్కరిస్తున్న మాగుంట

కొండయ్య, ఆమంచి వాహనాలపై వైసీపీ మూకల దాడి

వాహనాల అద్దాలు ధ్వంసం
పోలీసుల వైఫల్యమంటున్న ఆ పార్టీ శ్రేణులు

చీరాల, మే 13 : వైసీపీ దౌర్జన్యం పరాకాష్టకు చేరింది. వైసీపీ మూకలు దాడులు తెగబడ్డాయి. సోమవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు చీరాల మండలం గవినివారిపాలెంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. కొండయ్యపై కూడా రాయితో దాడికి యత్నించారు. అయితే టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. అంతకు ముందు జరిగిన వైసీపీ మూకల దాడిలో నక్కల వెంకటేశ్వర్లు అనే గ్రామ టీడీపీ నాయకుడు గాయపడ్డాడు. డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, పోలీసు బలగాలు వైసీపీ మూకలను చెదరగొట్టే ప్రయత్నంలో విఫలయ్యారని కూటమి అభ్యర్థి కొండయ్య మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు సమాచారం తెలిపారు. దీనిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. దాడికి పాల్పడ్డ వారిని ఉపేక్షించమని, కూటమి శ్రేణులు కొండయ్యకు అండగా నిలవాలని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇదిలా వుంటే గవినివారిపాలెంలో ముందు జరిగిన ఘర్షణ పూర్తిగా సద్దుమణగక ముందే మరో బజారులో మణికంఠ, గోపిరాజు అనే యువకులను వైసీపీ వర్గీయులు గాయపరిచారు. అందులో మణికంఠ అనే కుర్రాడికి తలకు గాయమైంది. మున్సిపల్ పరిధిలోని పేరాల శ్రుంగారపేటలోని ఓ పోలింగ్ బూత్ వద్దకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ వచ్చిన సమయంలో సమీపంలోని వైసీపీ వర్గీయులు కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమంచి కారుపై దాడిపై చేశారు. ఆమంచికి చెందిన రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆమంచి అనుచరులు పోగయ్యారు. పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు నామ్‌కే వాస్తేగా ప్రయత్నించారని, పోలీస్ వైఫల్యమేనని అక్కడి వారు వ్యాఖ్యానించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులకు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వైసీపీకి చెందిన అంకమ్మరావు అనే వ్యక్తి తనపై దాడిచేశారని, చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. అవుట్ పోస్టు పోలీసులకు ఆమంచి కృష్ణమోహన్, మరో ముగ్గురు తనపై దాడి చేసి గాయపరిచినట్లు పేర్కొన్నారు.


పోలీసులతో మాట్లాడుతున్న ఆమంచి, గుమికూడిన శ్రేణులు (ఇన్‌సెట్లో) దెబ్బతిన్న వాహనం

ఓపిక పట్టండి.. ఎవరినీ వదిలిపెట్టం : కొండయ్య

గవినివారిపాలెం టీడీపీ శ్రేణులపైనా, తన కారుపైనా జరిగిన దాడిపై టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య స్పందించారు. పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ ఓపిక పట్టండి - ఎవరినీ వదిలిపెట్టమన్నారు. ఈ ఊర్లో వారం డాలో, మీరు ఉండాలో తేలుస్తానంటూ శ్రేణులకు భరోసా కల్పించారు. దాడిపై ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు.

ఓటమి భయంతో వైసీపీ రిగ్గింగ్

త్రోవగుంటలో అర్ధరాత్రి వరకు దొంగోట్లు
రీ పోలింగ్‌కు టీడీపీ కూటమి డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), మే 13 : ఓటమి భయంతో వైసీపీ నేతలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. సోమవారం రాత్రి 7 గంటలకు ఒంగోలు నగరపరిధి త్రోవగుంటలోని వడ్డెపాలెం పోలింగ్ కేంద్రంలో అధికారం అండతో అక్రమాలకు పాల్పడ్డారు. ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగియగా, అదేమీ పట్టించుకోకుండా మిగిలిన ఓట్లను పోల్ చేసేందుకు తెగబడ్డారు. పోలీసుల ద్వారా టీడీపీ ఏజెంట్లను భయపెట్టి, బయటకు పంపి, అధికారుల సమక్షంలో యథేచ్ఛగా దొంగోట్లు వేశారు. రాత్రి పదిగంటలు దాటిన తర్వాత కూడా ఓట్లు వేశారు. విషయం తెలిసి అక్కడకు వచ్చి టీడీపీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, అధికారులు పట్టించుకోలేదు. పోలీసులు వారిపై లాఠీలకు పనిచెప్పారు. దీనిపై టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సుబ్బారెడ్డి అక్కడకు చేరుకున్నారు. రిగ్గింగ్ అడ్డుకుని, పరిస్థితిని అదుపు చేయకపోగా, ఆయనే స్వయంగా అక్కడే ఉండి వైసీపీ నేతలను మరింత ప్రోత్సహించడంతో వారు భారీగా రిగ్గింగ్‌కు పాల్పడ్డారు.


త్రోవగుంటలో రిగ్గింగ్ చేస్తున్న వైసీపీ నేతలు

యర్రంవారిపాలెంలో వైసీపీ దౌర్జన్యం

- టీడీపీ పోలింగ్ ఏజెంట్లపై రాళ్లు, కర్రలతో దాడి
- ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే ఏలూరి

యర్రంవారిపాలెం(పర్చూరు), మే 13 : పర్చూరు నియోజకవర్గ పరిధిలోని కారంచేడు మండలం యర్రంవారిపాలెంలో ఎన్నికల నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం సార్వత్రిక ఎన్నికలకు సబంధించి తెలుగుదేశం పార్టీ తరుపున ఏజెంట్‌గా ఉన్న కోటిరెడ్డిపై వైసీపీ నేతలు దాడికి పాల్పడటంతో ఘర్షణ నెలకొంది. టీడీపీకి ఓటు వేసినా, బూత్‌లో ఏజెంట్‌లుగా ఉన్నా చంపాస్తామంటూ కర్రలతో దాడికి పాల్పడినట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఘర్షణ నేపథ్యంలో ఎన్నికల కేంద్రంలో కొంత భయాందోళన పరిస్థితి నెలకొంది. దీంతో బాధితులు కోటిరెడ్డి సోదరులు పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.





మార్కాపురంలో ఉదయాన్నే బారులు తీరిన ఓటర్లు, వెబ్ కాస్టింగ్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా

- ఏడుగంటల నుంచే క్యూ కట్టిన ఓటర్లు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఓటు హక్కును వినియోగించిన నేతలు
- క్యూలైన్ల వద్ద ప్రచారానికి వైసీపీకి యత్నం

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

మార్కాపురం, మే 13: మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మార్కాపురం అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గంలోని 257 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 5.30 గంటలకు పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈవీఎంలన్నీ సక్రమంగా పనిచేస్తున్నట్లు ధ్రువీకరించుకున్నారు. అనంతరం ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సబ్‌కలెక్టర్, రిటర్నింగ్ ఆఫీసర్ రాహుల్ మీనా సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పరిశీలించారు.

బారులు తీరిన ఓటర్లు

మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభానికి ముందే ఓటర్లు క్యూలైన్లలో బారులు తీరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలలు, శ్రీ వెంకటేశ్వర ప్రాథమికోన్నత పాఠశాలలో అధిక సంఖ్యలో ఓటర్లు బారులు తీరారు. వృద్ధులు, వికలాంగులు, బాలింతలకు ప్రత్యేక వసతులు కల్పించక పోవడంతో కొంతమేర ఇబ్బందులు పడ్డారు.

మొరాయించిన ఈవీఎంలు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 65వ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభం కాగానే ఈవీఎం మొరాయించింది. దీంతో సుమారు రెండు గంటలపాటు పోలింగ్ నిలిచిపోయింది. శ్రీవెంకటేశ్వర ప్రాథమికోన్నత పాఠశాలలో ఈవీఎంలో సమస్య తలెత్తగానే వెంటనే మరో ఈవీఎంను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. మండలంలోని చింతగుంట్లలో తొలుత ఓటింగ్ ప్రక్రియ మందగించింది. సాంకేతిక సిబ్బంది సమస్యలు పరిష్కరించడంతో యథావిధిగా కొనసాగింది.

ఓటు హక్కును వినియోగించుకున్న నేతలు

మార్కాపురంలో ఓటుహక్కు ఉన్న రాజకీయ నాయకులు తమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. స్థానిక జవహర్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూనే స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ అభ్యర్థి అన్నా వెంకట రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు వైసీపీ అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డిలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గిద్దలూరు : గిద్దలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో శాసనసభ, పార్లమెంటు ఓటింగ్ ప్రక్రియ పలుచోట్ల చిన్నపాటి ఉద్రిక్తతలు మినహా ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వ్యవసాయ కార్యాలయం పక్కన ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాల పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. అలాగే జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలోని ఒక కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీంతో అరగంట ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని త్వరగా ఓటు వేసి వెళ్లాలన్న ఉద్దేశ్యంతో ఓటర్లు ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ఉదయం 7-7.30 గంటల మధ్యనే చాంతాడంత క్యూలు మొదలయ్యాయి. ఆ క్యూల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. ఎండ వేడిమికి గిద్దలూరులో ఒక మహిళ క్యూలైన్‌లోనే స్పృహతప్పి పడిపోయింది. వైద్యసిబ్బంది వెంటనే సపర్యలు చేపట్టారు. ఇక మండలంలోని గిద్దలూరులోని ఒకటి, రెండు కేంద్రాల వద్ద, అలాగే తిమ్మాపురంలో పోలింగ్ సందర్భంగా చిన్న విషయాలకు టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదాలు సద్దుమనిగాయి.

రాచర్ల మండలం అచ్చంపేటలో టీడీపీ, వైసీపీ శ్రేణులు ఘర్షణ పడగా ఒక టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ముండ్లపాడు పోలింగ్ బూత్‌లో సైతం టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం కనిపించింది. గిద్దలూరు అటవీశాఖ కార్యాలయంలోని పోలింగ్ కేంద్రం వెనుక నుంచి తెలిసిన ఓటర్లను కొందరు సిబ్బంది క్యూలో నిలబెట్టకుండా నేరుగా ఓటింగ్‌కు పంపుతుండడంతో క్యూలో నిలుచున్న ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

కేంద్రాలను పరిశీలించిన అశోక్‌రెడ్డి

పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి సందర్శించారు. పోలింగ్ జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. సరిపడినన్ని టెంట్‌లు లేక ఓటర్లు ఎండలో నిలుచున్న దృశ్యాలను చూసి, అలాగే తాగునీటి సౌకర్యం లేని వైనం గమనించి అశోక్‌రెడ్డి వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని ఎన్నికల అధికారులను కోరారు. వివేకానంద కళాశాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం కేంద్రాల వద్ద తగినంత బందోబస్తు లేకపోవడంతో అశోక్‌రెడ్డి వెంటనే రిటర్నింగ్ అధికారి నాగజ్యోతికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో హుటాహుటిన దిశ డీఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేక పోలీసులతో వివేకానంద కళాశాలలోని పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. బందోబస్తు పెంచాలని, కేంద్రాల వద్ద ప్రచారం చేస్తున్న ప్రత్యర్థులను బయటకు పంపాలని, ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు సహకరించాలని అశోక్‌రెడ్డి దిశ డీఎస్పీ శ్రీనివాసరావును కోరారు.

లైటింగ్ సమస్య

పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంల వద్ద లైట్లు వేయకుండా చీకటిగా ఉండడాన్ని టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి గుర్తించారు. పట్టణంలోని ఐదారు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించిన సమయంలో చాలా మంది ఈవీఎంల వద్ద చీకటిగా ఉండి ఓటు వేయడానికి అధిక సమయం తీసుకోవడమే కాకుండా తాము కోరుకున్న వారికి ఓటు వేయడంలో ఇబ్బందులు పడుతుండడాన్ని ఆయన గమనించి వెంటనే పోలింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అప్పటికప్పుడు ఆయా కేంద్రాలలో లైటింగ్ ఏర్పాట్లు చేయడంతో ఓటర్లకు చీకటి ఇబ్బందులు తప్పాయి.

బేస్తవారపేట : మండలంలో సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే బేస్తవారపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైంది. దీంతో ఓటర్లు ఎండలో క్యూలైన్‌లో నిలబడ్డారు. జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో వైసీపీ తరుపున నిలబడిన ఏజెంట్లు ఆ ప్రాంతంలో ప్రచారం సాగిస్తుండడంతో టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. శింగరపల్లెలో పోలింగ్ కేంద్రం వద్ద తగిన సౌకర్యాలు కల్పించలేదని గ్రామస్థులు ఆందోళ న చెందారు. పోలింగ్ కేంద్రాల వద్ద యథేచ్ఛగా వైసీపీ నాయకులు పోలింగ్ కేంద్రాలలోపలికి వెళ్లి వస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వచ్చాయి.




బేస్తవారిపేటలో ఉదయాన్నే బారులుతీరిన ప్రజలు, డీఎస్పీతో మాట్లాడుతున్న ముత్తుముల

అవీ..ఇవీ..

పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల బారులు

- ఉత్సాహంలో టీడీపీ నాయకులు



కంభం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఓటర్ల బారులు

కంభం, మే 13 : సోమవారం జరిగిన అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు కంభం, అర్ధవీడు మండలాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాలవద్ద ఎవరూ ఊహించని విధంగా ఉదయం 6గంటలకే ఓటర్లు బారులు తీరడం కనిపించింది. కంభం మండలంలోని 14 పంచాయతీలలో ఏర్పాటు చేసిన 45 పోలింగ్ బూతులు, అర్ధవీడు మండలంలోని 18 పంచాయతీలలో ఏర్పాటు చేసిన 29 పోలింగ్ బూతులలో ఓటర్లు ఎండను సైతం లెక్కచేయకుండా మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకు 18 నుంచి 85 సంవత్సరాల వయస్సు గల వారందరూ, వికలాంగులు, దివ్యాంగులు, మహిళలు, యువకులు ఓట్లు వేయడానికి ఉత్సాహంగా రావడంతో ఆయాపోలింగ్ బూతులు కిటకిటలాడాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఓటర్లు పెద్దసంఖ్యలో రావడంతో ఎన్‌డిఎ కూటమి బలపరచిన ఎన్‌డిఎ కూటమి గెలువడం ఖాయమని ఆయా నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆలస్యంగా మొదలైన పోలింగ్



పోలింగ్ కేంద్రంలో ఓటు వేస్తున్న సామాన్య ప్రజలు

మార్కాపురం రూరల్, మే 13: మండలంలోని 58 పోలింగ్ కేంద్రాలలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా జరిగింది. బోడపాడు గ్రామంలోని 22వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం సాంకేతిక లోపం కారణంగా ఉదయం 7.00గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ ప్రక్రియ 7.45గంటలకు ప్రారంభమైంది. దరిమడుగు గ్రామంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చింతగుంట్ల గ్రామంలో పోలింగ్ బూత్ వద్ద ఓటింగ్ ప్రక్రియలో ఏజెంట్ల మధ్య స్వల్ప ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. నాయుడుపల్లి, పెద్ద యాచవరం, రాయవరం, ఇడుపూరు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద చెదురు మదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. మండలంలోని మిగిలిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు భారీ ఎత్తున క్యూలైన్లలో నిలబడ్డారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ జరుగుతున్న తీరును అక్కడి నాయకుల ద్వారా తెలుసుకున్నారు.

పోలింగ్ ప్రశాంతం



తొలిసారి ఓటువేస్తున్న మహిళలు

పొదిలి మే 13 : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ చెదరువ ఐదురు ఘటనలు మినహా ప్రశాంతంగా నిర్వహించారు. సోమ వారం ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండవేడిమికి ముందే ఓటు వేయాలని, ఎండను సైతం లెక్కచేయకుండా ఓటు వేసేందకు ఓటర్లు ఉత్సాహం చూపించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మందకోడిగా సాగడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 239, 222 కాటూరివారిపాలెం, బాలికల ఉన్నతపాఠశాల ఈవీఎంలు మొరాయించడంతో రెండుగంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. 236, 219 కేంద్రాల్లో పోలింగ్ ఏలూరు గ్రామంలో వృద్ధుల ఓటు వేసే క్రమంలో ఇరువురికి మధ్య స్వల్పఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల రంగప్రవేశం చేసి ఇరువురిని చెదరగొట్టి పోలింగ్ జరిపించారు. 219 కేంద్రం వద్ద వైసీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తుండటంతో పోలీసుల జోక్యంతో ఇరువైపు వారిని బయటకు పంపించారు. . మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల్లో 51550 మంది ఓటర్లు ఉండగా సాయంత్రం ఆరుగంటల సమయానికి కూడా పోలింగ్ కొనసాగింది. మండలంలోని మాదాలవారిపాలెం, అక్కచెరువు, ఏలూరు, కంభాలపాడుతో పాటు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం 10 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది. పోలింగ్ శాతం కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. నందిపాలెం, ఏలూరు, నవాబుమిట్ల పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ వైసీపీ కార్యకర్తల మధ్య స్వల్ప వివాదాలు చోటు చేసుకున్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆయా కేంద్రాల వద్దకు చేరుకొని ఇరువురిని చెదరగొట్టి ప్రశాంత వాతావరణాన్ని కల్పించారు. చీకటి పడిన తరువాత కూడా పోలింగ్ జరిగే కేంద్రాలలో విద్యుత్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తహశీల్దార్ మహిమ్మద్ జియా పీఆర్వోలను ఆదేశించారు. మార్కపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మండలంలోని మాదాలవారిపాలెం, నందిపాలెం, కంభాలపాడు, కొండాయపాలెం, కుంచేపల్లి, పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న తీరును నాయకులను అడిగి తెలుసుకున్నారు. అయితే సుదూరప్రాంతాల నుండి ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పోలింగ్ శాతం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తుంది. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పొదిలి ఎస్ఐ కోటయ్య ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ముత్తుముల

టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, ఆయన సతీమణి పుష్పలీల, కుమారుడు దివ్యేష్‌రెడ్డి, ఇతర కుటుంబీ కులు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పిడతల సాయికల్పన, ఆమె కుమారుడు అభిషేక్‌రెడ్డి, ఇతర కుటుంబీకులు సైతం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి పగడాల పెద్దరంగస్వామి రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకోగా పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన అనంతరం వైసీపీ అభ్యర్థి కె.నాగార్జునరెడ్డి మార్కాపురానికి వెళ్లి అక్కడ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

క్యూలైన్ల వద్ద ఓటర్లకు వైసీపీ ప్రలోభాలు

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని పలు పోలింగ్ బూతుల వద్ద వైసీపీ నాయకులు ఓటర్ల వద్దకు వెళ్ళి వైసీపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తుండగా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై స్థానిక టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనితో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. పోలింగ్ బూత్‌ల వద్ద 100 మీటర్ల పరిధిలో ఏ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు రాకూడదన్న నిబంధనలు ఉన్నా పలువురు ఓటర్ల క్యూ లైన్ల వద్దకు ఓట్లను అభ్యర్థిస్తుండడం గమనార్హం. పోలీసులు మాత్రం తమకేమి పట్టనట్లు ఉండడం, ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద జనాలు గుమికూడకుండా చూడాల్సి ఉండగా పోలీసులు కనిపించలేదు.

ఓటు హక్కు వినియోగించుకున్న కాంగ్రెస్ సెక్రటరీ



కంభం, మే 13 : ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సెక్రటరీ, తమిళనాడు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అయిన డాక్టర్ సిరివెళ్ల ప్రసాద్ తన స్వగ్రామమైన కంభంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తెలివైన వారని, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారని అన్నారు.

ఢీ అంటే ఢీ..

- పదికిపైగా పోలింగ్ కేంద్రాల్లో కవ్వింపు చర్యలు, ఘర్షణలు
- మూడు కేంద్రాల వద్ద ఉద్రిక్తత



రెడ్డి మహిళా కళాశాల వద్ద ఇరువర్గాల ఘర్షణ

మార్కాపురం, మే 13: అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సార్వత్రిక ఎన్నికలు కాకను రేపాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని పలు కేంద్రాల్లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల దాడులు, మరికొన్నిచోట్ల ఘర్షణలు, వాగ్వాదాలు చోటుచేసుకొన్నాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద గొడవలు తీవ్రస్థాయికి చేరే అవకాశాలు ఉండడంతో వైసీపీ, టీడీపీ నాయకులను సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌లో ఉంచారు. అయినా సాయంత్రం పెద్ద ఎత్తున గొడవలు జరిగాయి. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్‌లు ప్రత్యేక బలగాలతో అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద ఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

రెడ్డి కళాశాల వద్ద ఇరువర్గాల ఘర్షణ

స్థానిక రెడ్డి కళాశాల వద్ద ఉన్న 34, 68, 69, 70, 71 పోలింగ్ కేంద్రాల వద్ద చివర్లో టీడీపీ, వైసీపీ వర్గాలు తీవ్రస్థాయిలో గొడవపడ్డాయి. పోలింగ్ బూత్‌లలోకి వెళ్లే విషయంలో చిన్నపాటి గొడవ కొట్లాటకు దారితీసింది. ముఖ్యంగా టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కుమారుడు విష్ణుృష్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వైసీపీ వర్గాలు దాడులు చేసేందుకు సిద్ధపడ్డాయి. దీంతో అప్రమత్తమైన టీడీపీ వర్గీయులు కూడా అప్పటికప్పుడు ఒక్కసారిగా అక్కడకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ బాలసుందరరావు సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

జవహర్‌నగర్ కాలనీలో నువ్వా నేనా

పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని వెంకటేశ్వర ప్రాథమికోన్నత పాఠశాల వద్ద వైసీపీ అభ్యర్థి అన్నా రాంబాబు, టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కుటుంబ సభ్యుల మధ్య సుమారు రెండు గంటలపాటు పరిస్థితి నువ్వా-నేనా అన్నట్లు సాగింది. అక్కడ ఉన్న 76, 77, 80 పోలింగ్ కేంద్రాల వద్ద కందుల కుటుంబీకులు తిష్టవేశారని ఆరోపిస్తూ, వైసీపీ అభ్యర్థి రాంబాబు పలుమార్లు బూత్‌లలోకి వెళ్లారు. అలా వెళ్లడం పద్ధతి కాదంటూ కందుల సతీమణి వసంతలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాంబాబును బయటకు వెళ్లమని కోరినా ససేమిరా అన్నారు. పరిస్థితి తీవ్రత పెరిగే అవకాశం ఉందని గ్రహించిన పోలింగ్ అధికారులు ఆర్‌వో రాహుల్‌మీనాకు తెలియజేశారు. దీంతో వెంటనే ఆర్‌వో రాహుల్‌మీనా అక్కడకు చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. అనంతరం వైరి వర్గాలను పోలీసులు అక్కడనుంచి బయటకు పంపారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు గొడవలే..

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆజాద్ ఎయిడెడ్ పాఠశాలలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఉదయాన్నే పరిస్థితిని గ్రహించిన పోలీసులు 9వ వార్డు కౌన్సిలర్ ఎం.సిరాజ్, టీడీపీ నాయకుడు పఠాన్ ఇబ్రహీంఖాన్‌లను సాయంత్రం వరకు పోలీసు స్టేషన్‌లో ఉంచారు. మధ్యాహ్నం సమయంలో చనిపోయిన వ్యక్తి ఓటును వేరేవాళ్ల వేసుకున్నారని టీడీపీ ఏజెంట్లు ఆరోపించడంతో కొద్దిసేపు బూత్‌లో గొడవ జరిగింది. సాయంత్రం ఓటు వేసేందుకు పోలీసు స్టేషన్ నుంచి బూత్‌ల వద్దకు వచ్చిన ఇద్దరు నాయకులు మళ్లీ గొడవపడ్డారు. రెండు వర్గాలకు చెందిన పలువురు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. క్షతగాత్రులను జీజీహెచ్‌కు తరలించారు.

స్వల్ప ఘర్షణలు

తర్లుపాడు, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికలు స్వల్ప ఘర్షణలు మినహా ప్రశాంతంగా జరిగాయి. తర్లుపాడు, సీతానాగులవరం, నాగెళ్లముడుపు, బుడ్డపల్లెలో స్వల్ప ఘర్షణలు జరిగాయి. కొండారెడ్డిపల్లె బూత్ నెం.122లో ఈవీఎంలు మొరాయించటంతో గంటన్నర ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. గానుగపెంటలో కూడా పోలింగ్ బూత్ నెం.115లో 11గంటలకు ఈవీఎంలు మొరాయించటంతో అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తర్లుపాడులో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మీ ఓటర్లను ప్రభావితం చేస్తుండటంతో టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. బుడ్డపల్లెలో కూడా గ్రామ సర్పంచ్ దూదేకుల పెద్ద మస్తాన్ ఓటర్లను ప్రభావితం చేస్తుండటంతో టీడీపీ వర్గీయులు ఘర్షణ పడ్డారు. దీంతో అక్కడ కూడా స్వల్ప ఘర్షణ జరిగింది. నాగెళ్లముడుపులో వైసీపీ కార్యకర్తలు దొంగోట్లు వేస్తుండటంతో టీడీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో అరగంటపాటు ఘర్షణ జరిగింది. పోలీసులు రంగ ప్రవేశంతో సమస్య పరిష్కారమైంది.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

- ముగ్గురికి స్వల్పగాయాలు

పొదిలి, మే 13 : మండలంలోని నందిపాలెం గ్రామంలో 211 పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఈ దాడిలో జి అచ్యుత్‌కుమార్, బి రవి, జి. అనిల్‌బాబులకు స్వల్పగాయాలయ్యాయి. ఓటు వేసేందుకు క్యూలైన్‌లో ఉన్న టీడీపీ వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకొంది. అనంతరం మాటామాట పెరగడంతో ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగారు. విషయం తెలుసుకొని అక్కడకు చేరుకున్న కందుల నారాయణరెడ్డి తనయుడు విష్ణుృష్‌రెడ్డి కేంద్రంలోకి వెళ్లి ఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకుంటుండగా కారుపై దుండగులు రాళ్లతో దాడి చేశారు. దీంతో కారు అద్దాలు పగిలాయి. అక్కడ పర్యవేక్షణలో ఉన్న సీఐ చూస్తూ ప్రేక్షక పాత్రలోఉండిపోయారని విష్ణుృష్‌రెడ్డి ఆరోపించారు. 211 పోలింగ్ స్టేషన్‌లో ఏజెంట్లను భయానికి గురిచేస్తున్నారని, ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని బందోబస్తు పెంచాలని కోరిన స్పందించలేదని ఆయన అన్నారు. ఘటన విషయం తెలుసుకున్న కందుల నారాయణరెడ్డి అక్కడికి చేరుకొని టీడీపీ వారిపై దాడిచేస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలను ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆయనతోపాటు జనసేన నాయకులు వరికూటి నాగరాజు, టీడీపీ నాయకులు పరామర్శించారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



త్రిపురాంతకంలో ఎండను లెక్కచేయకుండా బారులు తీరిన ప్రజలు

రెండుచోట్ల ఈవీఎంల మొరాయింపు

త్రిపురాంతకం : మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల్లో గురువారం నిర్వహించిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కాగా మొత్తం 66 బూత్‌లలో రెండు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. శ్రీనివాసనగర్, రాజుపాలెం, గొల్లపల్లి బూత్‌లలో ఈవీఎంలలో సమస్యలు రాగా వాటిని మార్చి పోలింగ్ నిర్వహించారు. రామసముద్రం 155, 156, 157 బూత్‌లో పోలీసులు లేకపోవంతో ఓటర్లు ఎక్కువ కావడంతో తోపులాట జరిగింది. సోమేపల్లి, త్రిపురాంతకం గ్రామాలలో స్వల్ప వివాదాలు జరగ్గా పోలీసుల జోక్యంతో సద్దుమణిగాయి. పాత అన్నసముద్రం, పాతముడివేముల. రామసముద్రం, గొల్లపల్లి గ్రామాల బూత్‌లలో 6 గంటల తరువాత కూడా ఓటర్లు క్యూలైన్‌లో ఉండటంతో సమయాన్ని పొడగించి ఓటుహక్కుకు అవకాశం కల్పించారు. మండలంలోని రామసముద్రం 157లో 96.25 శాతం, 156 లో 93.99 శాతం, టి.చెర్లోపల్లి 134లో 92.86 శాతం, ఎండూరివారిపాలెంలో 91 శాతం పోలింగ్ నమోదయింది. త్రిపురాంతకం పంచాయితీ ఓటింగ్ 79.30 శాతం నమోదయింది. కాగా ఎన్నికలలో మహిళలు, యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వైసీపీ అరాచకం

- పలు గ్రామాల్లో పోలింగ్‌కు అంతరాయం
- కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ధర్నా

దర్శి, మే 13 : మండలంలో పోలింగ్ ప్రక్రియ ఉద్రిక్తగా మారింది. పలు గ్రామాల్లో వైసీపీ వారు రెచ్చిపోయి టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి గాయపర్చారు. భయభ్రాంతులను చేసి అక్రమంగా ఓట్లు వేసుకునే ప్రయత్నం చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూక విచక్షణారహితంగా దాడిచేసి కర్రలు, మారణాయుధాలతో కొట్టి గాయపర్చారు. వైసీపీకి చెందిన గంగిరెడ్డిపాలెం అంజిరెడ్డి, గంగిరెడ్డిపాలెం నాగార్జున, శాగం అంజిరెడ్డి, బోగిరెడ్డి సుబ్బారెడ్డి మరికొంత మంది కలిసి పోలింగ్ కేంద్రం వద్దనే టీడీపీ కార్యకర్తలపై దాడిచేశారు. ఒక దశలో లోపలున్న ఏజెంట్లపైనా దాడికి యత్నించారు. కార్యకర్తలపై పిడిగుద్దులు కురిపించడంతోపాటు కర్రలతో బాదుతున్నా పోలీసులు గుడ్లప్పగించి చూశారు. ఈ ఘటనలో టీడీపీ కార్యకర్త బత్తిన నరేంద్ర తలకు తీవ్ర గాయమైంది. గుంజే నాగేంద్రం చెవికి దెబ్బతగిలింది. రెడ్డిమాసు రామారావు, గుంజె బ్రహ్మయ్య, బత్తిన సుబ్బారావు, బొట్ల నాగేశ్వరరావు, గుంజె సుబ్బారావు, తన్నీరు వెంకటేశ్వర్లు తదితరులకు గాయాలయ్యాయి. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన విషయం తెలుసుకున్న అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు హుటాహుటిన అక్కడకు వెళ్లి జరిగిన సంఘటనలు పరిశీలించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. దెబ్బతిన్న ఈవీఎంలను పరిశీలించారు.



ధర్నా చేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

గొట్టిపాటి లక్ష్మి ధర్నా


టీడీపీ కార్యకర్తలపై దాడికి నిరసనగా బొట్లపాలెంలో టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఆమె సోదరుడు భరత్ రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఆయన తల్లి వెంకాయమ్మ దాడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇంత దారుణం జరుగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని విమర్శించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. అరాచక శక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

బొట్లపాలెం, ఎర్రోబనపల్లి, తుమ్మెదలపాడు గ్రామాల్లో దాడులకు, అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. పోలింగ్‌కు ఆటంకం కల్గిన కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని డిమాండ్ చేశారు.

స్వల్పఘటనలు ఎన్నికలు ప్రశాంతం

ఎర్రగొండపాలెం, మే 13 : మండలంలో స్వల్ప ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఈవీఎం ఓటింగ్ మిషన్లు నిదానంగా పనిచేస్తుండంతో మధ్యాహ్నం కొంత మంది ఓటర్లు అక్కడే నిలబడాల్సి వచ్చింది. ఓటేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు ఎర్రగొండపాలెం పోలింగ్ కేంద్రాల వద్ద అసహనం వ్యక్తం చేశారు. ఇక ఓటును యువత, మౌనంగా తమ ఓటు వేశారు. ఈవీఎం ఓటింగ్ మిషన్లు స్పీడుగా పనిచేయక పోవడం 1 గంటకు 90 మించి ఓట్లును ఈవీఎంలు నమోదు చేసుకోవడంతో పోలింగ్ సమయం పెరిగింది. ఎర్రగొండపాలెం 29వ పోలింగ్ కేంద్రంలో రాత్రి 7.30 గంటలవరకు ఓటర్లు క్యూలో ఉండి ఓట్లు వేశారు. మండలంలో నరసాయపాలెం 59 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం లు సక్రమంగా పనిచేయక పోవడం, ఒక వ్యక్తి ఓటు వేసే విషయంలో రెండు గ్రూపుల మధ్య తోపులాట జరిగి. అరగంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. 1076 ఓట్లు ఉన్న నరసాయపాలెం గ్రామంలో రాత్రి 7 గంటల వరకు పోలైన ఓట్లు 600 కాగా ఇంకా 400 మంది ఓటర్లు క్యూలో ఉన్నారు, ఈ పోలింగ్ స్టేషన్‌లో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పీవో తెలిపారు. అమానిగుడిపాడు గ్రామంలో 45, 46 పోలింగ్ కేంద్రాలలో రాత్రి 9 గంటలకు వరకు పోలింగ్ జరుగుతుంది. రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలో ఉన్నారు. బోయలపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం వృద్ధుల ఓటు విషయంలో కొద్ది వివాదం నెలకొని తోపులాట జరిగింది. ఓటర్లు మాత్రం గుంభనంగా ఎవరితో మాట్లాడ కుండ ఓట్లు వేసి వెళ్ళారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద వైసీపీ నాయకులు ఓట్లు వేయడానికి వచ్చే వారికి డబ్బులు పంచుతున్నారని తెలిసి ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి తనిఖీకి వెళ్లడంతో అక్కడ నుంచి వైసీపీ నాయకులు వెళ్ళిపోయారు.



ఓటువేసేందుకు క్యూలో ఉన్న యువత

పోటెత్తిన ఓటర్లు



తాళ్లూరు: వెలుగువారిపాలెంలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళుతున్న టీడీపీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

- కొన్నిచోట్ల ఉద్రిక్త సంఘటనల మధ్య సాగిన పోలింగ్
- ఈవీఎంల సాంకేతిక లోపంతో మరికొన్నచోట్ల అంతరాయం

దర్శి, మే 13: మండలంలో ఉద్రిక్తతల మధ్య పోలింగ్ ముగిసింది. దర్శి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో ప్రశాంతంగా ఎన్నికలు జరిగినప్పటికీ నాలుగు గ్రామాల్లో గొడవలు జరిగాయి . దర్శి పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో 132 బూత్‌లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నాయకుడు వీసీ రెడ్డిపై దాడి చేశారు. ఆ తోపులాటలో ఈవీఎం కిందపడిపోయింది. కొద్దిసేపు మొరాయించినప్పటికీ అధికారులు సాంకేతిక సిబ్బందితో బాగు చేయించి యథావిధిగా కొనసాగించారు. బొట్లపాలెంలో వైసీపీ నాయకులు టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన సమయంలో కొద్దిసేపు పోలింగ్‌కు అటంకం కల్గింది. రిటర్నింగ్ అధికారి లోకేశ్వరరావు, ఎస్‌డీపీవో అశోక్‌వర్ధన్‌రెడ్డి అక్కడకు వెళ్లి పరిస్థితి అదుపులోకి తెచ్చి మళ్లీ పోలింగ్ పునరుద్ధరించారు. తుమ్మెదలపాడులో వైసీపీ నాయకులు టీడీపీ ఏజంట్లను ఇబ్బంది పెట్టారు. అయినప్పటికీ టీడీపీ ఏజంట్లు మొండిగా కూర్చోవటంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. దేవవరంలో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య గొడవ జరిగింది. మిగిలిన గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దర్శి పట్టణానికి చెందిన కొత్త లక్ష్మి, ఆమె భర్త సుబ్బరాయుడు చెన్నైలో నివాసం ఉంటున్నారు. ప్రత్యేకంగా ఓటు వేసేందుకు దర్శికి వచ్చారు. పోలింగ్ ఆరంభం కాగానే ఆ బూత్‌లో తొలి ఓటు వేశారు. వృద్ధులు వెంకాయమ్మ, నన్నేసాహెబ్, కోటేశ్వరరావులు వీల్‌ఛైర్‌లో ఇతరుల సహకారంతో వచ్చి ఓటు వేశారు. ఉదయం 7 గంటలకు ముందే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం వరకు పోలింగ్ కొనసాగింది.

'దొనకొండ'లో ప్రశాంతంగా పోలింగ్

దొనకొండ, మే 13: మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 7గంటలకు ప్రారంభం కావల్సిన పోలింగ్ ఒకటి రెండు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించటంతో దాదాపు 30 నిమిషాల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పలు కేంద్రాల్లో ఈవీఎంలు నత్తనడకన పనిచేయటంతో పోలింగ్ మందకొడిగా సాగింది. పలుకేంద్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా ఓటర్లు లైన్‌లో నిలవటంతో రాత్రి వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈఎన్నికల్లో అధికశాతం ఓటర్లు, వృద్ధులు, దివ్యాంగులు సహితం పోలింగ్ కేంద్రాలకు తరలిరావటంతో ఓటర్లతో సాయంత్రం వరకు కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. ఎస్సై సంపత్‌కుమార్ పోలీస్ సిబ్బందితో అన్నీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్దకు తిరుగుతూ ఎక్కడా ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టారు. కాగా, మండలంలో సోమవారం రాత్రి 8-30 గంటల సమయంకు దాదాపు 75 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. మండలంలోని ఇండ్లచెరువు, కొచ్చెర్లకోట, పెద్దన్నపాలెం, పోలేపల్లి, రుద్రసముద్రం, గంగదేవిపల్లి గ్రామాల్లో రాత్రి 8.30 గంటల తర్వాత కూడా కూడా సాగింది.

మండుటెండలో ఓటర్ల అవస్థలు



ముండ్లమూరు పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

కురిచేడు, మే 13: సార్వత్రిక ఎన్నికలు మండలంలో ఓటర్లకు చుక్కలు చూపాయి. ఓటు వేసేందుకు వచ్చే వారికి కనీస వసతులు కల్పించడంతో అధికారులు విఫలం అయ్యారు. మండటెండలో ఓటర్లు అనేక ఇబ్బందులు పడ్డారు. వారికి కనీసం మంచినీటి వసతి కూడా కల్పించలేదు. మహిళా ఓటర్లకు ప్రత్యేక క్యూ లైన్లను కొన్ని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఏడు గంటలకే క్యూ లైన్లలో ఓటర్లు వచ్చి నిలుచున్నారు. మధ్యాహ్నం ఓటర్లు పలుచగా ఉన్నా సాయంత్రం 3 గంటల నుంచి ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రత్యేకంగా మహిళలు ఎక్కువగా సాయంత్రం పోలింగ్ స్టేషన్లకు వచ్చారు.

ఈ ఎన్నికలలో చెదురు మదురు ఘటనలు జరిగినా అవి పెద్ద వివాదాలకు దారితీయక పోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పడమర వీరాయపాలెం గ్రామంలోని 67వ పోలింగ్ స్టేషన్ వద్ద వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి వచ్చిన సమయంలో ఇరుపార్టీల మధ్య గొడవ జరిగింది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి గొడవను ఆపేశారు. ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. పడమర గంగవరం 58వ పోలింగ్ బూత్‌లో సిబ్బందికి, ఓటర్లకు మధ్య ఓటు వేసే విషయంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఎస్‌వో వారికి నచ్చజెప్పి ఓటింగ్ ప్రశాంతంగా జరిపేందుకు సహకరించారు. కాటంవారిపల్లె గ్రామంలో పీవోకు ఏజంట్లు, ఓటర్లు మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘర్షణ వాతావరణం నెలకొన్నది. దీంతో ఓట్ల ప్రక్రియ ఆలస్యమైంది. పడమర నాయుడుపాలెం గ్రామంలో క్యూ లైన్లలో ఇరుపార్టీల వారు నిల్చొనే విషయంలో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య గొడవలు జరిగాయి. వెంటనే పోలీసులు సర్ధిచెప్పి క్యూలైన్లలో మార్పులు చేశారు. మొత్తంమీద సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టడంతో ఆయా గ్రామాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.





దర్శిలో ఓటు వేసి బయటకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, కుటుంబ సభ్యులు, దొనకొండలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు

కాగా, కురిచేడులో 90.90 ఓటింగ్ శాతం ఓటింగ్ నమోదు అయింది. కురిచేడు, ముష్టగంగవరం గ్రామాలలో రాత్రి 8 గంటలకు ఓట్లు వేయడం పూర్తయింది. పొట్లపాడు గ్రామంలోని 72వ పోలింగ్ బూత్‌లో రాత్రి 9 గంటలకు ఓట్లు వేయడం పూర్తి కాగా, 73వ పోలింగ్ స్టేషన్‌లో రాత్రి 10.30 గంటలవరకు సాగింది.

ముండ్లమూరులో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ముండ్లమూరు, మే 13 : మండలంలో స్వల్ప సంఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరారు. పసుపుగల్లులో 194 బూత్‌లో 7 గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ 7.40 గంటలకు ప్రారంభమైంది. ఉమామహేశ్వర అగ్రహారంలో 215బూత్‌లో ఒక మహిళ ఓటు హక్కు వినియోగించుకొనేటప్పుడు వైసీపీకి చెందిన ఏజెంట్లు చూపించి వేయాలని కోరారు. దీంతో టీడీపీకి చెందిన ఏజెంట్లు అలా కుదరదని చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకొని అరగంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. తరువాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి యథావిధిగా కొనసాగింది. మండలంలోని పులిపాడు పోలింగ్ కేంద్రంలో ఒక వృద్ధురాలు ఓటు విషయంలో వివాదం తలెత్తటంతో వైసీపీ, టీడీపీ వర్గీయులు కొంత సమయం పాటు ఘర్షణ పడ్డారు. దీంతో పోలింగ్ అరగంట పాటు ఆగిపోయింది. మారెళ్ళ, వేంపాడు, ఈదర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మహిళలు పెద్దఎత్తున బారులుతీరారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిశాక కూడా ఇంకా క్యూలైన్‌లోనే ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వేచి ఉన్నారు. పోలవరం, శంకరాపురం, పెదరావిపాడు, తమ్మలూరు గ్రామాల్లో రాత్రి 7 గంటల తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. ఐదు గంటల సమయానికి 76 శాతం నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. పోలవరం, శంకరాపురంలో భారీ వర్షం కురిసినా కూడా ఓటర్లు తడుస్తూనే అలాగే ఉండిపోయారు. ముండ్లమూరు పోలింగ్ కేంద్రాన్ని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి భర్త లలిత్‌సాగర్ పోలింగ్ సరళిని పరిశీలించారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి ముండ్లమూరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.



దొనకొండ: ఇండ్లచెరువు గ్రామంలో ఉదయాన్నే బారులు తీరిన ఓటర్లు

తాళ్లూరులో నత్తనడక పోలింగ్

తాళ్లూరు ఏప్రిల్ 11 : మండలంలో నత్తనడకన పోలింగ్ సాగింది. రజానగరంలో ఈవీఎం మొరాయించడంతో గంట పాటు అంతరాయం జరిగింది. మండలంలోని తాళ్లూరులో ఉదయం 7 గంటలకే కేంద్రాలకు ఓటర్లు వెళ్లినప్పటికీ ఈవీఎంలను సరిచూసి 7.30గంటల సమయంలో పోలింగ్ ప్రారంభించారు. లక్కవరం, వెలుగువారిపాలెం తదితర పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల అధికారులు సరైన క్యూలైన్లు ఏర్పాటుచేయక పోవటంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రజానగరంలో 247బూత్‌లో ఈవీఎం ప్రారంభంలోనే గంటపాటు మొరాయించగా, మరో ఈవిఎంను తీసుక వచ్చి పోలింగ్ నిర్వహించారు. కొర్రపాటివారిపాలెం 255 బూత్‌తో పోలింగ్ ప్రక్రియ సజావుగా జరుగక ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పీవో వల్ల పోలింగ్ ఆలస్యమయిందని టీడీపీ శ్రేణులు ఆరోపించారు. గ్రామ సచివాలయ వలంటీర్లు రాజీనామా డ్రామాతో కొందరు బూత్‌ల్లో పోలింగ్ ఏజంట్లుగా కూర్చోగా, మరికొందరు క్యూలైన్ల వద్ద వుండి ఓటర్లను వైసీపీకి ఓటు వేయాలని కోరటం కన్పించింది. ఈవీఎంల సమస్యల వల్ల ఆదినుండి పోలింగ్ నత్తనడకగానే సాగి ఓటర్లు నిరాశ చెందారు. పోలింగ్ సరళిని టీడీపీ అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు పరిశీలించారు.

మండలంలోని కొర్రపాటివారిపాలెంలో పోలింగ్ నత్తనడకన సాగింది. సాయంత్రం వేళ . వర్షానికి ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రావటం ఆలస్యమైంది. దీంతో గంటలకొద్దీ క్యూలైన్లో నిల్చున్నా ముందుకు సాగలేదు. సాయంత్రం 5 గంటల సమయానికి 520 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. దీంతో టీడీపీ శ్రేణులు ఎందుకు పోలింగ్ జాప్యమవుతుందని, ఎంతసేపు క్యూలైన్లో నిలబడాలి అంటూ ఆందోళన చెందారు. ఈవిషయమై ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై వైపీ రమణయ్య ఆగ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదగొట్టి గొడవ సర్దుబాటు చేశారు. వైసీపీ శ్రేణులకు పీవో అనుకూలంగా వ్యవహరిస్తూ పోలింగ్ సరళిని తీవ్ర జాప్యం చేస్తున్నారని టీడీపీ శ్రేణులు ఆరోపించారు. సమస్యను చక్కదిద్దేందుకు ఎంపీడీవో కె.యుగకీర్తి ఆగ్రామానికి చేరుకుని పోలింగ్ అధికారులతో మాట్లాడారు. ఓటర్లకు ఇబ్బంది లేకుండా పోలింగ్ కేంద్రం వద్ద విద్యుత్తు బల్బులు వేయించారు.



దర్శి ప్రభుత్వ కళాశాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు





ఎండలో ఓటు వేయడానికి నిలుచుని ఉన్న ఓటర్లు, సాయంత్రం వేళ ఎక్కువగా వచ్చిన మహిళా ఓటర్లు





తూర్పుగంగవరం గ్రామంలో బారులు తీరిన ఓటర్లు, కొర్రపాటివారిపాలెంలో వాదులాడుకుంటున్న ఇరువర్గాలు

మొరాయించిన ఈవీఎంలు

- మందకొడిగా ఓటింగ్ ప్రక్రియ

కురిచేడు, మే 13: మండలంలో ఈవీఎంలు మొరాయించాయి. ఎక్కడికక్కడ ఎస్‌వోలు అప్రమత్తమై సరిచేశారు. కురిచేడు 64వ పోలింగ్ స్టేషన్‌లో ఎంపీ అభ్యర్థికి ఓటు వేసే ఈవీఎం మొరాయించింది. సీలు వేసే సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో చేసిన పొరబాటుతో ఈవీఎం పనిచేయలేదు. ఎస్‌వో వచ్చి సరిచేశారు. తరువాత అసెంబ్లీ అభ్యర్థి ఈవీఎం కూడా పనిచేయలేదు. మొత్తంమీద ఆ పోలింగ్ స్టేషన్లో గంటకు పైగా ఓటింగ్ ప్రక్రియ ఆగిపోవడంతో ఓటర్ల క్యూలైన్ పెరిగిపోయి ఎండలో ఇబ్బందులు పడ్డారు. కల్లూరు, పడమర కాశీపురం గ్రామాలలో సైతం ఈవీఎంలు మొరాయించడంతో ఎస్‌వోలు అక్కడికక్కడే వాటిని సరిచేసి ఓటింగ్ ప్రక్రియను కొద్ది ఆలస్యంగా ప్రారంభించారు. ఆవులమంద ఎస్సీ పాఠశాలలో ఈవీఎం కొద్దిసేపు ఆన్ కాకపోవడంతో సాంకేతిక సిబ్బంది సరిచేశారు. ఈవీఎంలు మొరాయించిన పోలింగ్ స్టేషన్లలో మందకొడిగా ఎన్నికల ఓటింగ్ జరిగింది. కురిచేడు, నమశ్శివాయపురం, ముష్టగంగవరం గ్రామాలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

ఈవీఎంల మొరాయింపు.. కేంద్రాల్లో అసౌకర్యాలు

దొనకొండ, మే 13 : మండలంలోని కొచ్చెర్లకోట గ్రామంలోని 22, 23 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల పనితీరు సక్రమంగా లేకపోవటంతో ఉదయం నుంచి పోలింగ్ ప్రక్రియ నిదానంగా కొనసాగింది. 22వ పోలింగ్ కేంద్రంలో 1225 ఓట్లు, 23వ కేంద్రంలో 1226 ఓట్లకు గాను సాయంత్రం 6.30 గంటలకు 22వ బూత్‌లో 900, 23వ బూత్‌లో 700 మాత్రమే పోలైనట్లు సమాచారం. ఈవీఎంలు మందకొడిగా పనిచేయటంతో రాత్రి 7గంటల సమయంలో కూడా దాదాపు 350 మంది ఓటర్లు గేటు లోపల క్యూలో ఉన్నారు. మరో 200 మంది ఓటర్లు పోలీసుల హడావుడికి గేటు బయటే ఆగిపోవటంతో తాము ఓటుహక్కు కోల్పోతామేమోనని తీవ్ర ఆందోళనలు చెందుతూ అధికారుల అనాలోచిత చర్యలను విమర్శిస్తున్నారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల్లో క్యూలో ఉన్న ఓటర్లు నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఉగ్ర

కనిగిరి, మే 13: సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రముఖులు సోమవారం పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఆయన కుమార్తె ఊహశ్రీ కనిగిరి పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ దంపతులు కనిగిరి పట్టణంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ కాపుసంఘం అధ్యక్షుడు డాక్టర్ రామయ్యనాయుడు ఆయన సతీమణి డాక్టర్ ఆదిలక్ష్మి కనిగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం లో ఓటు హక్కు విలువైనదని చెప్పారు. ఓటుతోనే నిస్వార్థంగా కనిగిరి అభివృద్ధికి పాటుపడే పాలకుడిని ఎన్నుకోవాలన్నారు.

కార్యకర్తలకు ఇబ్బంది కల్గించొద్దు!



స్టేషన్ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఉగ్ర

పామూరు, మే 13 : పోలీసులు వైసీపీ నాయకుల చెప్పుడు మాటలు విని మా కార్యకర్తలకు ఇబ్బంది కల్గిస్తే క్షమించేదిలేదని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ఉర్దూ పాఠశాల వద్ద టీడీపీ కార్యకర్త వద్ద నగదు ఉందని వైసీపీ నాయకులు చెబితే అతనిని కొట్టి స్టేషన్‌కు తీసుకొచ్చి పోలింగ్‌లో పాల్గొనకుండా చేశారు.. విషయం తెలుసుకొన్న ఉగ్ర పామూరు స్టేషన్‌కు చేరుకొన్నారు. వైసీపీకి తొత్తుల్లా పోలీసులు వ్యవహరించరాదని, కార్యకర్త జేబులో రూ.6 వేలు నగదు ఉండటం నేరమా అని ప్రశ్నించారు. పోలీసులు ప్రవర్తిస్తున్న తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా సాగిందన్నారు. ఓటర్లలో చైతన్యం పెరిగి భారీగా ఓటు హక్కు వినియోగించుకోవడం హర్షనీయమన్నారు.

ముండ్లమూరులో భారీ వర్షం

ముండ్లమూరు, మే 13: మండలంలోని పోలవరం, శంకరాపురం, వేంపాడు గ్రామాల్లో సోమవారం సాయంత్రం గంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉక్కపోత, ఆ తరువాత ఒక్కసారిగా కుంభ వర్షం కురిసింది.

ఓటరోత్సాహం

- ఉదయం 7గంటలకే బారులుతీరిన ఓటర్లు
- ఓటు వేసేందుకు ఆసక్తిచూపిన యువతీ యువకులు

కనిగిరి, మే 13: కనిగిరి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం చైతన్యవంతంగా, ప్రశాంతంగా సాగింది. ఈవీఎంలు మొరాయించడంతో ఒకటి, రెండుచోట్ల అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం 5.30గంటల నుంచి మాక్‌పోలింగ్ ప్రారంభం అయి 7 గంటల నుండి సాధారణ పోలింగ్ జరగాల్సిఉండగా, ఎక్కువ పోలింగ్ కేంద్రాల్లో వద్ద అప్పటికే ఓటర్లు పెద్దఎత్తున బారులు తీరారు. ఆంధ్రజ్యోతి బృందం నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించగా బారులు తీరిన వారిలో మహిళలు, యువతీ యువకులే అధికంగా కనిపించారు. నగర పంచాయతీలోని 25 పోలింగ్ కేంద్రాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల్లోను ఓటర్లు అధిక సంఖ్యలో ఉన్నారు.

అయితే, మండలంలోని చిన ఇర్లపాడు గ్రామంలోని 165వ



కనిగిరి: రాత్రయినా ఓటు వేసేందుకు దేవాంగనగర్‌లో క్యూలైన్లో ఉన్న ఓటర్లు

పోలింగ్ బూత్‌లో ఆగ్రామానికి చెందిన రేషన్‌షాపు డీలర్ సంగు కృష్ణారెడ్డి పోలింగ్ ఏజెంటుగా ఉండటానికి వీల్లేదంటూ కొంతమంది అభ్యంతరం చెప్పటంతో వాదులాటకు దిగాడు. ఈసారి ఎన్నికల్లో ఓటర్లలో చైతన్యంతో ఓటును వేసినట్లు తెలుస్తుంది. యువతీ యువకులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఓటు వేసేందుకు మరింత ఆసక్తి కనపరచారు. చాలా చోట్ల పోలింగ్ గడువు సాయంత్రం ఆరు గంటలు దాటినప్పటికీ పోలింగ్ కేంద్రాల వద్ద చీకట్లోనే ఓటర్లు బారులుతీరి ఉన్నారు. కనిగిరి మున్సిపాల్టీ పరిధిలోని దేవాంగనగర్, టకారిపాలెం, చింతలపాలెం కేంద్రాల్లో దాదాపు సగానికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోలేదు. దీంతో వారికి స్లిప్‌లు ఇచ్చి గేట్లు వేసేసి ఎన్నికల పోలింగ్ సిబ్బంది ప్రక్రియ కొనసాగించాల్సి వచ్చింది.

సాయంత్రం 4గంటల సమయంలో కనిగిరి ప్రాంతంలో దుమారంతో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పామూరు పట్టణంలోని 264 పోలింగ్ బూత్ వద్ద టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. టీడీపీ నాయకుడు సుభాని వద్ద తన ఖర్చుల నిమిత్తం రూ5500నగదు (ఈసీ నిబంధనలకు లోబడి) ఉంది. అయితే, ఓటింగ్ శాతం పెరుగుతుందని అతనిని అక్కడి తప్పించేందుకు వైసీపీ నేతలు పన్నాగం పన్ని నగదు పంచుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలపై సీఐ రామానాయక్ దురుసుగా వ్యవహరించి స్టేషన్‌కు తరలించారు. టీడీపీ అభ్యర్థి ఉగ్ర రంగప్రవేశం చేసి పోలీసులను నిలదీయటంతో అతనిని విడిచి పెట్టారు. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా సాగింది.





కనిగిరి: మొదటిసారి ఓటు హక్కు వినియోగించామని ఉత్సాహంగా చెప్పున్న యువతులు

అధికారుల అలసత్వం.. పోలింగ్‌లో జాప్యం

పీసీపల్లి మే 13: కొంతమంది పోలింగ్ అధికారుల అవగాహనలోపం, అలసత్వంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. బూత్‌నెంబర్ 200లో 7గంటలకు మొదలుకావలసిన పోలింగ్ 40నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. బూత్‌నెంబర్ 204 లో ఈవీఎంలో నెలకొన్న సాంకేతికలోపంతో 7గంటలకు మొదలుకావలసిన పోలింగ్ రెండు గంటలు ఆలస్యంగా 9గంటలకు ప్రారంభమైంది. బూత్‌నెంబర్ 205లో గంట ఆలస్యంగా మొదలైంది. అలాగే, తలకొండపాడు, వెంగళాయపల్లి, మురుగమ్మి పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి ఓటర్లు



వెలిగండ్ల: గుడిపాటిపల్లిలో ఓటు వేయడానికి బారులుతీరిన ఓటర్లు

బారులు తీరారు. పోలింగ్ అధికారుల అవగాహనలోపంతో ఓటింగ్ నిదానంగా జరిగింది. పోలింగ్ సమయం ఆరు గంటలకు ముగిసినా వెంగళాయపల్లి పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 7గంటలకు కూడా 349మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు బారులుతీరారు. ఈపోలింగ్‌లో కేంద్రం టీడీపీకి అనుకూలంగా ఓట్లు పడుతున్నాయని భావించిన కొంత మంది మాజీ వలంటీర్లు, వైసీపీ నాయకులు కలిసి ఉద్దేశపూర్వకంగా క్యూలైన్‌లలో నిల్చొని ఇబ్బందెలు పెట్టారు. తమ ఏజెంట్ల ద్వారా పోలింగ్ జరగకుండా పదేపదే అభ్యంతరాలు చెబుతూ పోలింగ్‌ను జాప్యం చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. మురుగమ్మిలో రాత్రి 7గంటలకు 190మంది ఓటర్లు క్యూలో ఉన్నారు. కాగా, మండల వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల సమీపంలో రాజీనామాలు చేసిన వలంటీర్లు ఓటుహక్కు వినియోగించుకునేందుకు వస్తున్న ఓటర్లను పథకాల పేరుతో ప్రలోభాలకు గురిచేసేలా కనిపించింది. మండలంలో 39 పోలింగ్ కేంద్రాల పరిధిలో 29364 మంది ఉండగా సాయంత్రం 5గంటలకు 21757 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 74.09 శాతం మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.



పీసీపల్లి: రాత్రి 8గంటల సమయంలో వెంగళాయపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

పోలింగ్ కేంద్రంలో అంధకారం

వెలిగండ్ల, మే 13: వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి పంచాయతీలో పోలింగ్ కేంద్రలో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. పోలింగ్ కేంద్రాలు పక్కపక్కనే ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఓట్లు వేయడానికి ఇబ్బందులు పడ్డారు.. మం డలంలో తమ్మినేనిపల్లి, మొగళ్ళూరు పంచాయతీల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు కొంత అసహనానికీ గురికాగా, క్రమేణ ఓటింగ్ శాతం పెరిగింది. మండలంలో సాయంత్రం ఆరు గంటలకు 74 శాతం పోలింగ్ నమోదయింది.

పామూరులో బారులుతీరిన ఓటర్లు

పామూరులో పెరిగిన ఓటింగ్ శాతం

పామూరు, మే 13: మండలంలో స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులుతీరారు. పామూరు చరిత్రలో తెల్లవారక ముందే ఓటర్లు ఆర్‌అండ్‌బీ రోడ్డు మీద వరకు బారులు తీరడం ఇదే మొదటిసారి అని పలువురు వ్యాఖ్యానించారు. ఈవీఎం మిషన్లు సక్రమంగా పనిచేయక పలుచోట్ల పోలింగ్ మందకొడిగా సాగింది. పోలింగ్ ప్రశాంతంగా సాగుతున్న తరుణంలో వర్షం కురవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. బొట్లగూడూరు పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పోలింగ్ సిబ్బంది సెల్‌ఫోన్ లైటింగ్‌లో పోలింగ్ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిగా వెలుతురు లేక ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలో ఉర్దూ పాఠశాల వద్ద టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డి వృద్ధ ఓటర్లను పరామర్శించారు. వీరభద్రాపురం, చిలంకూరు, కంభాలదిన్నె, తూర్పుకోడి గుడ్లపాడు, లక్ష్మీనరసాపురం తదితర గ్రామాల బూత్‌ల వద్ద స్వల్ప ఘటనలు మినహా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. మండలంలో 72 శాతం పోలింగ్ శాతం నమోదైందని అధికారులు తెలిపారు.

కాగా, పామూరు మేజర్ పంచాయతి పరిధిలోని గోపాలపురం పోలింగ్ కేంద్రంలో ఘర్షణ చోటుచేసుకొంది. ఉప సర్పంచ్ వైఈ సాయి, మరికొంత మంది వైసీపీ మద్దతు దారులతో కలసి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి హడావిడి చేయడంతో టీడీపీ మద్దతు దారులు అడ్డుకొన్నారు. దాంతో కొంతసేపు పోలింగ్ నిలిచిపోయింది. సమాచారం అందుకొన్న సీఐ ఎం.రామానాయక్, ఎస్ఐ ఎం.సైదుబాబు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. మండల ఎన్నికల అధికారి షాకిర్‌పాషను పరిస్థితిపై వివరణ కోరగా ఘర్షణ కారణంగా కొంతమేర పోలింగ్ నిలిచిందన్నారు.

కాగా, ఈవీఎంలు సక్రమంగా సహకరించక పోవడం, అకాల వర్షం, విద్యుత్ అంతరాయం లాంటి పలు కారణాలతో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ సాగింది. బొట్లగూడూరు, దూబగుంట, నుచ్చుపొద పంచాయతిల్లోని పోలింగ్ బూత్‌లలో పోలింగ్ రాత్రి 9 గంటల వరకు సాగింది. కొన్ని గ్రామాల్లో రికార్డు స్థాయిల్లో పోలింగ్ శాతం నమోదైంది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



దగ్గరుండి మంత్రి అంబటి రిగ్గింగ్

ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం పోలింగ్ బూత్‌లలో మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయించారు. అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులు, కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ మూకలు రాళ్ల వర్షం కురిపించాయి. బూత్‌లోని వైసీపీ వారిని బయటకు తీసుకురావాలని రూరల్ సీఐ రాంబాబును కోరినా పట్టించుకోకపోవడంతో కన్నా అనుచరులు బూత్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. దీంతో అంబటి అనుచరులు రాళ్లు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడిచేశారు. దీంతో ఓ బాలుడితో పాటు ఐదుగురు గాయపడగా బాధితులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇరువర్గాల దాడి.. సీఐకి గాయాలు

తాడికొండ మండలం నిడుముక్కలలో 83వ నెంబరు బూత్‌లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత టీడీపీ వార్డు మెంబరు నాగ స్వరూపపై దాడి చేసి ఆమె జాకెట్ చించి, తాళిబొట్టును తెంపుకుని ఇంట్లోని వస్తువులను కూడా ధ్వంసం చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకోగా ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. రాళ్ల దాడిలో సీఐ ప్రభాకర్‌కి గాయాలైయ్యాయి. పోలీస్ బెటాలియన్ వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్న చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గుంటూరు అమరావతి రోడ్డుపై ఇరు వర్గాలు బైఠాయించి ఆందోళనకు దిగారు.





పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు

చెలరేగిన వైసీపీ శ్రేణులు

- టీడీపీ నేతలే లక్ష్యంగా దాడులు

పోలింగ్ సరళితో బెంబేలెత్తిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు అసహనంతో చెలరేగిపోయారు. పల్నాడు సహా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోయారు. పల్నాడు జిల్లాలో అయితే ఓటర్లను భయ బ్రాంతులకు గురి చేశారు. గుంటూరు నగర పరిధిలోని పలు బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలు చేశాయి. అసహనం, ఆందోళనతోనే పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు దిగినట్లు తెలుస్తోంది.



దగ్ధమవుతున్న బహ్మారెడ్డి వాహనం



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం



పూర్తిగా దహనమైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కారు



అరవిందబాబు వాహనాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు

ఓటెత్తారు..

- కేంద్రాల వద్ద జాతరను తలపించిన జనం
- ఉదయం నుంచి బూత్‌ల వద్ద ఓటర్ల బారులు
- ఈవీఎంల మొరాయింపు, ఆలస్యంగా ప్రారంభం
- పలు దగ్గర్ల కనీస సదుపాయాలు లేక అల్లాడిన జనం
- మధ్యాహ్నం వరకు మండిన ఎండ.. పలువురు ఇబ్బంది
- సాయంత్రానికి చల్లగా మారిన వాతావరణం, పలుచోట్ల వర్షం



రేపల్లె : ఇసుకపల్లిలోని అయోవా బాలికోన్నత పాఠశాల ఎన్నికల బూత్‌లో ఓటుహక్కువినియోగించుకునేందుకు బాలురుతీరిన ఓటర్లు



అద్దంకి భవానీ సెంటర్ కేంద్రంలో ఓటు వేసిన గొట్టిపాటి



గుంటూరులో ఆనందబాబు దంపతులు



బాపట్ల, పొన్నూరులో వేగేశన, అనగాని



పిడుగురాళ్లలో యరపతినేని దంపతులు



వినుకొండలో జీవీ ఆంజనేయులు దంపతులు



సత్తెనపల్లిలో కన్నా, పొన్నూరులో నరేంద్ర

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు పోటెత్తారు.. మధ్యాహ్నం వరకు ఎండ మండింది.. ఓటమి భయంతో పోలింగ్ రోజూ వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగే పోలింగ్ బూత్‌ల వద్ద ఈ సారి వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా.. బూత్‌ల వద్ద ఓటింగ్‌లో జాప్యం జరిగినా.. భానుడు భగభగ మండినా.. ఓటర్లు వెనుతిరగలేదు. ఓటేసి కాని వెళ్లేది లేదన్నట్లుగా భీష్మించుకున్నారు. ఓటరు చైతన్యం వెల్లివెరిసిందా.. అన్నట్లుగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మరోవైపు ప్రచారాలపై నిషేధం ఉన్నా వైసీపీ అభ్యర్థులు పలు దగ్గర్ల పట్టించుకోకుండా తమకు ఓటేయ్యాలంటూ, బూత్‌ల వద్ద టీడీపీ శ్రేణులు అల్లర్లు చేస్తున్నాయంటూ.. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌తో పోలింగ్ రోజంతా హోరెత్తించారు. ఇతర రాష్ట్రాలే కాదు.. విదేశాల నుంచి వచ్చిన ఓటర్లు కూడా గంటల తరబడి నిరీక్షించి మరీ ఓటేశారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభ సమయం కాగా అంతకంటే ముందే వచ్చి ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరారు. యువత, మహిళలు క్యూల్లో బారులు తీరారు. గేట్లు బయటే గుంపులు, గుంపులుగా ఉదయం ఆరు గంటల నుంచే పడిగాపులు కాశారు. భగభగమండే సూర్యుడు మధ్యాహ్నానికి శాంతించి చల్లబడడంతో ఓటర్లు సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నా చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా పలు కేంద్రాల్లో పోలింగ్ జరుగుతూనే ఉంది.

వెల్లివెరిసిన చైతన్యం.. విదేశాల నుంచి రాక

ఓటేయడానికి బారులు తీరినవారిలో యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఓటేయడానికి విదేశాల నుంచి కూడాపెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కువైట్, ఐర్లాండ్, న్యూజిలాండ్, అమెరికా తదితర దేశాల నుంచి కూడా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గడచిన రెండు వారాలుగా భగభగమండుతున్న సూర్యుడు ఓటర్ల ఉత్సాహాన్ని చూసి సోమవారం తన ప్రచండాన్ని అంతగా చూపలేదు. పైగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పలు నియోజకవర్గాల్లో వర్షం కురిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల, వేమూరు పరిధిలో వాతావరణం చల్లబడింది. దీంతో సాయంత్రం వేళ ఓటర్లు మరింత ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లకు బూత్‌ల వద్ద సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. తాగు నీటి సౌకర్యం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చాలాదగ్గర్ల ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

స్ట్రాంగ్‌రూంల్లో ఓటరు తీర్పు భద్రం

ఓటరు తీర్పు ఆదివారం రాత్రి నుంచి స్ట్రాంగ్‌రూంలకు చేరుకుంటున్నది. పోలింగ్ ముగిసిన కేంద్రాల నుంచి ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్లకు తీసుకొచ్చారు. పోలింగ్ ఆలస్యమైన ప్రదేశాల నుంచి ఈవీఎంలు అర్ధరాత్రి తర్వాత వచ్చాయి. గుంటూరు లోక్‌సభకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్ల, నరసరావుపేట కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు రిసెప్షన్ సెంటర్లలో ఉండి ఈవీఎంలు భద్రంగా స్ట్రాంగ్‌రూంల్లోకి వెళ్లేంత వరకు మొత్తం ప్రక్రియని పర్యవేక్షిస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల సామాగ్రి చేరుకున్న తర్వాత రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీళ్ల వేస్తారు.

బాపట్లలో.. మొరాయించిన ఈవీఎంలు

బాపట్ల జిల్లాలో 82.33 శాతం నమోదైనట్లు సోమవారం అర్ధరాత్రి అధికారులు ప్రకటించారు. రాత్రి 8 గంటల వరకు కూడా కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని మోడల్ పోలింగ్ బూత్‌లో కూడా పోలింగ్ ఆలస్యంగానే ప్రారంభమైంది. బాపట్లలోని టౌన్ హాలు 81 నెంబరు పోలింగ్ బూత్‌లో తొలి ఓటు పడగానే ఈవీఎంలు మొరాయించాయి. ఇమ్మడిశెట్టిపాలెం, చీరాల, మార్టూరు మండలం ద్రోణాదులలోని పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్‌బూత్‌లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తొలి ఓటు వేశారు. ఎండవేడిమి తాళలేక జమ్ములపాలెంలోని పోలింగ్‌బూత్‌లో నర్రాసుబ్రహ్మణ్యం అనే వ్యక్తి గుండెపోటుకు గురికాగా వైద్య సిబ్బంది ప్రాథమికి చికిత్స చేశారు.

వైసీపీ దాడులు.. పట్టించుకోని పోలీసులు

బాపట్ల జిల్లా పరిధిలో పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేసే వారే కరువయ్యారు. రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌పై వైసీపీ శ్రేణులు దాడికి యత్నం చేయబోయారు. చీరాల టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్యపై కర్రలతో దాడికి ప్రయత్నించారు. కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్థన్‌రెడ్డిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యం చేయబోగా ఆయన కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్టూరు మండలం కోనంకిలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. సినీ నిర్మాత, రచయత కోన వెంకట్ అనుచరులను వెంటేసుకుని కర్లపాలెం మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద హంగామా సృష్టించారు. కొల్లూరులో వైసీపీ అభ్యర్థి అశోక్‌బాబు రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో టీడీపీ శ్రేణులు గట్టిగా స్పందించాయి. బాపట్ల పరిధిలోని చిలగొల్ల పాలెం పోలింగ్ బూత్ వద్ద వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగాయి. కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెం, బాపట్ల మండలం పూండ్లలో పాలకపార్టీ శ్రేణులు అరాచకం సృష్టించాయి. అల్లూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. తూర్పు పిన్నిబోయినవారి పాలెంలోని 117 బూత్‌లో పోలింగ్ సిబ్బందిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యానికి తెగబడ్డాయి. తహసీల్దార్ కారుపై కూడా రాళ్లతో దాడి చేశారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఆ యా కేంద్రాల దగ్గర దాడులకు తెగబడినా వారిని అడ్డుకునే పోలీసులే కరువయ్యారు. పర్చూరు, అద్దంకి, వేమూరులో భారీ వర్షంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.



తెనాలిలో వర్షం నీటిలో ఓటువేసేందుకు నిలబడిన ప్రజలు

కాసును తరిమిన ఓటర్లు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని నడికుడి ఓటర్లు పరుగులు పెట్టించారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలించే పేరట అక్రమాలకు ప్రయత్నించిన ఆయన్ను ఓటర్లు ప్రశ్నించారు. తమనే ప్రశ్నిస్తారా అని ఆయన అనుచరులు దాడులకు ప్రయత్నించి, మహిళలను బూతులు తిట్టారు. దాంతో పోలింగ్ బూత్ లో ఉన్న ఓటర్లు ఎమ్మెల్యే కాసుకి ఎదురు తిరిగారు. మా ఊరు వచ్చి మామీదే దౌర్జన్యం చేస్తారా అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారు. దీంతో అక్కడున్న ఓటర్లు రాళ్లు తీసుకుని వెంట పడటంతో కాసు అక్కడి నుంచి పరుగులు పెట్టారు.

- మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు రెచ్చిపోయారు. మాచర్ల పట్టణంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి టీడీపీ కార్యకర్తలను కారుతో తొక్కించారు. ఈ సంఘటనలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఓ టీడీపీ నేత ఇంటిని దగ్గరుండి ధ్వంసం చేయించారు. రెంటచింతల మండలం రెంటాలలో గుంటూరు రేంజ్ ఐజీ ఎదుటే జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి కళ్లలో కారం కొట్టి హత్యాయత్నానికి ఒడిగట్టారు. అనంతరం రెండు కార్లను ధ్వంసం చేసి ఓ కారును తగలబెట్టారు.
- దాచేపల్లిలో టీడీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేసి వైసీపీ వర్గాలు గాయపరిచాయి. తంగెడలో బాంబులతో వైసీపీ వర్గాలు దాడులకు దిగాయి. ఎరికేపల్లిలో టీడీపీ కార్యకర్త వాహనాన్ని ధ్వంసం చేశారు.
- నరసరావుపేట మండలం దొండపాడులో వైసీపీ శ్రేణులు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడి చేశాయి. ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లను ధ్వంసం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ అభ్యర్థి అరవిందబాబుపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలోనే దాడి చేశారు. అరవిందబాబు కారుతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. గోపిరెడ్డి ఆస్పత్రి, టీడీపీ కార్యాలయంపై ఇరు పక్షాలకు దాడులు చేసుకున్నాయి. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. పరిస్థితిని అదుపుతోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయోగించారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరు వర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. చిలకలూరిపేట నుంచి వస్తున్న శ్రీకృష్ణ దేవరాయల కాన్వాయ్‌ను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ఓ కారులోని వారిని కిందకు దించి పెట్రోల్ పోసి తగలబెట్టారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు.
- సత్తెనపల్లి నియోజకవర్గం తొండపి, రూపెనగుంట్ల, చీమలమర్రి, కుంకలగుంట, గుళ్లపల్లి గ్రామాల్లో రాళ్లు కర్రలతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ సంఘటనలలో పలువురు కార్యకర్తలు గాయ పడ్డారు. క్రోసూరు మండలం ఎర్రబాలెం, దొడ్లేరు గ్రామాల్లో పరస్పర దాడులు జరిగాయి.



మాచర్లలో-వైసీపీ కార్యకర్తల వీరంగం



టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వుతున్న వైసీపీ కార్యకర్తలు



మాచర్లలో బ్రహ్మారెడ్డి, తెనాలిలో మనోహర్



గుంటూరులో లావు, పెదకూరపాడులో ప్రవీణ్, నరసరావుపేట అరవిందబాబు, బుర్రిపాలెంలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, గుంటూరు తూర్పులో నసీర్, మంగళగిరిలో లోకేశ్



బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీకి ఈవీఎంలతో సిబ్బంది



చార్జింగ్ దీపాలతో ఎన్నికల విధులను నిర్వహిస్తున్న సిబ్బంది

అవస్థల మధ్య సిబ్బంది పోలింగ్

నూతలపాడు(పర్చూరు), మే 13 : వసతుల లేమితో ఎన్నికల విధుల కోసం వచ్చిన సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. సక్రమంగా విద్యుత్ సౌకర్యం లేకపోవడం, ఇరుకు కేంద్రాలతో విధులు నిర్వహించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో పక్క ఎన్నికల సమయం ముగుస్తుండడం, విద్యుత్ వసతులు సక్రమంగా లేకపోవడంతో ఏమీచేయలేని స్థితిలో చార్జింగ్ లైట్‌లతో విధులు నిర్వహించారు. ఒక పక్క మండు టెండలు, మరో పక్క ఉక్కపోతలతో ఎన్నికల విధుల్లో ఉద్యోగుల తీవ్ర అవస్థలు పడ్డారు. మరో పక్క కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడం, వృద్ధులకు ఓటు వేసే పరిజ్ఞానం సక్రమంగా లేకపోవడంతో సమయాభావంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఏది ఏమైనా సార్వత్రిక ఎన్నికలు ఉద్యోగుల్ని ఉక్కిరి బిక్కిరి చేసింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఓటు వేసేందుకు వెళ్లి కుప్పకూలి వృద్ధుడి మృతి

వీరన్నపాలెం(పర్చూరు), మే 13 : వీరన్నపాలెం గ్రామంలో ఓటు వేసేందుకు వెళ్లి వృద్ధుడు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన గోరంట్ల సుబ్బారావు(74) ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్లారు. క్యూలో నిలుచుని ఓటు వేసేందుకు వెళ్లే తరుణంలో ఒక్కసారిగా కుప్పకూలి కిందపడిపోవడంతో అక్కడ ఉన్న సిబ్బంది పర్చూరు వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందారు. అతనికి ఇద్దరు కుమారులు ఉండగా అనారోగ్యంతో మృతి చెందారు. భార్య ఉంది.



గోరంట్ల సుబ్బారావు (ఫైల్)

గెలుస్తున్నాం.. ధైర్యంగా ముందుకెళ్లండి

● టీడీపీ అధినేత చంద్రబాబు

చీరాల, మే 13 : బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం, చీరాల మండలం గవినివారిపాలెంలో సోమవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు కూటమి అభ్యర్థి కొండయ్యపై జరిగిన దాడిని సీరియస్‌గా తీసుకున్నారు. టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక టీడీపీ శ్రేణులు, కొండయ్యతో మాట్లాడారు. సీటు గెలుస్తున్నాం .. ధైర్యంగా ముందుకెళ్లండంటూ భరోసా ఇచ్చారు. ఇప్పుడు ఎవరైతే దాడుల చేస్తున్నారో వారిని ఎలా కంట్రోల్ చేయాలి. ఏవిధంగా బుద్ధి చెప్పాలో చెప్తాం. ఇంకా రెండున్నర గంటల టైం ఉంది. 6 గంటల లోపు ఎంతమంది ఉంటే అంతమందిని పోలింగ్ కేంద్రాల క్యూలో ఉంచండి. మంచి మెజార్టీతో గెలుస్తున్నాం. క్యూలో ఎంతమంది ఉన్నా పూర్తయ్యే వరకు పోలింగ్ కొనసాగుతుంది. అందుకు అనుగుణంగా ముందుకు అడుగులు వేయాలని చెప్పారు.

టెలికాన్ఫరెన్స్‌లో ...

చంద్రబాబు : కొండయ్య ఈజ్ ఆన్‌లైన్
చంద్రబాబు ప్రతినిధి : కొండయ్య గారు మాట్లాడండి సార్
కొండయ్య : సార్ .. నమస్కారం సార్
చంద్రబాబు : నమస్కారం ... కొండయ్య ఏం కాదు .. ధైర్యంగా ఉండు ... ఎస్కార్ట్ ఇచ్చారా నీకు
కొండయ్య : ఆ ఇచ్చారు సార్ .. ఇద్దరు కానిస్టేబుళ్లను ఇచ్చారు
చంద్రబాబు : మరలా .. ఇంకో లెటర్ కూడా పెట్టు ... మేం కూడా పెడతాం...
కొండయ్య : అలాగే సార్..
చంద్రబాబు : విష్ యూ ఆల్‌ది బెస్ట్

యర్రంవారిపాలెంలో వైసీపీ దౌర్జన్యం

● టీడీపీ పోలింగ్ ఏజెంట్లపై రాళ్లు, కర్రలతో దాడి
● ఎస్పీతో మాట్లాడిన ఎమ్మెల్యే ఏలూరి

యర్రంవారిపాలెం(పర్చూరు), మే 13 : పర్చూరు నియోజకవర్గ పరిధిలోని కారంచేడు మండలం యర్రంవారిపాలెంలో ఎన్నికల నేపథ్యంలో ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం సార్వత్రిక ఎన్నికలకు సబంధించి తెలుగుదేశం పార్టీ తరుపున ఏజెంట్‌గా ఉన్న కోటిరెడ్డిపై వైసీపీ నేతలు దాడికి పాల్పడటంతో ఘర్షణ నెలకొంది. టీడీపీకి ఓటు వేసినా, బూత్‌లో ఏజెంట్‌లుగా ఉన్నా చంపేస్తామంటూ కర్రలతో దాడికి పాల్పడినట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. ఘర్షణ నేపథ్యంలో ఎన్నికల కేంద్రంలో కొంత భయాందోళన పరిస్థితి నెలకొంది. దీంతో బాధితులు కోటిరెడ్డి సోదరులు పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

పేరు నమోదులో తేడా

● ఓటు వేయలేక పోయిన టీడీపీ మద్దతుదారు

మార్టూరు, మే 13: ఇంటి పేరు నమోదులో ఓటరు లిస్ట్‌లో తప్పుగా ప్రచురించడంతో టీడీపీ మద్దతుదారు ఓటు వేయలేకపోయిన ఉదంతం ఇది. ఈ కారణంతో సోమవారం సాయంత్రం 6 గంటలకు మూసివేయాల్సిన పోలింగ్ బూత్‌ను రాత్రి 10 గంటలకు పోలింగ్ ఆఫీసర్ మూసివేసిన సంఘటన మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో 3వ బూత్‌లో జరిగింది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగరాజుపల్లి గ్రామంలో గల్లా మరియదాసు అనే టీడీపీ సానుభూతి పరుడు సాయంత్రం ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. అతని ఇంటి పేరు గల్లా కాకుండా ఓటరు లిస్టులో జంగ్రాజుపల్లి అని నమోదు కావడంతో వైసీపీ ఏజెంట్లు ఓటు వేయడానికి అంగీ కరించలేదు. వాస్తవానికి అతను గల్లా మరియదాసు అని, గ్రామంలో అతనికి ఓటు ఉన్నట్లు అందరికీ తెలుసు. ఓటు వేయడానికి అవకాశం లేకుండా ఏజెంట్లు అడ్డుకున్నారని టీడీపీ ఏజెంట్లు చెప్తున్నారు. కానీ తనకు ఓటు వేసే అవకాశం ఇవ్వాలని మరియదాసు బూత్‌లో పట్టుబట్టడంతో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ బూత్‌ను పోలింగ్ ఆఫీసర్ మూసివేయలేకపోయారు. ఈ విషయమై గ్రామంలో చర్చ నీయాంశమైంది. ఎట్ట కేలకు మరియదాసుకు ఓటు వేసే అవకాశం లేదని ఉన్నత అధికారులు నుంచి పోలింగ్ ఆఫీసర్‌కు ఉత్తర్వులు రావడంతో ఈ విషయంపై సీఐ రాజ శేఖర్ రెడ్డి బూత్ వద్దకు వచ్చి మరియదాసుకు తెలియజేశారు. దీంతో నిరాశగా ఓటు వేయకుండా మరియదాసు రాత్రి 10 గంటలకు పోలింగ్ బూత్ నుంచి వెళ్లిపోయాడు.



ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకుంటున్న యువతి

దరిచేరని ఎన్నికల పండుగ..!

చీరాల, మే 13 : నియోజకవర్గం అంతా ఎన్నికల పండుగ జరుపుకుంది. మూడు ప్రధాన పార్టీలు వారివారి ఆలోచనలు, వ్యూహాలకు అనుగుణంగా ప్రలోభాలకులోను చేశారు. ఓట్లను అభ్యర్థించారు. చివరికి వారి కరుణ ఎవరిపై సారించారో ఓట్లు లెక్కింపు తరువాత కానీ తేలదు. అయితే నియోజకవర్గ పరిధిలో సుమారు 40 కుటుంబాలు సంచార జాతులువారు ఉన్నారు. తమ పొట్టకూటి కోసం ఊర్లు పట్టుకుని తిరుగుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో సోమవారం ఓట్ల పండుగలో భాగంగా వచ్చిన సొమ్ముతో ఆనందపడుతుంటే, తోటవారిపాలెం వద్ద ఓ సంచార కుటుంబానికి చెందిన యువతి చిన్నారులతో పొట్ట కూటి కోసం ప్లాస్టిక్ సీసాలు, చిత్తుకాగితాలు ఏరుకుంటున్నారు. ఇలాంటి తలరాతలు మారెదెప్పుడో.

చివర్లో బరితెగింపు

ఓటమి భయంతో అలజడులు సృష్టించిన వైసీపీ
దర్శి, చీరాల అభ్యర్థులపై దాడికి యత్నం
పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి హల్‌చల్
కూటమి ఆధిక్యత గ్రామాల్లో దౌర్జన్యాలు
దొంగ ఓట్లకు ప్రయత్నాలు
ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన పోలీసులు
తిప్పికొట్టిన కూటమి శ్రేణులు

ఓటమి భయం ఆవరించిన వైసీపీ శ్రేణులు పలుచోట్ల పోలింగ్ చివర్లో బరితెగించారు. ప్రత్యక్ష, పరోక్ష పోలీసుల సహకారంతో టీడీపీ శ్రేణులను బెదరగొట్టి దొంగోట్లు వేసుకునేందుకు విఫలయత్నం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ప్రత్యేకించి ఐదారు నియోజకవర్గాలలో వైసీపీ నాయకులు ఈ వ్యవహారాలకు పాల్పడ్డారు. పూర్తిస్థాయి పోలీసు సహకారంతో దర్శి, చీరాలలో కూటమి అభ్యర్థులపై దాడికే యత్నించారు. వైపాలెం వైసీపీ అభ్యర్థి పోలింగ్ బూత్‌లో హల్‌చల్ చేశారు. ఒంగోలులో పోలింగ్ కేంద్రాల వద్ద అదేస్థాయిలో వైసీపీ అభ్యర్థి దౌర్జన్యం చేయగా మార్కాపురంలో కూటమి అభ్యర్థి కుమారుడిపై దాడికి యత్నించి వాహనాన్ని ధ్వంసం చేశారు. అద్దంకిలో చివర్లో వైసీపీ అభ్యర్థి ఒకటి రెండు పోలింగ్ కేంద్రాల్లో గొడవ చేశారు. దాదాపుగా ఈ అన్నిచోట్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా పోలీసుల సహకారం వైసీపీకి లభించగా స్థానిక ప్రజల సహకారంతో కూటమి అభ్యర్థులు వైసీపీ అరాచకాలను అడ్డుకోగలిగారు. మిగిలిన చోట్ల చెదురుమదురు ఘటనలు తప్ప చెప్పుకోదగ్గ హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు.



దర్శి మండలం బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న వైసీపీ నేతలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలలో పోలింగ్ ప్రారంభ సమయం కన్నా ముందే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. జిల్లాలో పోలింగ్ 80శాతం జరిగిందంటే ఓటర్లు ఏ స్థాయిలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు పరుగులెత్తారో అర్థమవుతోంది. అందునా ప్రభుత్వ వ్యతిరేకభావంతో ఉన్నవారు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు పరుగులెత్తినట్లు తేటతెల్లమైంది. యువత, కొత్తగా ఓటుపొందిన వారు, సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం, ఉద్యోగుల కుటుంబీకులు, వ్యాపారులు, వృద్ధులు ముందుగా ఓటు కోసం పరుగెత్తటం వారిలో టీడీపీ కూటమి అనుకూల వాతావరణం కనపడటం బహిరంగంగానే కనిపించింది. దీంతో మధ్యాహ్నం నుంచి వైసీపీ నాయకుల్లో భయాందోళన ఆరంభమైంది. దీటైన పోటీ ఉందన్న భావనలో ఉన్న వైసీపీ అభ్యర్థులు మరీ ముఖ్యంగా పోలీసు సహకారం తోపాటు అల్లరిమూకలు అధికంగా ఉన్నవారు మధ్యాహ్నం నుంచి బరితెగించారు. అలా హింసాత్మక ఘటనలు దర్శి, వైపాలెం, మార్కాపురం, చీరాల ఒంగోలు, అద్దంకి ఉన్నాయి.

దర్శిలో చోద్యం చూసిన పోలీసులు

దర్శి నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోతే పోలీసులు చోద్యం చూశారు. తొలుత టీడీపీకి ఆధిక్యత లభించే బొట్లపాలెంలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేశారు. బత్తిన నరేంద్రతో పాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తేలేదు. టీడీపీ కూటమి అభ్యర్థి లక్ష్మి, ఆమె సోదరుడు భరత్ తదితరులు ఆ గ్రామానికి వెళ్లి పార్టీశ్రేణులకు అండగా ధర్నాకు దిగాల్సి వచ్చింది. ఆర్‌ఓపై టీడీపీ అగ్రనాయకత్వం వత్తిడి తేవటంతో పోలీసులు కదిలి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వైసీపీకి పూర్తి ఆధిక్యత ఉన్న ఎర్ర ఓబినేనిపల్లిలో టీడీపీ గట్టి పోటీనిచ్చింది. దీంతో ఒక టీడీపీ ఏజెంటును వైసీపీ శ్రేణులు బహిరంగంగానే బయటకు లాగి చితక్కొట్టారు. ఎంతకూ అక్కడకు పోలీసులు వెళ్లకపోవటంతో ఆ గ్రామస్థులు దర్శి వచ్చి ఆర్‌ఓ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తే కానీ పోలీసులు కదలలేదు. వైసీపీ శ్రేణుల ఊహలు తలకిందులై దర్శి నగరపంచాయతీలో టీడీపీ అనుకూల పోలింగ్ వాతావరణం కనిపించింది. దీంతో సాయంత్రం వైసీపీ మూకలు అక్కడా బరితెగించాయి. ఇటీవల టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ వైసీరెడ్డిపై పోలింగ్ కేంద్రంలోనే దాడిచేశారు. అయినా పోలీసులు ఆయన మీదే కేసుపెట్టారు. రాత్రి 7 గంటల తర్వాత మరో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణుల హడావుడిని నివారించేందుకు లక్ష్మి అక్కడకు వెళ్లగా ఆమెపై దాడికి యత్నించారు. డ్యూటీలో ఉన్న మాలకొండయ్య అనే సీఐ దాడిచేసిన వారిని వదిలేసి టీడీపీ కార్యకర్తలపై లాఠీ ఎత్తారు. క్షణాల్లో భారీగా టీడీపీ శ్రేణులు చేరితేకానీ పోలీసు అధికారులు రంగంలోకి రాలేదు.

పుల్లలచెరువు మండలంలో కాల్పులు

వైపాలెంలో టీడీపీకి పూర్తి ఆధిక్యత ఉన్న ముటుకులలోని పోలింగ్ కేంద్రంలోకి వైసీపీ అభ్యర్థి చంద్రశేఖర్ వెళ్లి హల్‌చల్ చేశారు. పోలింగ్ అధికారి అతనికి సెల్యూట్ కొట్టారు. పోలీసులు చూసీచూడనట్లు జారుకున్నారు. టీడీపీ కార్యకర్తలు అక్కడే ఉండి ఓటర్లను బెదిరిస్తున్న వైసీపీ అభ్యర్థిని బయటకు పంపాలని ధర్నాకు దిగారు. దీంతో ఓ పోలీసు రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరపటం కొందరు టీడీపీ కార్యకర్తలు గాయపడటం జరిగింది. అదే మండలంలో గతంలో వైసీపీకి ఆధిక్యత ఉన్న పీఆర్‌సీతండాలో గిరిజనులు టీడీపీలోకి వెళ్లిపోవటంతో వైసీపీ అభ్యర్థి అక్కడికి వెళ్లి హల్‌చల్ చేశారు. ఇటీవల టీడీపీలో చేరిన సుబ్బారెడ్డి స్వగ్రామంలోను వైసీపీ శ్రేణులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేశారు. అక్కడా పోలీసులు ప్రేక్షకపాత్రే పోషించగా ప్రజలే అల్లరి మూకలను తరిమికొట్టారు. పొదిలి మండలం నంది పాలెం వైసీపీకి మంచి ఆధిక్యత ఉంది. అక్కడ ఈ పర్యాయం టీడీపీ పక్షాన ఏజెంట్లు కూర్చున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు అలజడి సృష్టించాయి. టీడీపీ కూటమి అభ్యర్థి నారాయణరెడ్డి కుమారుడు ఆ గ్రామానికి వెళ్లగా అతనిపై దాడికి యత్నించి కొందరు కార్యకర్తలను గాయపరిచారు. ఆయన వాహనాన్ని ధ్వంసం చేశారు. డ్యూటీలో ఉన్న సీఐ ఉమేష్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరించటమే దాడికి కారణమైంది. సాయంత్రం మార్కాపురంలో ఓ కేంద్రంలో పూర్తిగా టీడీపీ కూటమికి అనుకూలంగా పోలింగ్ జరుగుతుందని తెలిసి అక్కడికెళ్లి వైసీపీ శ్రేణులు అల్లరి సృష్టించారు. టీడీపీ శ్రేణులు అల్లరి మూకలను ధైర్యంగా ఎదుర్కోగా రంగంలోకి వచ్చిన పోలీసులు టీడీపీ శ్రేణులపైనే లాఠీఛార్జ్ చేయటం విశేషం.

ఒంగోలులోనూ దౌర్జన్యం

ఒంగోలులోను టీడీపీ కూటమికి అనూహ్యమైన ఆధిక్యత లభిస్తుందని భావించిన వైసీపీ శ్రేణులు అలజడికి భారీప్రయత్నం చేశారు. గతంలో ఆపార్టీకి ఆధిక్యత వచ్చి ఈపర్యాయం తిరగబడుతున్న త్రోవగుంటలో స్థానిక శ్రేణుల మధ్య చిన్న వివాదం నెలకొనగా వైసీపీ అభ్యర్థి బాలినేని రావటంతో వివాదం పెద్దదైంది. పోలీసులు సరైన రీతిలో వ్యవహరించకపోవటమే ఉద్రిక్తతకు దారితీసింది. అదే గ్రామంలోని వడ్డెపాలెం బూత్‌లో రాత్రి 9 గంటలకు కూడా పోలింగ్ జరుగుతుండగా అప్పటికీ ఉద్రిక్త వాతావరణం కొనసాగుతుండటం విశేషం. ఉమామహేశ్వర కాలేజీ బూత్‌ల వద్ద తొలుత టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడిచేశారు. తర్వాత టీడీపీ శ్రేణులు వారిని వెతికిపట్టుకుని ప్రతిదాడి చేశారు. సాయంత్రం 5 గంటల తర్వాత కూడా పోలింగ్ జరుగుతున్న కేంద్రాలలో వైసీపీ అనుకూల ఓటర్లకు అనుమతి ఇవ్వాలని మిగిలిన వారిని పక్కకుపంపాలని వైసీపీ నాయకులు, అధికారులు పోలీసులపై వత్తిడి చేస్తున్న ఘటనలు ప్రత్యక్షంగా కనిపించాయి. ఎస్ఎన్‌పాడులో ఒక సచివాలయాన్ని వైసీపీ శ్రేణులు ప్రచార కేంద్రంగా మార్చుకోగా కిందిస్థాయి అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేస్తే కానీపోలీసు, రెవెన్యూ సిబ్బంది రంగంలోకి వచ్చి వారిని ఖాళీ చేయించలేదంటే పోలీసుల సహకారం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

చీరాలలో దాడికి యత్నం..

చీరాల టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య యాదవ్‌పై దాడిచేసేందుకు ప్రయత్నించగా స్థానికులు కాపాడారు. వాహనంపై దాడిచేశారు. గవినివారిపాలెంలో తొలుత వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేసి పోలింగ్‌ను ఆపే ప్రయత్నం చేశారు. కొండయ్య యాదవ్ అక్కడకు వెళ్లిన తర్వాత ఒక్కసారిగా స్థానికేతరులు కొందరు అక్కడకు చేరి ఆయనపై రాళ్లు రువ్వే ప్రయత్నం చేశారు. వెంటనే స్థానికులు ఆయనను తప్పించి వేరే వాహనంలో ఎక్కించగా కొండయ్య వాహనాలపై దాడిచేశారు. గ్రామంలో ఉద్రిక్తతలతో ఘర్షణ జరగ్గా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. పూర్తిగా బీసీలు ఉండి టీడీపీకి అనుకూల పోలింగ్ జరుగుతుందన్న ఉద్దేశంతోనే అలజడి సృష్టించారని అర్థమవుతోంది. సాయంత్రం దళితవాడలోని ఒక బూత్ వద్దకు వెళ్లి వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. ఆయనను కర్రలతో కొట్టడమే గాక కారును ధ్వంసం చేసి పరారయ్యారు. ఇదికూడా వైసీపీ శ్రేణుల పనేనని తెలుస్తోంది. ఈ రెండు సందర్భాల్లోను పోలీసులు వైసీపీ అనుకూల పాత్ర పోషించటం విశేషం. మరోవైపు అద్దంకి నియోజకవర్గంలో సాయంత్రం వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి పోలింగ్ కేంద్రాలలో హల్‌చల్ చేసే ప్రయత్నం చేశారు. సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువులో పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి హల్‌చల్ చేశారు. అక్కడ కూడా అధికారులు చోద్యం చూస్తుండగా గ్రామస్థులు అతన్ని ఓ గదిలో బంధించగా పోలీసు అధికారులు వెళ్లి విడుదల చేయించారు. ఆతర్వాత మరో ఒకటి రెండు టీడీపీ అనుకూల పోలింగ్ కేంద్రాల వద్ద ఆయన హడావుడి చేసే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు.

ఓటర్లలో చైతన్యం

ఉదయం నుంచే బారులు

అద్దంకి, మే 13 : ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6-30 గంటల నుంచే బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ సమయం కాగా, ఉదయం 6.30 గంటలకే ఓటర్లు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటర్లు బారులు తీరారు. అత్యధిక శాతం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు సుమారు 2 గంటల సమయం పట్టినా మండుటెండ లో సైతం వేచి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 2 గంటల నుంచి భారీ వర్షం కురవగా, వర్షం ఆగిన వెంటనే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు పరుగులు తీసి క్యూలైన్‌లలో బారులు తీరారు. సాయంత్రం 6 గంటల సమయం ముగిసిన తరువాత కూడా పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండడంతో పోలింగ్ అధికారులు క్యూలైన్‌లో ఉన్న ఓటర్లకు టోకెన్లిచ్చారు. ధర్మవరం, అద్దంకి పట్టణంలోని ఎల్‌ఆర్ ఎయిడెడ్, కట్టకిందపాలెం, కాకానిపాలెం పాఠశాలల వద్ద రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారులు తీరి ఉండి ఓటు హక్కు వినియోగించుకున్నారు. యువతతో పాటు వృద్ధులు, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతం పెరగడం వెనుక రెండు బలమైన కారణాలు ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఓటర్లలో ఓటు హక్కుపై అవగాహన పెరిగి చైతన్యవంతులు కావడం. అదే సమయంలో ఇరు పార్టీల నేతలు ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసి ఉండడం కూడా కారణం గా భావిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించకపోతే ఆయా ప్రాంతాలకు చెందిన నేతలు తమను ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో అత్యధిక శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు భావిస్తున్నారు. వివిధ ప్రాంతాలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఓటర్లు కూడా కుటుంబ సభ్యులతో సహా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అద్దంకి నియోజకవర్గంలో మొత్తం 2,44, మంది ఓటర్లు ఉండగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు 28.32 శాతం, 1 గంటకు 46.22 శాతం, 3 గంటలకు 55.49 శాతం, 5 గంటలకు 71.71 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. అయితే పలు పోలింగ్ కేంద్రాల వద్ద రాత్రి పొద్దుపోయే వరకు కూడా పోలింగ్ జరుగుతుండటంతో 80 శాతం పోలింగ్ నమోదు కావచ్చని అంచనా వేస్తున్నారు.



కాకానిపాలెం పాఠశాల వద్ద ఓటర్లు



ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పోలింగ్ కేంద్రాల వద్ద ఎండలో బారులు తీరిన మహిళా ఓటర్లు

పోలింగ్ కేంద్రంలో అంధకారం

వెలిగండ్ల, మే 13: వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి పంచాయతీలో పోలింగ్ కేంద్రంలో అంధకారం నెలకొంది. విద్యుత్ సరఫరా లేక ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. పోలింగ్ కేంద్రాలు పక్కపక్కనే ఏర్పాటు చేయడంతో ఓటర్లు ఓట్లు వేయడానికి ఇబ్బందులు పడ్డారు.. మండలంలో తమ్మినేనిపల్లి, మొగళ్ళూరు పంచాయతీల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు కొంత అసహనానికి గురికాగా, క్రమేణ ఓటింగ్ శాతం పెరిగింది.



వర్షం నీరు నిలిచి బురదగా ఉన్నా ఓటు వేసేందుకు వస్తున్న ఓటర్లు

కొండయ్య, ఆమంచి వాహనాలపై వైసీపీ మూకల దాడి

వాహనాల అద్దాలు ధ్వంసం
పోలీసుల వైఫల్యమంటున్న ఆ పార్టీ శ్రేణులు

చీరాల, మే 13 : వైసీపీ దౌర్జన్యం పరాకాష్టకు చేరింది. వైసీపీ మూకలు దాడులు తెగబడ్డాయి. సోమవారం ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు చీరాల మండలం గవివివారిపాలెంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. కొండయ్యపై కూడా రాయితో దాడికి యత్నించారు. అయితే టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. అంతకు ముందు జరిగిన వైసీపీ మూకల దాడిలో నక్కల వెంకటేశ్వర్లు అనే గ్రామ టీడీపీ నాయకుడు గాయపడ్డాడు. డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, పోలీసు బలగాలు వైసీపీ మూకలను చెదరగొట్టే ప్రయత్నంలో విఫలయ్యారని కూటమి అభ్యర్థి కొండయ్య మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు సమాచారం తెలిపారు. దీనిపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. దాడికి పాల్పడ్డ వారిని ఉపేక్షించమని, కూటమి శ్రేణులు కొండయ్యకు అండగా నిలవాలని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇదిలా వుంటే గవినివారిపాలెంలో ముందు జరిగిన ఘర్షణ పూర్తిగా సద్దుమణగక ముందే మరో బజారులో మణికంఠ, గోపిరాజు అనే యువకులను వైసీపీ వర్గీయులు గాయపరిచారు. అందులో మణికంఠ అనే కుర్రాడికి తలకు గాయమైంది. మున్సిపల్ పరిధిలోని పేరాల శ్రుంగారపేటలోని ఓ పోలింగ్ బూత్ వద్దకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ వచ్చిన సమయంలో సమీపంలోని వైసీపీ వర్గీయులు కొందరు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఆ క్రమంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమంచి కారుపై దాడిపై చేశారు. ఆమంచికి చెందిన రెండు కార్ల అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆమంచి అనుచరులు పోగయ్యారు. పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు నామ్‌కే వాస్తేగా ప్రయత్నించారని, పోలీస్ వైఫల్యమేనని అక్కడి వారు వ్యాఖ్యానించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులకు తెలిపారు. మధ్యాహ్నం సమయంలో వైసీపీకి చెందిన అంకమ్మరావు అనే వ్యక్తి తనపై దాడిచేశారని, చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలలో చేరారు. అవుట్ పోస్టు పోలీసులకు ఆమంచి కృష్ణమోహన్, మరో ముగ్గురు తనపై దాడి చేసి గాయపరిచినట్లు పేర్కొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న ఆమంచి, గుమికూడిన శ్రేణులు (ఇన్‌సెట్లో) దెబ్బతిన్న వాహనం

ఓపిక పట్టండి.. ఎవరినీ వదిలిపెట్టం : కొండయ్య

గవినివారిపాలెం టీడీపీ శ్రేణులపైనా, తన కారుపైనా జరిగిన దాడిపై టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య స్పందించారు. పార్టీ శ్రేణులతో మాట్లాడుతూ ఓపిక పట్టండి .. ఎవరినీ వదిలిపెట్టమన్నారు. ఈ ఊర్లో వారుండాలో, మీరు ఉండాలో తేలుస్తానంటూ శ్రేణులకు భరోసా కల్పించారు. దాడిపై ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు.

మానవత్వం చాటిన సీఐ

● అభినందించిన ఎస్పీ

మేదరమెట్ల, మే 13 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మానవతా దృక్పథంతో వ్యహరించారు. సోమవారం మేదరమెట్లలోని పోలింగ్ బూత్ వద్దకు ఆటోలో వచ్చి నడవలేక ఇబ్బంది పడుతున్న వృద్ధురాలిని సీఐ శివరామకృష్ణరెడ్డి చేతులతో ఎత్తుకుని పోలింగ్ కేంద్రంలోకి తీసుకువెళ్లారు. ప్రజలకు రక్షణ కల్పించే విషయమై విధుల్లో కఠినంగా వ్యహరించే పోలీసులలో మానవత్వం దాగి ఉన్నదని ఈ సంఘటన తెలియజేస్తుంది. శివరామకృష్ణరెడ్డిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

రాజుగారిపాలెంలో ఈ 'రాజు'ల తీరే వేరు..!

మార్టూరు, మే 13 : పై ఫొటోలో కనిపిస్తున్న ఇద్దరు వ్యక్తుల పేర్లు ఉప్పలపాటి తిరుపతిరాజులు కావడం యాధృచ్ఛికమే.. వారిద్దరూ మండలంలోని రాజుగారిపాలెంలో టీడీపీ, వైసీపీలకు నాయకత్వం వహిస్తున్నారు. టీడీపీ తరపున మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు(మెడలో కండువా వేసుకున్న వ్యక్తి), వైసీపీ మద్దతుదారు ప్రస్తుత సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతి రాజు. అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా గ్రామంలో వారి పార్టీలకు మెజారిటీ సంపాదించే దిశగా, గ్రామంలో పట్టు పెంచుకునే దిశగా వారిద్దరూ సామదానబేదదండోపాయాలను ఉపయోగించారు. అయితే సోమవారం పోలింగ్ రోజు కావడంతో పోలింగ్ కేంద్రం వద్ద వారిద్దరూ ఒకే చోట కూర్చుని పోలింగ్ ముగిసేంత వరకు నవ్వుతూ మాట్లాడుకోవడం గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన వ్యక్తులలో ఆసక్తిని కలగచేసింది. అదేవిధంగా ఓటు వేయడానికి వచ్చే వారు కూడా తమ పార్టీ రాజుతో మాట్లాడి పోలింగ్ కేంద్రాలకు వెళ్లడం విశేషం. ఎన్నికల సమయంలో పార్టీ పరంగానే తప్ప తమ మధ్య వ్యక్తి గత పోటీలు లేవని రాజుగారిపాలెంలో తమ రూటే సపరేటని ఈ ఇద్దరు నాయకుల పోకడ పలువురు రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలని గ్రామ పెద్దలు చెప్తుంటారు.





పర్చూరులో బారులు తీరిన ఓటర్లు.. ఉప్పుటూరులో వాన కురుస్తున్నా వేచి ఉన్న ఓటర్లు.. బల్లికురవలో ఓటేసేందుకు నిల్చున్న మహిళలు

ఓటోత్సాహం

- భారీ సంఖ్యలో హాజరైన మహిళలు
- మండుటెండను లెక్కచేయని ఓటర్లు
- పర్చూరులో వాన కురుస్తున్నా వెనక్కి వెళ్లని వైనం
- ఉదయం మండుటెండ.. సాయంత్రం భారీ వర్షం
- బెంబేలెత్తిన ఓటర్లు... పోలింగ్‌లో విచిత్ర పరిస్థితి
- సౌకర్యాల కల్పనలో విఫలమైన అధికారులు
- పలుచోట్ల వైసీపీ దౌర్జన్యాలు.. చోద్యం చూసిన పోలీసులు

అద్దంకి, మే 13 : అద్దంకి ప్రాంతంలో పోలింగ్ రోజు విచిత్ర పరిస్థితి ఏర్పడింది. సోమవారం ఉదయం ఎండ మండి పోగా.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ ప్రభావం ఓటింగ్‌పై కొంత మేర కనిపించినా భారీ ఓటింగ్ నమోదైంది. అద్దంకి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా అత్యధిక శాతం పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలోని ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్, మండలంలోని శ్రీనివాసనగర్, సంతమాగులూరు మండలంలోని పరిటాలవారిపాలెం తదితర పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలోని అత్యధిక పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయమే ఓటర్లు బారులు తీరగా, సరిపడా టెంట్‌లు లేక ఎండలోనే గంటల తరబడి నిల్చున్నారు. ఓటర్ల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో అధికారులు ఆలస్యంగా మేల్కొని టెంట్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎన్టీఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాల, కాకానిపాలెం ప్రాథమిక పాఠశాల, ఎల్ ఆర్ ఎ యిడెడ్ పాఠశాల తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎండలోనే బారులు తీరారు. మధ్యాహ్నంకు ఎండ వేడిమితో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తగ్గారు. 2గంటల సమయానికి భారీ వర్షం కురవడంతో సుమారు గంట పాటు పోలింగ్‌కు ఓటర్లు వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. ఎల్ ఆర్ ఎయిడెడ్ పాఠశాల వద్ద చిన్న ప్రాంగణంలోనే 3 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేయడంతో మరింత ఇరుకుగా మారింది. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిలిచి పోవడంతో ఓటర్లు వర్షపు నీటి లోనే బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఎండ వేడిమితో వెను దిరిగివెళ్లిన ఓటర్లు సాయంత్రం వర్షం తగ్గిన తరువాత పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్, కాకానిపాలెం ప్రాథమిక పాఠశాలల, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలల వద్ద పోలింగ్ బూత్‌లవద్ద రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.

పోటెత్తిన ఓటర్లు

- పలు గ్రామాలలో ఉదయం నుంచే బారులు
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేచి ఉన్న వైనం

పర్చూరు : పర్చూరు నియెజకవర్గంలో ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ సమయానికి ముందే అయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలో బారులు తీరారు. వివిధ ప్రాంతాలలో పర్చూరుకు చెందిన ఓటర్లు తమ సొంత నియెజకవర్గంలో ఓటు వేసేందుకు గ్రామాలకు చేరుకొన్నారు. దీంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చురుకొని ఓటు వేసేందుకు పోటీ పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో మండలంలోని అయా గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్ద సంఖ్యలో ఓటర్లు చేరుకోవడం ఇందుకు నిదర్శనం. వృద్ధులు, దివ్యాంగులు, నూతంగా ఓటు హక్కు పొందిన యువకులు తమ ఓటు హక్కును వినియెగించుకోవడానికి ఆసక్తి చూపారు. ఒక పక్క మండు టెండ, మరో పక్క ఉక్క పోతను కూడా లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలను తరలివచ్చి, గంటల తరబడి కేంద్రాల వద్ద క్యూలో నిరీక్షించారు. దీంతో పోలింగ్ శాతం గతం కంటే గణనీయంగా పెరిగింది. మండలంలోని దేవరపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో కొంతసేపు ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. తిరిగి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. అయితే అయా గ్రామాలలో స్వల్ప వివాదాలు మినహా పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. అయితే పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉండడం సరైన వసతుల లేకపోవడంతో కొన్ని కేంద్రాలలో ఓటర్లు తీవ్ర అవస్థకు గురయ్యారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఓటు హక్కు వినియెగించుకోవాలన్న పట్టుదలతో కేంద్రాల వద్దే వేచి ఉన్నారు.

జోరు వానలో ఓటరు జోరు

పర్చూరులో సోమవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో వడగళ్లు, గాలి దుమారం, భారీ వర్షం కురవడంతో అయా పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితి చిత్తడిగా మారింది. ఒక పక్క కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు పడిపోవడం మరో పక్క భారీ వర్షంతో పోలింగ్ కేంద్రాల వద్ద నీరు చేరడంతో అనీటిలోనే గంటల తరబడి నిల్చొని మరి ప్రజలు ఓటు హక్కును వినియెగించుకున్నారు.

కిక్కిరిసిన పోలింగ్ కేంద్రాలు.. ఓటర్లకు అవస్థలు

పర్చూరులోని ఇందిర కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఓటర్లను ఉక్కిరి బిక్కిరి చేసింది. కేంద్రాల పరిమితికి మించి ఓటర్లు ఉండడం ఒక్క సారిగా పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు చంటి బిడ్డలతో సహాతరలి రావడంతో ఓటర్లు నానా అవస్థలు పడ్డారు. కేంద్రంలో సరైన వెలుతురు గానీ గాలిగానీ లేకపోవడంతో ఓటర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతో ఒక్కసారిగా ఓటు వేసేందుకు గుంపులుగా రావడంతో వారిని అదుపు చేయడానికి పోలీసులు పడరాని పాట్లు పడ్డారు. మరో పక్క పోలీసు సిబ్బంది కూడా అరకొరగా ఉండడంతో ఏమి చేయాలో పాలుపోక పోలీసులు సైతం చేతులేత్తేశారు. దీంతో అ పోలింగ్ కేంద్రం వద్ద కొంత గందరగోల పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సీఐ సీహెచ్ సీతారామయ్య పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని సమస్యను ఓటింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.



అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని బారులు తీరిన ఓటర్లు

బారులు తీరిన ఓటర్లు

మార్టూరు, మే 13 : అసెంబ్లీ ఎన్నికలు పోలింగ్‌కు ఓటర్లు ఉత్సాహంతో పోటెత్తారు. సోమవారం పోలింగ్ కేంద్రాలకు ఉదయం 7 గంటలకే తరలి వచ్చారు. ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా ఓటు వేసేందుకు ఆ సక్తిగా కేంద్రాల వద్దకు వచ్చారు. మార్టూరులో ఉన్న 19 పోలింగ్ బూత్‌ల వద్దకు ఉదయం 8 గంటలకే ఓటర్లు బారులుతీరారు. మండలంలో 72 పోలింగ్ బూత్‌ల వద్దకూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో 38వ బూత్‌లో ఈవీఎం మెషీన్ సక్రమంగా పని చేయకపోవడంతో దాదాపుగా గంటకు పైగా ఆ ల స్యంతో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అదే విధంగా సాయంత్రం 2 గంటలకు కోలలపూడిలోని 66వ బూత్‌లో ఈవీఎం ఆగిపోయింది. మరో ఈవీఎంను పర్చూరు నుం చి తెప్పించారు. సుమారు గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉదయం బూత్‌ల రద్దీ ఉండడంతో ఓటే వేసేందుకు వచ్చిన వృద్ధులు 2గంటలకు పైగా నిరీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది చాలా తక్కువగా ఉండడంతో జడ్పీ హైస్కుల్ వద్ద ఓటు వేసేందుకు వచ్చిన వారి కన్నా ఇతరులు ఎక్కువగా గుమిగూడారు. సాయంత్రం 6 గంటలు ముగిసిన తర్వాత కూడా మార్టూరు లోని 27వ బూత్‌లో, ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న బూత్‌లో, ద్రోణాదుల, బొబ్బేపల్లి, ద్వారకపాడు కోనంకి గ్రామాలలో కొన్ని బూత్‌ల వద్ద ఓటర్లు ఓటు కోసం క్యూలో నిలబడ్డారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఆల స్యంగా ఓట్లు నమోదు కావడం, ఎక్కువ ఓట్లు ఉండడంతో ఆలస్యం అయినట్లు అధికారులు తెలిపారు.

కోనంకిలో ఘర్షణ

మండలంలోని కోనంకి గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య సోమవారం మధ్యాహ్నం కొంత ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వాస్తవంగా ఉదయం 10 గంటల సమయంలోనే రెండు పార్టీలకు చెందిన వారి మధ్య తోపులాట జరగ్గా విషయం తెలుసుకున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌పీ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి వారిపై లాఠీచార్జి చేసి చెల్లా చెదురు చేశారు. తర్వాత మళ్లీ గొడవ జరగడంతో వరదయ్య, శేషగిరి రావు, గురవయ్య అనే వ్యక్తులు గాయపడినట్లు తెలిసింది. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ బెటాలియన్‌తో అక్కడకు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. వారిలో వరదయ్యను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మిగిలిన ఇద్దరినీ మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో పోలీస్ అబ్జర్వర్ ఎంఎ అయ్యప్పన్ కోనంకి గ్రామం వచ్చి గొడవ జరిగిన తీరును పరిశీలించి పోలీసు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక మండలంలో వలపర్ల, ద్రోణాదుల, చిమ్మిరి బండ గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద రెండు పార్టీలకు చెందిన వ్యక్తుల మధ్య తోపులాట జరిగినట్లు తెలిసింది. ఈ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది స్పందించడంతో పరిస్థితి ప్రశాంతంగా ముగిసింది.

చెదురుమదురు ఘటనల మధ్య..

- ఓట్లు వేసేందుకు ఆసక్తి చూపిన ఓటర్లు
- నక్కబొక్కలపాడులో వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి, నేతలు వెళ్లారని టీడీపీ కార్యకర్తల ఆగ్రహం

బల్లికురవ : మండలంలోని 56 పోలింగ్ బూత్‌లలో సోమవారం సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ చెదురు మదురు ఘటనల మధ్య ప్రశాంతంగా జరిగింది. ఓట్లు వేసేందుకు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలకు యువత కూడా ఉదయం ఆరు గంటల నుంచే బారులు తీరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో ఉండే గ్రామీణా ఓటర్లు ఓట్లు వేసేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. కొన్ని గ్రామాలలో ఈవీఎంలు మంద కొడిగా పనిచేయడంతో పోలింగ్ ప్రక్రియ కొంత ఆలస్యం అయింది. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఓటర్లు ఓట్లు వేసేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈవీఎంలు సరిగ్గా పనిచేయక పోవడంతో అక్కడి ఓటర్లు సీ-విజిల్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేశారు. కొన్ని గ్రామాలలో ఓటర్లకు సరైన సౌకర్యాలు లేక పోవడంతో ఎండలోనే నిలబడి ఓట్లు వేశారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, వైదన, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం కొత్తపాలెం, కొండాయపాలెం గ్రామాలలో ఓటింగ్ సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు, వాదనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ మాత్రం ప్రశాంతంగా జరిగింది. ఓటింగ్ మాత్రం ప్రశాంతంగా జరిగింది. పలు రూట్లలో పోలీసు అధికారులు ప్రత్యేక మొబైల్ టీంలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో ఓటింగ్ సజావుగా సాగింది. మండలంలోని కొండాయపాలెం గ్రామంలో పోలింగ్ ముగిశాక వైసీపీ, టీడీపీ నేతల మధ్య కొట్లాట జరగడంతో ఇరువర్గాల వారికి స్వల్ప గాయాలయ్యాయి. అలానే నక్కబొక్కపాడు గ్రామంలో వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి పోలింగ్ బూత్ పరిశీలనకు లోపలికి వెళ్లగా అయనతో వైసీపీ నేతలు వెళ్లారని టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేకలు వేయడంతో పోలీసులు వెంటనే వచ్చి లోపల ఉన్న వారిని బయటకు తీసుకురావడంతో వివాదం సద్దు మణిగింది. పంచాయతీల ఎన్నికలను తలపించేలా కొన్ని గ్రామాలలో ఎంతో పట్టుదలగా ప్రజలు ఓట్లు వేశారు. కొన్ని గ్రామాలలో 95 శాతం పైబడి పోల్ జరిగినట్లు అంచనా. గ్రామాలలో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది.

యద్దనపూడి మండలంలో ప్రశాంతం

యద్దనపూడి, (మార్టూరు) : ఎన్నికలలో యద్దనపూడి మండలంలోని ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ప్రజలతోపాటు పోలీసులు, ఇరు పార్టీల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం మండలంలోని చింత పల్లిపాడు గ్రామం వద్ద తెలుగుదేశం కూటమి ర్యాలీగా వెళ్లే బైక్ ర్యాలీ కార్యకర్తలకు, ఎంపీ నందిగం సురేష్ కు మధ్య కొంత వివాదం జరిగిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు ముందు చూపుగా చింతపల్లిపాడు, యనమదల గ్రామాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేకంగా బందోబస్తుగా స్పెషల్ బెటాలియన్ల పోలీసులను మోహరించడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 28 పోలింగ్ బూత్‌లున్నాయి. వాటిలో ఉదయం తను బొద్ది వారిపాలెంలో 91 వ బూత్, మున్నంగి వారి పాలెంలో 97వ బూత్‌లో ఈవీఎం మిషన్లు గంట సేపు పని చేయక పోవడంతో తర్వాత ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గన్నవరం గ్రామంలో 94 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషంకాగా ఈ గ్రామంలో టీడీపీ కూటమికి మంచి మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయి. అనంతవరం, యద్దనపూడి, పోలూరు, చింత పల్లిపాడు, యనమదల తదితర గ్రామాలలో పోలింగ్ సరళి పట్ల టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అయితే యద్దనపూడి ఎస్సీ కాలనీలో 84వ బూత్, 7 గంటల తర్వాత కూడా 150 మంది ఓటర్లు ఓటు వేసేందుకు క్యూలో నిలబడినట్లు తెలిసింది.

ముగిసిన పోలింగ్

చినగంజాం : ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు బారులుతీరారు. మహిళలు, యువకులు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పెదగంజాం 290, నీలాయపాలెం 289, సోపిరాల 272 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మరమ్మతులకు గురికావడంతో అర్ధగంటకు పైగా పోలింగ్ నిలిచిపోయింది. రామచంద్రానగర్ 8.40 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.40కి ముగిసింది. చినగంజాం జడ్పీ పాఠశాలలలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్, పెద్దపల్లెపాలెం గ్రామాల్లో టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ పోలింగ్ తీరును పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల బార్లు తీరారు. సంతరవూరులో రాత్రి 7.45గంటలకు పోలింగ్ ముగిసింది. కడవకుదురు, పెద్దపల్లె పాలెం, పెదగంజాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉండడంతో రాత్రి 8.00 గంటల వరకు పోలింగ్ సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగక పోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

పంగులూరు : పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎండను కూడా లెక్క చేయకుండా ఆరికట్లవారిపాలెం, జనకవరం, చందలూరు, కోటపాడు గ్రామాలలో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 6 గంటలకు ముగిసినప్పటికీ వందల సంఖ్యలో ఓటర్లు ఉండడంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో కొనసా గించారు. ఎమ్మెల్యే రవికుమార్ చందలూరు లో పోలింగ్ సరళిని పరిశీ లించారు.

సంతమాగులూరులో ప్రశాంతం

సంతమాగులూరు : మండలంలోని అన్ని గ్రామాలల్లో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతగా పోలింగ్ జరిగింది. మండలంలోని కుందుర్రు గ్రామంలో సాయంత్ర 5 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు ఓటర్లు క్యూలైన్‌లలో బారులు తీరారు. మండలంలోని సంతమాగులూరు, పాతమాగులూరు, మిన్నెకల్లు, తంగేడుమల్లి, చవిటిపాలెం, గురిజేపల్లి, బండివారిపాలెం, కొప్పరం, సజ్జాపురం, కొమ్మాలపాడు, ఏల్చూరు, మక్కెనవారిపాలెం, మామిళ్లపల్లి, పరిటాలవారిపాలెం, పుట్టావారిపాలెం, కామేపల్లి, వెల్లలచెరువు, అడవిపాలెం తదితర గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.





భవానీ సెంటర్‌లో రామయ్య పంతులు బడిలో వర్షపు నీటిలో నిల్చొని ఉన్న మహిళలు.. సంతమాగులూరులో క్యూలో ఉన్న ఓటర్లు.. మార్టూరులో మండుటెండలో బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు



ఓటు వేస్తున్న కొండయ్య

చీరాల, మే 13 : సార్వత్రిక ఎన్నికలలో సోమవారం పోటీలో నిలుచున్న అభ్యర్థులు వారి, వారి ఓటు ఉన్న పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామకృష్ణాపురం పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే కరణం బలరాం తన ఓటును వేశారు. కొత్తపేట పోలింగ్ కేంద్రంలో టీడీపీ కూటిమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్, 12 మంది స్వతంత్ర అభ్యర్థులు వారి ఓట్లు ఉన్న పోలింగ్ బూత్‌లలో వారి, వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చీరాలలో పోలింగ్ సాగిందిలా

చీరాల, మే 13 : చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,02,711 మంది ఉన్నారు. 9.30 గంటలకు 82 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయింది. ఉదయం కొన్ని కేంద్రాలలో ఈవీఎంల ప్రారంభ ప్రక్రియ ఒకింత జాప్యం జరిగింది. దీంతో మొదటి రెండు గంటల వ్యవధిలో 11.08 శాతం మాత్రమే పోలయ్యాయి. తరువాత ఎండ వేడిమి, ఉక్కపోతతో పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య తగ్గింది. ఈ క్రయంలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో 6 గంటలలోపు పోలింగ్ కేంద్రాల క్యూలో ఉన్న ఓటర్లకు సంబంధించి కొన్ని కేంద్రాలలో పోలింగ్ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది.

మంచి అభ్యర్థిని ఎన్నుకోవడంలో అద్దంకి ప్రజలు ముందుంటారు

- గతంలో అత్యధిక ఓటింగ్
- ఈసారి 90శాతం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 13 : అద్దంకి నియోజకవర్గ ప్రజలు మంచి అభ్యర్థిని ఎన్నుకోవడంలో ముందుంటారని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్‌లో సోమవారం మధ్యా హ్నం గొట్టిపాటి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత రెండు సార్వత్రిక ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గ ఓటర్లు మంచి అభ్యర్థిని ఎన్నుకున్నారు. రెండు సార్లు అత్యధిక ఓటింగ్ శాతం నమోదయిందన్నారు. ఈ విడత కూడా 90 శాతం ఓటు హక్కును వినియోగించుకుని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను ఎన్నుకుంటారని భావిస్తున్నానని అన్నారు. గొట్టిపాటి కు టుంబ సభ్యులు కూడా అనంతరం ఓటు హక్కు విని యోగించుకున్నారు. పంగులూరులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య, శాప్‌నెట్ మాజీ ఛైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటర్లకు గొట్టిపాటి కృతజ్ఞతలు

అద్దంకి నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు అందరికీ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు కోసం ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, మహిళలకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్‌లో ఓటును వేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి



పూసపాడులో గుంపులుగుంపులుగా ఉన్న ఓటర్లు

ఓటర్లకు తిప్పలు

పలు కేంద్రాల వద్ద వసతులు కరువు

ఇంకొల్లు, మే 13 : పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పావులూరులో మండుటెండలో సైతం మహిళలు వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూసపాడు గ్రామంలో చిన్న బిల్డింగ్‌లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఓటర్లు రద్దీ పెరిగి ఓటు వేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంపులు గుంపులుగా నిలబడి ఓట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గంగవరంలో 246 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించి పోలింగ్ సుమారు గంటకుపైగా నిలిచిపోయింది. ఈవీఎంలు నెమ్మదిగా పని చేయడంతో ఓటర్లు క్యూ లైన్లలో గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకొల్లు మండలంలో మొత్తం 13 గ్రామపంచాయతీలలో 54 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగండ్ల, నక్కలపాలెం, గంగవరం గ్రామాలలో చిన్న చిన్న వివాదాలు జరిగినప్పటికీ ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.ఇంకొల్లు మండలంలో 85 శాతానికిపైగా పోలింగ్ జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు తెలిపారు. ఇంకొల్లు స్టాలిన్‌పేటలో రాత్రి 7 గంటల వరకు కూడా ఓట్లు వేసేవారు బారులు తీరి ఉన్నారు. సుమారు 150 మందికి పైగా ఓటు వేయాల్సిన వారు క్యూలో ఉన్నారు. స్టాలిన్‌పేట ఈ బూత్‌లో మొత్తం 1050 ఓట్లుకు గాను రాత్రి 7 గంటల వరకు సుమారు 800 మంది మాత్రమే ఓటు వేశారు. 150 క్యూలో ఉన్నారు. రాత్రి 9 గంటల వరకు పట్టవచ్చునని అధికారులు తెలిపారు.

ఇసుకదర్శిలో ఓటేసిన ఏలూరి



కుమారుడితో కలిసి ఓటేసిన ఏలూరి

మార్టూరు, మే 13 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశి వరావు తనకుమారుడు దివ్యేష్‌తో కలిసి సోమవారం ఉదయం మండలంలోని ఇసుకదర్శిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి కుమారునితో కలిసి 44వ బూత్‌లో తమ ఓటును వేశారు. అనంతరం గ్రామంలోని పో లింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి పోలింగ్ తీరును పరిశీలించారు. తర్వాత మార్టూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న పోలింగ్ బూత్‌లను, జడ్పీ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లను సందర్శిం చారు. అనంతరం డేగరమూడి గ్రామంలో పోలింగ్ సరళిని, తర్వాత యద్దనపూడి మండలం చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి, జాగర్ల మూడి గ్రామాలలో పోలింగ్ కేం ద్రాలకు వెళ్లి పోలింగ్ తీరును పరిశీలించారు. ఆ యా కేంద్రాలలో ఓటర్లకు నమస్కారం పెడుతూ చిరునవ్వుతూ ముందుకు వెళ్లిపోయారు. అయితే ఉదయం సమయానికే మహిళలు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు రావడంతో ఏలూరి సంతోషం వ్యక్తం చేశారు.

వడగళ్లతో భారీ వర్షం

- జలమయమైన రహదారులు
- అవస్థలు పడిన ప్రజలు



మధ్యాహ్నం భారీగా కురిసిన వాన

పర్చూరు, మే 13 : గాలి దుమారం, మరో పక్క భారీ వర్షంతో ప్రజలు బెంబేలెత్తారు. సోమవారం ఒక్క సారిగా భారీ వర్షంతో పాటు వడగళ్ల వాన కురిసింది. కుండపోతతో కూడి వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. శివారు కాలనీల్లోని నివాసాల్లోకి వాన నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో పక్క సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లు సైతం గాలికి చెల్లా చెదురయ్యాయి. దీంతో ఎన్నికల సిబ్బందితోపాటు, ఓటు వేసేందుకు కేంద్రాల వద్దకు వెళ్లిన ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. పర్చూరు - చీరాల ఆర్‌అండ్‌బీ రోడ్డులో పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. సరఫరా నిలిపివేత

గాలిదుమారంతో పెద్దపెద్ద చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాలు అందకారం నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మండే ఎండ.. ఉక్కపోతతో.. ఇబ్బందిపడ్డ ఓటర్లు



గొల్లపాలెంలో ఎండలో ఉన్న ఓటర్లు

చీరాల, మే 13 : ఎన్నికల వేళ మండే ఎండ ఓటర్లును ఇబ్బంది పెట్టింది. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా కొన్ని కేంద్రాలలో ఇవీఎంలను మాక్ పోలింగ్‌కు సమాయత్తం చేయటంలో కొంత జాప్యం జరిగింది. ఆ తరువాత పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2, 02, 711 ఓట్లు ఉన్నాయి. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 218 బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు, వాటి సమీపంలో తప్ప ఇతర ప్రాంతాల్లో జనసంచారం తక్కువగా ఉంది. దుకాణాలు మూతపడి, జనసంచారం తగ్గటంతో ప్రధాన రహదారులు బోసిపోయాయి. పలు బూత్‌లలో మొదటిసారిగా ఓటు పొంది వినియోగించుకునేందుకు వచ్చిన యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం గతంతో పోలిస్తే ఎక్కువ మంది వచ్చినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యం నామ మాత్రమేనని కొన్ని కేంద్రాల వద్ద ఓటర్లు ఆరోపించారు. ప్రతి కేంద్రం వద్ద హెల్త్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అందులో పోలింగ్ వచ్చినవారిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 1.30 గంటల వరకు ఎండవేడిమి, ఉక్కపోతతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. మధ్యాన్నం 2 గంటల నుంచి పైరగాలి తోలటంతో అప్పటి నుంచి పోలింగ్‌కు వచ్చిన ఓటర్లు ఒకింత ఊపిరిపీల్చుకున్నారు.

పెదనక్కలపాలెంలో ఘటన

- ఎంపీ అనుచరుడి హల్‌చల్
- ఓటర్లతో వాగ్వివాదం.. ఒకరికి గాయం.. ఫిర్యాదు



సాయికిరణ్ చేతికి తగిలిన గాయం

ఇంకొల్లు, మే 13 : మండలం పెదనక్కలపాలెం పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ నందిగామ సురేష్ అనుచరిడినని ఒకరు హల్‌చల్ చేశారు. పావులూరు గ్రామానికి చెందిన కే వినోద్ పెదనక్కలపాలెంలో కేంద్రం వద్ద వీడియోలు తీస్తుండగా, గ్రామస్థులకు అనుమానం వచ్చి వినోద్‌ను ప్రశ్నించగా తాను ఎంపీ అనుచరుడినని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి తల్లపనేని సాయికిరణ్ చేతికి గాయాలైనట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఇరువర్గాలు ఇంకొల్లు పోలీసుస్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జునరావు తెలిపారు.



హమ్మయ్య.. మా కర్తవ్యం పూర్తయింది..! పోలింగ్ అనంతరం సోమవారం రాత్రి నెల్లూరులోని ప్రియదర్శిని కాలేజీకి ఈవీఎం యంత్రాలను తీసుకొస్తున్న సిబ్బంది



కావలిలో ఓటు హక్కు వినియోగం కోసం బారులు తీరిన ప్రజలు



ఎంతో కాలంగా ఈ రోజు కోసం ఎదురుచూసినట్టు.. ఎన్నో రోజులుగా అణచిపెట్టుకున్న ఆగ్రహాన్ని ప్రదర్శించే అదను దొరికినట్టు.. ఐదేళ్ల బందీఖానా నుంచి స్వతంత్రపు వాకిళ్లలోకి జొరబడినట్లు, భయం భయంగా బతికే రోజులకు చెల్లుచీటీ రాయడానికి కలబలుక్కొని కదన రంగానికి దూకినట్టు.. నవ్యాంధ్రప్రదేశ్ దిశ, దశ మార్చే అరుదైన అవకాశం చేజార్చుకోకూడదన్నట్టు.. నెర్రెలు చీలిన నేల నుంచి జనం పుట్టుకొచ్చినట్లు ఎటు చూసినా జన సందడే కనిపించింది. పోలింగ్ సందర్భంగా ఏదో జాతర జరిగిన సంబరం కనిపించింది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల క్యూలైన్లు మానవ పరిమళంతో గుబాళించిపోయాయి. రాత్రి 8 గంటల వరకు ఈవీఎం మిషన్లు ఎడతెరపి లేని ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన విధుల్లో కీ...చ్ మనే ఈవీఎంల శబ్దాలతో సప్తస్వరాల అనుభూతిని కలిగించాయి. ఎట్టకేలకు మండే సూరీడు సైతం చిన్నబోయేలా జన ప్రభంజనం పోలింగ్ కేంద్రాలను చుట్టుముట్టింది.

ఓటోత్సాహం!

హక్కు వినియోగానికి కసిగా కదిలొచ్చిన జన సమూహం | రాత్రి 11 గంటల వరకు క్యూలైన్లలో ఓటర్లు | 78 శాతానికిపైగా పోలింగ్ | మెజారిటీ నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగా ఓటింగ్ | అంతా ప్రశాంతం



ఉలవపాడు : కృష్ణాపురం పోలింగ్ కేంద్రంలో అర్ధరాత్రి 11.30 గంటలకు ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రజలు

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సంతోషమో, తెలియని ఆవేశమో కానీ సోమవారం ఓటేయడానికి జనం పోటెత్తి వచ్చారు. ఉదయం చాలా ప్రాంతాల్లో ఈవీఎంలు మొరాయించినా 9 గంటల సమయానికి 9.51 శాతం పోలింగ్ జరిగింది. 11 గంటల సమయానికి అది 23.77 శాతం పెరిగింది. ఆ సమయానికి ఒక్క ఆత్మకూరు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలు వేగం పుంజుకున్నాయి. ఉదయం 11 గంటల సమయానికి నెల్లూరు సిటీ అత్యధికంగా 29.50 శాతం ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం 1 గంట సమాయానికి జిల్లా సగటు పోలింగ్ శాతం 42.38 శాతానికి పెరిగింది. ఈ సమయంలో ఉదయగిరి అత్యధికంగా 52.16 శాతం, కోవూరు 47శాతం పోలింగ్ జరిగాయి. సాయంత్రం 3 గంటల సమయానికి పోలింగ్ 58.14 శాతానికి పెరిగింది. ఈ సమయానికి కందుకూరు 65.32, సర్వేపల్లి 61.90 శాతం పోలింగ్‌తో అగ్రస్థానంలో నిలిచాయి. సాయంత్రం 5 గంటల సమయానికి జిల్లా సగటు పోలింగ్ 69.95 శాతానికి చేరుకోగా, కందుకూరు, కోవూరు, సర్వేపల్లి, ఉదయగిరి నియోజకవర్గాలు 74.68 శాతం నుంచి 72.69 పోలింగ్‌తో అగ్రస్థానాల్లో నిలిచాయి. సాయంత్రం 5 గంటల తరువాత కూడా జిల్లా వ్యాప్తంగా మెజారిటీ పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లలో భారీ సంఖ్యలో ఓటర్లు నిలబడి ఉన్నారు. రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగుతూనే ఉంది. పోలింగ్ పూర్తి అయ్యే సరికి జిల్లా సగటు పోలింగ్ శాతం 80 దాటే అవకాశం ఉందని అధికారుల అంచనా. 2014 ఎన్నికల్లో జిల్లా సగటు పోలింగ్ శాతం 74 కాగా, 2019లో 78 శాతంగా రికార్డు అయ్యింది. ఈ ఎన్నికల్లో సగటు పోలింగ్ 80 శాతం దాటే సూచనలు కనిపిస్తున్నాయి.

కట్టలు తెంచుకున్న ఉత్సాహం

ఓటు హక్కు వినియోగించుకునే క్రమంలో ప్రజల్లో ఉత్సాహం కట్టలు తెంచుకుంది. ప్రధానంగా మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడం కనిపించింది. ఉదయం 6 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల క్యూలైన్ల వద్ద మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో బారులు తీరి నిలబడి ఉన్న దృశ్యాలు కనిపించాయి. ఉదయం 10 గంటలు దాటితే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఉదయాన్నే ఓటు వేయడానికి ప్రజలు భారీగా వచ్చారని, మధ్యాహ్నానికి పోలింగ్ కేంద్రాలు ఖాళీ అవుతాయని అందరూ అనుకున్నారు. అయితే అందుకు భిన్నంగా ఉదయం 7 గంటలకు ఎలా వచ్చారో మధ్యాహ్నం కూడా అదే తరహాలో ఓటేయడానికి ప్రజలు తరలిరావడం గమనార్హం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే ఒరవడి కొనసాగింది. ప్రతి గంటకు 6 శాతం చొప్పున పోలింగ్ శాతం పెరుగుతూనే రావడం దీనికి నిదర్శనం.



జిల్లాలో పోలైన ఓట్లు	
నియోజకవర్గం	శాతం
కందుకూరు	82.19
కావలి	81.83
ఆత్మకూరు	82.06
కోవూరు	78.07
నెల్లూరు సిటీ	70.20
నెల్లూరు రూరల్	66.18
సర్వేపల్లి	83.39
ఉదయగిరి	83.64

విజయసాయి వీరంగం !



రేబాలలో విజయసాయిరెడ్డిని చుట్టుముట్టిన టీడీపీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో ఏర్పాటు చేసిన 52వ పోలింగ్ బూత్ వద్ద సోమవారం నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాకం విజయసాయిరెడ్డి కొంతసేపు వీరంగం సృష్టించారు. క్యూలో ఉన్న ఓటర్లకు ఎరగా నీళ్ల సీసాలు పంపిణీ చేశారు. ఓ ఎంపీ అభ్యర్థి ఇలా చేయడం ఏమిటి..? అంటూ రేబాల గ్రామ టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సాయన్న ప్రజలపై జులుం ప్రదర్శించి వీరంగం సృష్టించారు. మర్యాదగా ఇక్కడినుంచి వెళ్లమంటూ వారిని బెదిరించారు. దీంతో టీడీపీ నాయకులు వాదనకు దిగారు. మాటామాటా పెరగడంతో రేబాల నుంచి 400మందికిపైగా ప్రజలు వచ్చి విజయసాయిపై ఆగ్రహించారు. దీంతో ఆయన దూరంగా వెళ్లిపోయారు. ఇంతలో ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి అక్కడికి చేరుకుని సాయన్నను వారించబోగా ఆయన వినలేదు. ఇంతలో రూప్‌కుమార్ యాదవ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, ఎర్రంరెడ్డి అనుచరులు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పార్టీలకు అతీతంగా అక్కడికి వచ్చిన రేబాలవాసులు 'మా రేబాల వాసినే నెడతారా..? వదిలే ప్రసక్తే లేదు' అంటూ విజయసాయిపై ఆగ్రహించారు. ఇంతలో సీఐ హైమారావు అక్కడికి చేరుకుని చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. ఇంతలో బుచ్చి నుంచి వచ్చిన వైసీపీ నాయకులు ఎర్రంరెడ్డికి, టీడీపీ నాయకులకు నచ్చజెప్పి సర్దుబాటు చేశారు. అయినా క్షమాపణచెప్పే వరకు వదిలేదిలేదని వారు చెప్పగా, విజయసాయిరెడ్డిని సీఐ, పోలీసులు, ఇతర వైసీపీ నాయకులు దగ్గరుండి కారులో సాగనంపారు. అలాగే మండలంలోని పోలింగ్ బూత్‌లను సందర్శించిన విజయసాయిరెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జొన్నవాడ, మినగల్లు, రేబాల సర్పంచులపై, టీడీపీ నాయకులపై ప్రదర్శించిన జులుం, దుర్భాషలు ఆడిన తీరు ఓటర్లను భయాందోళనకు గురిచేశాయి.

టీడీపీలో జోష్..!

పెరిగిన పోలింగ్ కూటమికి అనుకూలమనే అంచనా

అదే కారణంగా వైసీపీకి ప్రతికూల పరిస్థితులు

నెల్లూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : పోలింగ్ భారీగా జరిగితే అది అధికార పార్టీకి ప్రతికూలం అనేది రాజకీయ వర్గాల సిద్ధాంతం. గత రెండు ఎన్నికల పోలింగ్ తీరును గమనిస్తే దాదాపుగా అది నిజమనే తేలింది. 2014లో జిల్లా సగటు పోలింగ్ 74 శాతం. ఆ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయింది. 2019 ఎన్నికల్లో పోలింగ్ 78 శాతం జరిగింది. ఆ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ జిల్లాలో తుడిచిపెట్టుకొని పోయింది. పదికి పది సీట్లు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీనే గెలుచుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో సోమవారం సాయంత్రం 5 గంటలకే 70 శాతం జరిగింది. అప్పటికీ పోలింగ్‌కు గంట సమయం ఉండగా, క్యూలైన్లలో ఉన్న వారి సంఖ్య ఆధారంగా గమనిస్తే రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది. ఉదయం నుంచి ప్రతి గంటకు 6 శాతం పోలింగ్ పెరుగుతూ వచ్చింది. ఆ కోణంలో చూసినా జిల్లాలో పోలింగ్ 80 శాతం దాటే అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఉన్న జననాడి ప్రకారం ఇంత భారీ పోలింగ్ అధికార వైసీపీకే నష్టం. ఆ కోణంలో చూస్తే జిల్లాలో సైకిల్ జోరు పెరుగుతుందని, ఫ్యాను మట్టికరుస్తుందనే అంచనాలు ఊపందుకున్నాయి. పోలింగ్ శాతం పెరగడం అధికార పార్టీకి నష్టం అనే సిద్ధాంతమే నిజమైతే గత ఎన్నికల్లో పదికి పది సీట్లు గెలుచుకున్న వైసీపీ ఈ ఎన్నికల్లో అంతే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని పరిశీలకులు భావిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైతం జిల్లాలో స్వీప్ చేస్తామనే దీమా వ్యక్తం చేస్తున్నారు. ఉదాహణకు సర్వేపల్లి విషయానికి వస్తే గత ఎన్నికల్లో ఇక్కడ 80 శాతానికిపైగా పోలింగ్ జరిగింది. ఆ ఫలితాల్లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి రెండవసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల సమయానికి 73 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ పూర్తయ్యే సమయానికి ఈ సారి కూడా ఈ నియోజక వర్గంలో దాదాపు 80 శాతం పోలింగ్ జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ కోణంలో చూస్తే ఈ ఫలితాలు ప్రతిపక్ష పార్టీకి చెందిన సోమిరెడ్డికి అనుకూలంగా ఉండాలి. అలాగే కోవూరు, ఉదయగిరి, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సైతం సాయంత్రం 5 గంటలకు దాదాపుగా 70 శాతం వరకు పోలింగ్ జరిగింది. కందుకూరులో అత్యధికంగా 74.68 శాతం పోలింగ్ జరిగింది. అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్ ముగిసే సమయానికి 75 శాతం చేరుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఎక్కువ శాతం పోలింగ్ కావడం అధికార పార్టీకి నష్టం అనే సిద్ధాంతం నిజమయ్యే పక్షంలో ఈ నియోజకవర్గాల్లో కూడా వైసీపీకి ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇక నెల్లూరు సిటీ విషయానికి వస్తే పోలింగ్ పర్సంటేజీతో సంబంధం లేని విధంగా ఫలితాలు ఏకపక్షంగా ఉండబోతున్నాయన్న విషయాన్ని వైసీపీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. నారాయణ చేసిన అభివృద్ధి, గత ఆరు నెలలుగా ఆయన, ఆయన కుటుంబ సభ్యులు గడప గడప తొక్కి ప్రచారం చేసిన తీరు, అనిల్ కారణంగా నిలువునా చీలిన వైసీపీ క్యాడర్ ఇవన్నీ నారాయణ గెలుపును నల్లేరు మీద బండి నడక చేశాయని, సిటీ పోలింగ్ నారాయణకు అనుకూలంగా ఏకపక్షంగా జరిగిందని ప్రజలు చెప్పుకొంటున్నారు. వర్గాల వారీగా విశ్లేషిస్తే పోస్టల్ బ్యాలెట్‌లోనే ఉద్యోగ వర్గాలు అధికార పార్టీని మడతపెట్టేశారు అంటే ఆ కుటుంబాల ఓటు తీరు ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పోలింగ్‌లో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వెనుక ఉచిత బస్సు ప్రయాణం, మెగా డీఎస్సీ ఉద్యోగ, ఉపాధి కల్పన భరోసాలే కారణాలుగా తెలుస్తోంది. అధిక ధరలు, పెరిగిన కరెంటు చార్జీలు, మద్యం ధరలు, నాణ్యత ప్రభావాలు, మచ్చుకైనా కనిపించని అభివృద్ధి తదితర విషయాలపై మధ్యతరగతి కుటుంబాలు అధికార పార్టీ పట్ల వ్యతిరేకంగా ఉన్నారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ఓటు వేయడానికి జనం దండుకట్టుకొని రావడం ఆ ప్రచారానికి బలం చేకూర్చుతోంది. మొత్తంపై పెరిగిన పోలింగ్ శాతం ఎవరి పుట్టి ముంచుతుందో ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాల్సిందే.



మేమూ.. హక్కు వినియోగించుకున్నా... అంటున్న యువకులు



ఘర్షణలు.. దాడులు



వెంకటాచలంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు



కావలిలో ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు

కందుకూరు : మండలంలోని ఓగూరులో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. తోపులాట సమయంలో ఇనుపరాడ్డు తలకు తగలడంతో ఆయనకు గాయమైంది. అలాగే బంగారమ్మగుడి వద్ద పోలింగ్ కేంద్రంలో సాయంత్రం ఘర్షణ జరిగింది. ఇరువర్గాల మధ్య వివాదం నెలకొనగా వైసీపీ ఏజెంటుపై టీడీపీ కార్యకర్తలు దాడిచేశారు. ఉలవపాడు మండలం టెంకాయచెట్లపాలెం పోలింగ్ కేంద్రంలోకి తన అనుచరులతో కలిసి వెళ్లేందుకు ప్రయత్నించిన వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదనరావును టీడీపీ కార్యకర్తలు అడ్డగించారు. అభ్యర్థిగా మీరు వెళ్లండి కానీ మీ అనుచరులను ఎలా తీసుకెళ్తారని టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించటంతో వివాదం చెలరేగి తోపులాట జరిగింది.

● **ముత్తుకూరు :** సర్వేపల్లి నియోజకవర్గంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలతో ఘర్షణలు చోటుచేసుకోగా, పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ప్రధానంగా వెంకటాచలం, అనికేపల్లిలో వైసీపీ రౌడీమూకలు టీడీపీ కార్యకర్తలపై దాడులు చేశారు. ఒకరికి కాళ్లు విరగగా, పలువురు గాయపడ్డారు. ఈదగాలి, గొలగమూడి, కందలపాడులో ఇరు వర్గాల మధ్య తోపులాటలతో పాటు వాగ్వాదాలు జరిగాయి. తోటపల్లిగూడూరు మండలం సౌత్‌ఆములూరు, కోడూరు, మండపం, ముత్తుకూరు, కృష్ణపట్నంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన సంఖ్యలో పోలీసులు లేకపోవడంతో వైసీపీ నాయకులను అడ్డుకునే వారు లేకపోయారు.

● **కావలి/అల్లూరు :** కావలి నియోజకవర్గంలో వైసీపీ మూకలు రెచ్చగొట్టి దాడులకు పురిగొల్పడంతో పలు చోట్ల ఘర్షణలతో దాడులు జరిగాయి. అల్లూ రు మండలం బీరంగుంటలో అల్లూరు మండలంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ వాతావణం నెలకొంది. ఇందులో టీడీపీ కార్యకర్త గాయపడ్డారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రకు, వైసీపీ నాయకుడు సుకుమార్‌రెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. కావలిలోని ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఓట్లు లేనివారు వచ్చి గొడవపడ్డారు. టీడీపీ, వైసీపీ నాయకులు గొడవ పడ్డారు. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను తరిమి కొట్టారు. వైసీపీ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు దగరుండి తమ అనుచరులతో కేసులు పెట్టించారు. కావలిరూరల్ మండలం తుమ్మల పెంట గురుకుల పాఠశాలలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య తోపులాటలు జరిగాయి. రూరల్ సీఐ అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదర గొట్టారు. దగదర్తిలో టీడీపీ సానుభూతిపరుడు కిషోర్‌ను వైసీపీకి చెందిన తాళ్లూరు రాజశేఖర్ మరికొందరు గాయపరిచారు.



కందుకూరు: ఓగూరులో గాయపడిన యువకుడు

చెదురుమదురు ఘటనలు మినహా

పోలింగ్ ప్రశాంతం



వలేటివారిపాలెం : బడేవారిపాలెంలో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి నాగేశ్వరరావు, ఆయన కుటుంబ సభ్యులు

కావలి, మే 13: కావలి పట్టణంలో ఓమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చెదురుమదురు ఘటనలు మినహా పో



కావలి 13వ వార్డులో ఓటేసిన ఆర్వో శీనానాయక్

లింగ్ ప్రశాంతంగా జరిగింది. ముసునూరులో ఇరువర్గాలు ఘర్షణ, పాతూరులో అడుగడుగున ఆటంకాలతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. పోలీస్‌లు వైసీపీ క్యాడర్‌ను వదిలి వేసి టీడీపీ క్యాడర్‌ను ఇబ్బందులు పెడుతున్నారనే ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక దశలో టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి సీఐ రాజేష్‌తో మా వారిని ఇబ్బందులు పెట్టవద్దని చెప్పారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో వాటి నుంచి రక్షణ పొందేందుకు ఓటర్లు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అయితే అనేక చోట్ల ప్రారంభంలోనే ఈవీఎంలు మొరాయించటంతో వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని అమర్చేసరికి అర్ధగంట నుంచి గంట వరకు పోలింగ్ ఆగడంతో ఓటర్లు క్యూలో నిరీక్షించారు. కొందరు క్యూలో ఉండలేక వెనుదిరిగి వెళ్లారు. అనేక చోట్ల ఓటర్లకు సరిపడా షామియానాలు లేకపోవడంతో ఎండలో ఇబ్బందులు పడారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి వసతి లేదు. కొన్ని పోలింగ్ బూత్‌లలో లైటింగ్ వసతి లేక ఓటు వేసేందుకు సక్రమంగా కనపడక ఇబ్బందులు పడటంతో ఆ తర్వాత లైట్లు తెచ్చి బిగించారు. అలాగే వృద్ధులను ఓటుకు తీసుకెళ్లేందుకు అవసరమైన వీల్ చైర్స్, సహాయకులను ఏర్పాటు చేయలేదు. పోలీస్ సిబ్బంది తగినంత మది లేకపోవడంతో అనేక పోలింగ్ బూత్‌ల వద్ద వివాదాలు జరిగాయి.

పెదపట్టపుపాలెం, చెన్నాయపాలెంలో...



వెంగళరావునగర్‌లో బారులు తీరిన ఓటర్లు

కావలి రూరల్ : మండలంలో తుమ్మలపెంట, ఆముదాలదిన్నెలో చిన్న చిన్న ఘటనల మనహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వృద్ధులు, దివ్యాంగులతో పాటు, చంటిబిడ్డలతో వచ్చిన దంపతులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెంలో సాయంత్రం 6 గంటలకు క్యూలైన్‌లో ఓటర్లు ఉండడంతో రాత్రి 7 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఆముదాలదిన్నె పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీకి చెందిన ఏజెంట్లు తిరుగుతున్నా పట్టించుకోకుండా తమను అడ్డుకుంటున్నారని టీడీపీ ఏజెంట్లు పోలీసులతో వాగ్వివాదం జరిగింది. అనంతరం పోలింగ్ కేంద్రానికి సమీపంలో ఇరు పార్టీలు వేసుకున్న షామియానా టెంట్లను పోలీసులు కూలదోశారు.

ముగిసిన పోలింగ్



బోగోలులో సాయంత్రం బారులు తీరిన ఓటర్లు

బిట్రగుంట : బోగోలు మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరినా మధ్యాహ్నం సమయంలో మందకొండిగా సాగింది. 4 గంటల నుంచి మళ్లీ పోలింగ్ ఊపందుకుంది. బోగోలులో కొన్ని బూతులలో రాత్రి 7.30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దగదర్తిలో వాగ్వివాదం

దగదర్తి మండలంలో టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను సర్దిచెప్పారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ రవీంద్రనాయుడు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

ఘర్షణ.. పలువురికి గాయాలు

అల్లూరు : మండలంలో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. గోగులపల్లిలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బలగాలు అధికంగా లేకపోవడం, ఉన్నవారు వైసీపీకి మద్దతుగా నిలవడంతో అల్లూరు, బీరంగుంటల్లో వాగ్వివాదాలు, తోపులాటలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మండలంలో ఇస్కపల్లిలో వైసీపీకి చెందిన ఓ కార్యకర్త తరచూ పోలింగ్ కేంద్రంలోకి వచ్చి వెళుతుండడంతో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ గమనించి అభ్యంతరం వ్యక్తం చేశాడు. దీనికి ప్రత్యర్థి వర్గమైన బీద రమేష్ గిరిధర్‌ను తన మనిషిని నిలువరిస్తావా అంటూ వాగ్వాదానికి దిగాడు. ఇది కాస్తా తోపులాటకు దారితీసింది. ఇరువర్గాలు భారీస్థాయిలో చేరుకొని ఘర్షణకు దారి తీసే పరిస్థితి చోటు చేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను అక్కడ నుండి పంపించేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు స్వగ్రామమైన ఇస్కపల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మండలంలోని నార్తుమోపూరు, అల్లూరులోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



అల్లూరులో బారులు తీరిన ఓటర్లు

కార్యకర్తల జోలికొస్తే సహించం : కావ్య



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కావ్య కృష్ణారెడ్డి

బీరంగుంటలో జరిగిన ఘర్షణలో గాయపడిన టీడీపీ నాయకులు, కార్యకర్తలను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. అల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలశెట్టి శ్రీనివాసులు, పొంకం సుధాకర్, పొంకం సురేష్, పొంకం విజయ్‌లను ఆయన కలుసుకొని వివరాలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో బీద గిరిధర్, మాలేపాటి సుబ్బానాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాత్రి 8 గంటల వరకు పోలింగ్



కందుకూరు పింక్ పోలింగ్ కేంద్రంలో...

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం ఆరున్నర నుంచే ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. కందుకూరు పట్టణం, రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాలలో పలు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించారు. వివిధ కారణాలతో పోలింగ్ ఆలస్యం కాగా సాయంత్రం 6 గంటల ముందు కూడా వందల సంఖ్యలో ప్రజలు క్యూలైన్లకు చేరుకోవడంతో అనేక పోలింగ్ కేంద్రాలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. పట్టణంలోని 103, 125, 130, 132 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు లేక ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఎండలోనే క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఒక్కో కేంద్రం వద్ద పట్టుమని పది కుర్చీలు కూడా లేకపోవటంతో వృద్ధులు, దివ్యాంగులు గంటలకొద్దీ క్యూలైనులో నిల్చోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు పట్టణంలోని ఎక్కువ పోలింగ్ కేంద్రాలను సందర్శించగా వైసీపీ అభ్యర్థి బుర్రా బుర్రా మధుసూదనరావు ఉలవపాడు, గుడ్లూరు మండలాలపై పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి తన స్వగ్రామమైన మాచవరంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం పట్టణంలోని బంగారమ్మ గుడివద్ద పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాగా కందుకూరు పట్టణంలో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేయటంతో ఈ వాతావరణం నెలకొంది.

మొరాయించిన ఈవీఎంలు

గుడ్లూరు : గుడ్లూరులోని 182, 184, 186 పోలింగ్ కేంద్రాలతోపాటు పలుగ్రామాల్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచే ఈవీఎంలు మోరాయించడంతో ఓటర్లు గంటల తరబడి క్యూలైన్లో నిరీక్షించి ఎండతీవ్రతకు ఇబ్బందిపడ్డారు. మంచినీరు, విద్యుత్ వసతి కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. గుడ్లూరులోని 186, 182, 180 బూతులలో మహిళలు, పురుషులకు ఒకే క్యూలైన్ ఉండడంతో తోపులాట



గుడ్లూరులో ఓటర్ల క్యూ

జరిగింది. అడవిరాజుపాలెంలో పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన కొద్దిసేపటికే ఇరుపార్టీలకు చెందిన ఏజెంట్ల మధ్య తోపులాట జరగడంతో ప్రారంభంలోనే గంటపాటు పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయింది. తో పులాటలో పోలింగ్ కేంద్రం గది తలుపు చెక్కల మధ్య చేతి వేళ్లుపడి అడవిరాజుపా లెం ఎస్సీకాలనీకి చెందిన ఏ లాజర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గుడ్లూరు, అడవిరాజుపాలెం, అమ్మవారిపాలెం, చినలాటవరపి, చేవూరు, రావూరు పోలింగ్ కేంద్రాలకు సరిపడ పోలీస్ సిబ్బందిని కేటాయించకపోవడంతో ఓటర్ల మధ్య తోపులాట జరిగింది. చినలాటవరపి పంచాయతీలోని 197వ బూత్‌లో ఈవీఎంలు తరచూ మొరాయిస్తుండడంతో అక్కడి ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. గుడ్లూరులోని 7 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పరిశీలించారు.



వలేటివారిపాలెం : ఓటు వేసిన ఎమ్మెల్సీ తూమాటి...

స్వల్ప ఉద్రిక్తత

వలేటివారిపాలెం : మండలంలో స్వల్ప ఉద్రిక్తల మధ్య పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటలకు క్యూలో ఓటర్లు ఉండడంతో పోలింగ్ కొనసాగింది. రాత్రి 7:30 గంటల వరకు 70 శాతం పోలింగ్ నమోదైంది. పోలినేనిపాలెం, కళవళ్ల, అయ్యవారిపల్లె, అత్తింటివారిపాలెం, తదితర గ్రామాల్లో ఈవీఎంలు మొరాయిండంతో పోలింగ్ రాత్రి 9 గంటల వరకు కూడా కొనసాగనుంది. పోలినేనిపాలెంలో ఈవీఎం మొరాయించి సుమారు 3 గంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. పోలినేనిచెరువు పంచాయతీలోని పెద్దఅమ్మపాలెంలో ఈవీఎం మొరాయించడంతో మధ్యాహ్నం అర్ధగంట పోలింగ్ నిలిచిపోయింది. చుండిలో ఓటు వేసే విషయంలో ఇరుపార్టీల ఏజెంట్ల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అదే గ్రామంలో వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ తనయుడు పోలింగ్ సరళిని తెలుసుకుంటుండగా టీడీపీ ఏజెంట్‌లు త్వరగా బయటకు వెళ్లాలని అభ్యంతరం చెప్పడంతో ఇరు పార్టీల మధ్య వాగ్వివాదం జరిగింది. కొండసముద్రంలో క్యూలో నిలబడిన మహిళా ఓటరు సొమ్మసిల్లి పడిపోయింది. బడేవారిపాలెంలో టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలినేనిపాలెంలో ప్రకాశం జిల్లా ఉమ్మడి ఎమ్మెల్సీ తూమాటి మాదవరావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ వలేటివారిపాలెం పోలింగ్ బూత్‌ను పరిశీలించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

పోలింగ్ బూత్ వద్ద బుర్రా హల్‌చల్

ఉలవపాడు : కరేడు పంచాయతీ టెంకాయచెట్లపాలెం పోలింగ్ బూత్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ స్థానిక వైసీపీ నాయకులతో కలిసి హల్‌చల్ చేశారు. మందిమార్బలంతో అక్కడికి చేరుకున్న ఆయన అందరితో కలసి పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. అభ్యర్థి ఒక్కరే లోపలకు వెళ్లవచ్చని, ఇతరులు ఎక్కడి నుంచో వచ్చి ఈ పోలింగ్ బూతులోకి వెళ్లడానికి అంగీకరించమని అడ్డుకోవడంతో



వైసీపీ అభ్యర్థి బుర్రాని అడ్డుకుంటున్న టీడీపీ శ్రేణులు

అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే కరేడు పంచాయతీలోని 224 పోలింగ్ బూత్‌లో స్థానిక వైసీపీ కార్యకర్త టీడీపీ పోలింగ్ ఏజెంట్‌పై బూత్‌లోనే కుర్చీ విసిరేసి కలపడ్డాడు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడు వాపోయాడు. కాగా మండలంలో సార్వత్రిక ఎన్నికలు ఒకటి రెండు చోట్ల తప్ప ప్రశాంతంగా ముగిశాయి. అలగాయపాలెం బూత్‌లో మధ్యాహ్నం 30 నిమిషాలపాటు ఈవీఎం మోరాయించింది. ఉలవపాడులోని 241, 245 బూత్‌లలో ఒక్కొక్క బూత్‌లో 1200 మంది ఓటర్లు ఉండటంతో పోలింగ్ రాత్రి 7.30 వరకు జరిగింది. అదే విధంగా చాకిచర్ల 262, 264 బూత్‌లలో కూడా సుమారు 8 గంటల వరకు పోలింగ్ జరిగింది.

పోటెత్తిన ఓటర్లు

లింగసముద్రం : మండలంలో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. దీంతో సుమారు 90 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఉట్లవారిపా



వాకమళ్లవారిపాలెం రాత్రి 9 గంటలకు క్యూలో...

లెం, వాకమళ్లవారిపాలెం, వీఆర్ కోట పోలింగ్ కేంద్రాల్లో సుమారు గంటసేపు ఈవీఎంలు మొరాయించాయి. అలాగే మండలంలోని మొగిలిచెర్ల, లింగసముద్రంలోని పోలింగ్ బూతులలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్, గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్సై బాజీబాబులు సిబ్బందితో తరలి వచ్చి సర్దుబాటు చేశారు. లింగసముద్రం, పెదపవని, వాకమళ్లవారిపాలెం గ్రామాలలో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. వాకమళ్లవారిపాలెం బూతులో సాయంత్రం 5 గంటల సమయంలో వీవీ ప్యాట్ స్లిప్ బాక్స్‌లో పడక పోవడంతో టీడీపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సుమారు 3 గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది. డీఎస్పీ శ్రీనివాస్ వచ్చి ఇరువార్గలతో మాట్లాడి మరో వీవీ ప్యాట్ బాక్స్‌ను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పెద్దగా లేకపోవడం విశేషం.

ఆత్మకూరు : నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్‌లో కొన్ని చోట్ల స్వల్ప ఘర్షణలు, తోపులాటలు మినహా ప్రశాంతంగా జరిగింది. మర్రిపాడు మండలం చుంచులూరు, అనంతసాగరం మండలం ఎగువపల్లిలోని పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతసాగరం మండలం మినగల్లులో 85 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మిషన్ పనిచేయకపోవడంతో కొంతసేపు ఓటర్లు నిరీక్షించారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని నెల్లూరుపాళెంలో ఒకేచోట రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఓటర్లు కిక్కిరిసిపోయారు. దానికి తోడు పోలింగ్ కేంద్రాల్లో సరిగా కిటికీలు లేకపోవడంతో ఊపిరాడక 7 మంది మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు. దాంతో ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చే యడంతో కొంతసేపు పో లింగ్‌కు అంతరాయం కలిగింది. టీడీపీ అభ్య ర్థి ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరులోని సంతపేటలో కాంగ్రెస్ అభ్యర్థి చేవూరు శ్రీధర్‌రెడ్డి ఆత్మకూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి గూటూరు మురళీకన్నబాబు కరటంపా డులో, జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆత్మకూరులో తమ ఓటును వేశారు. హింసాత్మక ఘటనలు లేకుండా ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.

ఏఎస్ పేట : మండలంలోని అనుమసముద్రం,



ఆత్మకూరు : కరటంపాడులో ఓటర్ల బారులు



ఏఎస్‌పేట : సాయంత్రం 6 తరువాత క్యూలో...

అబ్బసాహెబ్ పేటలో సాయం త్రం 6గంటల తరువాత కూడా క్యూలో ఓ టర్లు ఉండడంతో 7గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. అబ్బాసాహెబ్ పేట ఈవీఎం మిషన్లు మొరాయించడంతో రాత్రి 9:10 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. గండువారిపల్లి, పెద్దహబిబీపురం చౌటభీమవరం, చందులూరుపాడులో 90శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

మర్రిపాడు : మండలంలో 35,364 మంది ఓటర్లు ఉండగా 82శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్రాంహ్మణపల్లిలో ఆత్మకూరు వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటును



సంగం: చంటి బిడ్డలతో పోలింగ్‌కు వచ్చిన తల్లులు

వినియోగించుకున్నారు.

సంగం: చెన్నవరపాడులో తప్ప మిగిలిన చోట్ల ప్రశాంతంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7-00లకే పోలింగ్ ప్రారంభమవగా సంగంలోని 209, 220, 224, 261వ పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో దాని స్థానంలో మరొక ఏర్పాటు చేయడంతో 15 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. 208 పోలింగ్ కేంద్రంలో సిబ్బంది వల్ల మాక్ పోలింగ్ ఆలస్యంతో 15 నిమిషాల ఆలస్యం అయ్యింది. చెన్నవరపాడులో ఓ మహిళ ఓటు విషయంపై ఇరువర్గాలు వాదన పడి ఘర్షణ పడారు. ఈ ఘర్షణలో డిల్లీబాబు అనే వ్యక్తికి స్వల్ప గాయాలైనాయి. పెరమన, మక్తాపురం, అనసూయనగర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమయం ముగిసే సమయంలో ఓటర్లు ఒక్కసారిగా రావడంతో రాత్రి వరకు పోలింగ్ జరిగింది.

అనంతసాగరం : మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల సరళి ఆలస్యంగా జరగడంతో క్యూలైన్‌లో ఓటర్లు గంటల తరబడి నిరీక్షించారు. వృద్ధులు, గర్భవతులు, వికలాంగులకు ప్రతేక ఏర్పాట్లు చేయకపోవడంతో అవస్థలు పడ్డారు. లింగంగుంటలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 9-30 గంటల వరకు ఓటింగ్ జరగలేదు. మినగల్లు, అగ్రహారం, కొత్తపల్లి, ఎగువపల్లిలో వైసీపీ, టీడీపీ శ్రేణులు మధ్య గొడవ జరగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సాయంత్రం ఆరు గంటల వరకు కూడా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమ్మవారిపల్లిలోని పోలింగ్ కేంద్రం వద్ద రిజర్వు ఇన్‌స్పెక్టర్ ధామస్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించాడని ఆగ్రహించి ఆయనతో వాదనకు దిగారు. సమాచారం తెలుసుకొన్న అదనపు పోలీసు సిబ్బంది అక్కడకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.



ఏ సాగరం : సోమశిలలో నిరసించిన మహిళలు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైనా 9 గంటల వరకు 1.61 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఓటర్లకు పంపిణీ చేసే డబ్బులను స్థానిక నాయకులు నొక్కేశారని ఆరోపణలు చేస్తూ ఓటర్లు ఓటు వేసేందుకు రాకుండా ఇళ్లల్లోనే ఉండిపోయారు. టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని తెలుసుకొన్నారు. పలు మండలాల్లో కురిసిన వర్షానికి పోలింగ్ ప్రక్రియకు అంతరాయం ఏర్పడింది. వరికుంటపాడులోని 84, 85 పోలింగ్ బూత్‌లతో పాటు ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లి, దుర్గంపల్లి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరులోని ఈవీఎంలు మొరాయించారు. ఉదయగిరి, సీతారామపురం, బసినేనిపల్లి, సింగారెడ్డిపల్లి, వరికుంటపాడు మండలంలోని తోటలచెరువుపల్లి, నార్త్‌కొండాయపాళెం, కనియంపాడు, తూర్పురొంపిదొడ్లలో చిన్నపాటి ఘర్షణలతోపాటు తోపులాటలు జరిగాయి. పోలీసులు రంగ



ఉదయగిరి పోలింగ్ కేంద్రంలో...

ప్రవేశంతో సమస్య సద్దు మణిగింది. కృష్ణంపల్లి పోలింగ్ కేంద్రంలో వైసీపీ నాయకులు, ఏపీవో మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. వృద్ధుల ఓట్లను పోల్ చేసే క్రమంలో ఏపీవో టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని వాదనకు దిగారు. ఈ విషయాన్ని నాయకులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఏఆర్వో నెహ్రూబాబు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని నాయకులతో చర్చించి ఏపీవోను ఉదయగిరికి తరలించారు. కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరడంతో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ అనంతరం 8 మండలాల పరిధిలో పోలింగ్ కేంద్రాల నుంచి బస్సుల ద్వారా ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లు, ఇతర ఎన్నికల సామాగ్రిని ఉదయగిరిలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు.

వింజమూరు: మండలంలో చెదురుముదురు సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రధాన పార్టీ వారు కూడా పోటాపోటీగా ఓటర్లను తరలించి ఓటుని వేయించారు. కాగా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అల్లూరు : నార్తుమోపూరులో వేమిరెడ్డి



కర్ఫ్యూను తలపిస్తున్న కందుకూరు పట్టణం


వరికుంటపాడు: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఉద్రిక్త పరిస్థితుల నడుమ సాగాయి. కొంత సమయం సజావుగా సాగినప్పటికీ ఆపై తోటలచెరువుపల్లి, నార్త్‌కొండాయపాలెం, నార్త్‌కృష్ణంరాజుపల్లి, విరువూరు, జడదేవి, తూర్పుగొంపిదొడ్ల, రామదేవులపాడు, వరికుంటపాడు గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయల మధ్య చోటుచేసుకొన్న వాగ్వివాదాలు తోపులాటతో పాటు ఉద్రిక్త పరిస్థితులు



కలిగిరి: వీల్‌చైర్లో వృద్ధురాలిని తరలిస్తున్న సిబ్బంది

నెలకొన్నాయి. తిమ్మరెడ్డిపల్లి, తూర్పుబోయమడగల, దక్కనూరు గ్రామాల్లో రాత్రి వరకు ఓటర్లు వేచి చూడాల్సి వచ్చింది. రాత్రి సమయం ఒక్కసారిగా ఉరుములు, మె రుపులతో వర్షం పడడంతో ఓటర్ల కోసం కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు నెలకొరగడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, తన తనయుడు అభినవ్‌రెడ్డితో కలసి తిమ్మారెడ్డిపల్లి పోలింగ్ కేంద్రంలో ఉన్నాడు. విషయం తెలుసుకొన్న టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు కార్యకర్తలతో అక్కడకు చేరుకొని ఇరువురు బయటకు పంపిచాలంటూ పోలీసులను డిమాండ్ చేశారు. వర్షం కురున్నా రోడ్డుపై బైఠాయిస్తామని హెచ్చరించడంతో మేకపాటి బయటకు వచ్చేవరకు అక్కడే వేచి ఉండడంతో చేసేదేమిలేక ఇరువురిని అధికారులు బయటకు పంపించారు.

ఉదయం 6 గంటలకే తరలివచ్చిన ఓటర్లు



ఓటు హక్కు వినియోగించుకున్న బొల్లినేని

కలిగిరి : మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 6 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. వృద్ధులను కుటుంబ సభ్యులు తీసుకొచ్చి ఓటు వేయించారు. యువతీ యువకులు పోటీపడి తొలిసారిగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొన్ని కేంద్రాల్లో అధికారుల అలసత్వంతో పోలింగ్ ప్రారంభం ఆలస్యమైనప్పటికీ ఎలాంటి వివాదాలకు తావులేకుండా పో లింగ్ జరిగింది. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మె ల్యే బొల్లినేని వెంకటరామారావు పెదకొండూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖరరెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతకుమారి పోలింగ్‌సరళిని పరిశీలించారు.



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు

వెల్లువెత్తిన చైతన్యం

కొండాపురం : మండలంలోని 19 పంచాయతీల పరిధిలో ఓటర్లలో చైతన్యం పెరిగింది. కొండాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ సరళిని ఎన్డీయే కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ పరిశీలించారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార రీత్యా హైదరాబాదు, విశాఖపట్నం, చెన్నై, విజయవాడ నగరాలకు వలస వెళ్లిన మండల వాసులు ఓటు వేసేందుకు బస్సులు, కార్లలో తరలివచ్చారు. పోలింగ్ సమయం ముగిసినప్పటికీ 6 గంటల తర్వాత గొట్టిగుండాల, గుడవళ్లూరు, భీమవరప్పాడు గ్రామాలలో ఓటర్లు ఉండటంతో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ ప్రశాతంగా ముగియడంతో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ఊపిరి పీల్చుకున్నారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న వంటేరు

బారులు తీరిన..

జలదంకి : మండలంలో సార్వత్రి ఎన్నికల పోలింగ్ ప్రశాంతగా ముగిసింది. ఓటర్లు ఉదయం 7 గంటలకే పోలింగ్ బూతులవద్ద బారులు దీరారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సగం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఎన్డీయే కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి పరిశీలించారు. అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించినా తర్వాత పనిచేయడంతో పోలింగ్ ముగిసింది.



కలువాయి: క్యూలో ఉన్న ఓటర్లు

కలువాయి: ఉదయం 7గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు హక్కు వనియోగించుకున్నారు. సాయంత్రం 6గంటల కు పోలింగ్ ముగిసే సమయానికి పెద్దఎత్తున ఓటర్లు క్యూ లో ఉండటంతో చింతలపాళెం, దాచూరు, కుల్లూరు, పెరం కొండ, బ్రాహ్మణపల్లి, వెడనపర్తిలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ కొనసాగింది.



వరికుంటపాడు : వర్షానికి కూలిన షామియానా